
Regd·No· M· 4479· Andhra Patrika [illegible] Weekly



ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక



4 అణాలు
27-2-57
ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

చెమట దుర్గంధమునకు, సామాన్య చర్మ వ్యాధులకు

వైజ్ఞానికంగా సరి క్రొత్తగా కనిపెట్టబడినది

ఎక్టమర్

ఇప్పుడు భారతదేశమందు, సౌందర్యమునిచ్చు సబ్బులో నున్నది

చర్మ క్రిములను చంపునట్టి ఔషధములు, మంచివి, చెడ్డవి, చాలా కాలమునుండియు తెలిసియున్నవే క్రొత్తదేమిటనగా, చాలా కాలము నిలవుండునట్టి గుణము గలది. అట్టి కనిపెట్టబడినది, మాన్‌సెన్‌టోవారి 'ఎక్టమర్' (బైత్యోనాల్)

ఈనాడు, మీరు భారతదేశమందు 'ఎక్టమర్'తోగూడిన టాయిలెట్ సబ్బును కొనగలరు: అది బ్రీజ్: ఆలోచించండి — మీరు ప్రతి రోజూ ఉపయోగించుచూ, బ్రీజ్‌ను 3 బిళ్లలవరకూ మాత్రమే వాడిన తరువాత మీ చర్మము దాదాపుగా క్రిమిరహితమైనదగును. మీరు క్రిమిరహితమైన చర్మమువల్ల ఏమి లాభమును పొందెదరో దిగువ వివరింపబడినది.

- చెమట దుర్గంధము తొలగింపబడును — చర్మ క్రిములు దానిని కలిగించును
- చర్మ వ్యాధులనుండి రక్షణ — ఈ క్రిములు సామాన్యమైనట్టి అనేక చర్మ వ్యాధులను గలిగించును.

మీరు బ్రీజ్‌ను ఇష్టపడెదరు — దీని విషయంలో కొంత ఎక్కువ ప్రత్యేకత గలదు. ఇది పరిమళమైనట్టి, శమనకరమైన, సౌందర్యమునిచ్చు సబ్బు ఇది చర్మమును కాపాడునట్టి 'ఎక్టమర్'ను గలిగియున్నది. బ్రీజ్ ఇతర సబ్బులకంటె కొంచెమే ఎక్కువ ఖరీదుండును. మీరు దీనిని చాలా కాలము వరకూ ఉపయోగించుకొనవచ్చును.

నేడే బ్రీజ్‌ను కొనుడు



ఈ సౌందర్యమునిచ్చు సబ్బు ప్రత్యేకమైనది — అది బ్రీజ్

బ్రీజ్

టాయిలెట్ సబ్బు

'ఎక్టమర్'ను గలిగియున్న

ఎరాస్మిక్ కంపెనీ లిమిటెడ్: లండన్, వారి తరపున భారతదేశంలో తయారుచేయబడినది

[illegible]


JASMINE
మీరు అందంగా కనపడతారు
జస్మిన్
రేయాన్ సిల్కులో
జస్మిన్ మిల్స్ ప్రైవట్ లిమిటెడ్, బొంబాయి - 2
JM 56 S

సంవత్సర చందా రు. 12-0-0 విడిపత్రిక 4 అ.	ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక Founder : K. NAGESWARA RAO	సంపుటము 51 సంచిక 26 27-2-57

దుర్ముఖ మాఘ బహుళ త్రయోదశి బుధవారం

★

★

గమనిక

స్థలాభావంచేత ఈ వారం "మంత్రాలు; నమ్మకాలు" శీర్షిక ప్రచురించలేదు. —సం.

శ్రీరామసూక్తి

అది గోదావరీతీరం! అల్లదే పంచవటి ప్రాంతాన పర్ణశాల ప్రభాతారుణ కిరణాలలో పంచవటి పరిశుభ్రశ్వేతరై ధవళకాంతుల నీనుచున్నది! ఆశ్రమానికి అల్లంతదూరాన అదే సీతారామలక్ష్మణులు.

అరుణోదయాత్పూర్వమే దైనందిన కార్యక్రమానుసారం పావనగౌతమీ జలాలలో స్నానంచేయటానికి బయలుదేరి వస్తున్నారు. స్వచ్ఛజ్యోత్స్నలు చిందు చంద్రునికి ప్రియమైన శరత్కాలాన్ని త్రోసికొని హేమంతతుషారం కురుస్తున్నది. ఆ మంచులో బయలుదేరి నిర్మల శీతలోదకాలలో స్నానమాడి వస్తూవున్న సీతారాములను అనుసరించే లక్ష్మణస్వామి మనసులో ఒకానొక ఊహ ఉదయించినది.

హేమంతకాల ప్రభాతవేళ నవవికసిత కుసుమకోమలాంగులు అతిశీతలోదక ప్రవాహమున స్నానమ్మాడి, ఘాతవల్కలాలు ధరించవలసి రావటం ఎంత దురదృష్టం! ఎండకన్నెరుగని రాచనగరులో పెరిగిన సీతాదేవి, నిరంతర రాజభోగములతో విరాజిల్లు శ్రీరామచంద్రమూర్తి ఈ హేమంత శీతలాన్ని భరించగలరా!

ఆలోచనలోవున్న లక్ష్మణుని మనోనేత్రమందు సామ్రాజ్యాధిపతి అయిన భరతుడు గోచరించాడు. సరిగా ఇదే సమయానికి భరతుడు సరయూతరంగాలలో స్నానమాడి, ఇంతటి క్లేశాన్ని అనుభవిస్తూ ఉంటాడు. సర్వభోగభాగ్యములకు ఆలవాలమైన సామ్రాజ్యాన్ని పాలిస్తూ భోగభాగ్యాదులను త్యజించి మహాత్యాగియై ఈ దుర్భర శీతల బాధననుభవిస్తూ సరయూజలాలతో రాముని పాదుకలను అభిషేకించే ప్రయత్నంలో ఉంటాడు

రాజభోగానుభవానుభూతి నందవలసిన శ్రీరామచంద్రుడు మహారాణియై, సాకేతనారీలోకానికి ఆదర్శమూర్తి కావలసిన సీత అరణ్యాలపాలు కావటానికి, మహారాజ్యాధిపతి అయిన భరతుడు సుఖభోగాన్ని అనుభవించలేక పోవటానికి మూలకారణం కైకకదా!

కైక! ఈ పేరు లక్ష్మణుని మనసులో మెసలుసరికి అతని సర్వేంద్రియములు ఉగ్రములయినవి ఒక మహావేశము అతనిని ఆవహించినది. ఈ సర్వానర్థములకు మూల



ప్రధాని నెహ్రూ
ఎన్నికల ప్రచారానికై 22న
విజయవాడకు రాక

కారకురాలు కైక! అతని కన్నులలో విస్ఫులింగములు ఎగసినవి పెదవులు అరుణములై కనిపించినవి ఆపాదశిరఃపర్యంతం క్రోధస్ఫూర్తి తాండవించుచున్నది. అంతలో అతని పెదవులనుండి "భర్తా దశరథో యస్యాః సాధుశ్చ భరతస్సుతః। కథన్ను సాంబా కైకేయీ తాదృశీ క్రూరశీలినీ" అను వాక్యములు వెలువడినవి!

సత్యవాక్పరిపాలకుడైన దశరథుని భర్తగా బడసి సాధుమూర్తి అయిన భరతుని కుమారునిగా కన్న కైక ఇంతటి క్రూరశీలము నెట్లు ధరించినది!

ఈ వాక్యములు రాముని చెవినబడిన మాత్రమున నే ఒకానొక విచిత్రభావమును ప్రతిబింబింపజేయు హాసముతో వెనుదిరిగి—

"న తేఽమ్బా మధ్యమా తాత
గర్హితవ్యా కదాచన ।
తామేవేక్ష్వాకునాథస్య
భరతస్య కథాం కురు!"

అనినాడు—

"లక్ష్మణా! ఎంతటి అసంబద్ధమైన ఆలోచన చేసితివోయీ! త్యాగధనుడు, సాధుశీలుడు అయిన భరతునిపై నీకు గల గౌరవభావము నభివ్యక్తీకరించుటకు కైకను దూషించవలసిన పని యేమున్నది? నీ అభిమానపాత్రుడైన భరతుని ప్రశంసించుకొనుము. అంతేకాని భూషణము చేయువేళ కైకను దూషించుటకూడని పని!" అని దీని తాత్పర్యము.

ఈ శ్లోకద్వయముతో వాల్మీకి ప్రపంచమునకు ఒకానొక మహత్తర సందేశమొసంగినాడు. వాల్మీకి, మహర్షియైన కవి గనుకనే ఈ సన్నివేశమును సృష్టించినాడు.

మహాకవుల భావనలో వెలువడిన సత్యసూక్తులు త్రికాలాబాధితములు. ఈనాటి రాజకీయ వాతావరణమును, ఎన్నికల పరిస్థితిని పరిశీలించినచో వాల్మీకి భావనలోని ఉదాత్తత, గాంభీర్యము గోచరించును.

ఒకానొక అభ్యర్థి గుణగణములను వర్ణించుటకు, మారు ప్రత్యర్థిని దూషించు వైచిత్ర్యమును మనము చూచుచున్నాము

ఇట్టి స్థితిలో ఆదికవియైన వాల్మీకి మునీంద్రుని వాక్యములను ప్రాజ్ఞులు స్మరణకు దెచ్చుకొనదగినవి కాదా? ★

—పురాణపండ రామమూర్తి]

"కథ పడిందోయ్!"

చేతిలో కలం బక్కడ పెట్టి, కాళ్ళూ చేతులూ కడుక్కుని, గబగబా చిన్నాడి ఎక్సర్‌సైజు పుస్తకంలోనుంచి పది కాయితాలు ఫ్రరున చించి, పెన్నులోని పాత సిరా పారబోసి, క్రొత్తసిరా నింపి, కాగితాలకు పిన్ను గుచ్చి, వెళ్ళి వాలు కుర్చీలో కూర్చుని చకచకా రాసేస్తున్నాడు, ధర్మవర్మ—ఒక కథ . !

"పత్రికండీ బాబూ.. "

"...ఇక్కడ పడేసి వెళ్లు . "

"డెయిలీ కూడా కావాలాండీ?"

"వద్దులేవోయ్..."

"........ ..."

"ఆఁ, ఏయ్ కుఱ్ఱాడా...డెయిలీ కూడా ఒకటిచ్చి వెళ్లు.. "

"...డబ్బులండీ!"

"...రేపు రా!"

"..... .. .. .. "

పెన్ను బల్లమీద పెట్టి, సిగరెట్ ముట్టించి, పత్రికలోవున్న కథల హెడ్డింగులూ, బొమ్మలూ—అన్నీ ఒక్కసారి చూసేసి, సినీమా పేజీలు కూడా గబగబా తిరగేశాడు, పది నిమిషాల సేపు.

"సరే" అని దాన్ని క్రింద పడేశాడు.

దినపత్రిక తెరిచాడు—

"సూయజ్ సమస్య—ఫలానా నాయకుడు ఫలానా దేశపర్యటన—ఫలానాచోట జరిగిన వింతగాథ—ఫలానా సినిమా, ఫలానా ఫలానా కేంద్రాల్లో నేడే విడుదల—సంపాదకీయం—ఫలానా కంపెనీ వారి మకరధ్వజం—వేలం నోటీసు—కావలెను—గ్రంథ సమీక్ష—వార ఫలాలు, తారాబలం—..."

"ఓహో, ఇవ్వాళ్ళ ఆదివారంగా—సరే..."

"మీనం—"

"ఈ వారం మీకు చాల అనుకూలమైన కాలం. తలచినపనులు చాలవరకు నెరవేరుతాయి. ఉద్యోగ, వ్యాపార విషయాలలో అభివృద్ధి. ఇప్పటివరకూ మీకు శత్రువులుగా వున్నవారంతా మిత్రులౌతారు. ఈవారంలో మీకు అనారోగ్యం కలిగే సూచనలు కొద్దిగా కనిపిస్తున్నాయి. డబ్బు కిబ్బంది తగ్గే సూచనలు ఈ వారంలో జరిగే కొన్ని కార్యాలవల్ల కన్పిస్తున్నాయి. ఎన్నాళ్ళనుంచో మీరు అనుకుంటూవున్న ఒక కార్యం ఈ వారంలో తప్పక సిద్ధిస్తుంది. 26, 27, 28 తేదీలలో శుభకార్యాలు, ప్రయాణం, ఖర్చు; కొద్దిగా మనస్సు చీకాకు."

"ఓ! బ్రహ్మాండంగా వుంది; ఇంకేం!

"ఊఁ, తరువాత..."

"క్రీడారంగం—వాతావరణ సూచనలు, ఫలానా కంపెనీ వారి క్రొసవర్డ్స్—హృద్రోగంవల్ల మరణం—వివాహం—"

"ఊఁ, సరే యేవో యేడవనీ . "

ఆఖరి దమ్ము గట్టిగా పీల్చి, సిగరెట్ అవతల పడేశాడు. రచయిత ధర్మవర్మ.

* * *

"ఏమండోయ్!"

" ...."

"ఏమండీ!"

"..... ......"

"విన్పించుకోరేమండీ?..."

".. ఆఁ, ఏమిటీ?"

పెండ్యాల సుభద్ర

"నా బొంద!...ఎన్నిసార్లు కేకేసినా వినిపించుకోరేమిటండీ.. ?"

"...సరే! అసలు సంగతేమిటీ?"

"ఏమిటేమిటి?..... ఈ పూట తిండీ తిప్పలూ యేమీ అక్కర్లేదా యేమిటీ?... అప్పుడే పన్నెండవుతోంది!"

"లేకేం గానీండీ..." అంటూ రాసిన పేజీలు ఒకసారి తిరగేసి చదువుకుంటూ (లోలోపల) తన కవితా చమత్కృతికి తానే మురిసిపోతున్నాడు, ధర్మవర్మ.

"...ఊఁ, ఇహ సరే! అదేమిటో పూర్తి చేసుకుని వెళ్ళి పెట్టుకు తినండి, నా కిహ నిద్దరొస్తోందిగాని..."

"అబ్బెబ్బే! దుర్గా! వస్తున్నా..."

"ఐతే త్వరగా రండి మరి..."

"వస్తాలే...నువ్వోకసారిలారా మరి..."

"ఎందుకూ?"

"రా, చెప్తాను"..."ఇదుగో చూడు, నేను రాస్తున్న కథ యెల్లా వుందో!

"ఏమిటండీ అది?"

"ఇదీ ఒక కథ! అందులో ఒక రసవత్తర ఘట్టం చదివి వినిపిస్తా విను!...అచ్చంగా మన గొడవలాటిదే!"

* * *

"పారూ!...పారూ!"

".. ఏమిటండి, పారూ, పారూ అని ఒకటే గోల?"

"... . . "

"పారూ యేమిటి, పారూ?.....అంచక్కని పేరుంటే, పార్వతీ అని పిలవలేరూ?"

"అబ్బ! అంత కోపమైతే ఎలా?..."

"లేకపోతే పారూ యేమిటి, తాగుబోతు దేవదాసల్లే?...పేరెట్టి పిలవలేరూ?"

"అబ్బబ్బ! పోనీలే, యేదో తెలియక అలా పిలిచాను.. బుద్ధొచ్చింది. ...ఇంకెప్పుడూ పిలవను సరేనా ?".. " ఆఁ, అది సరేగాని, టైమెంత?"

" ..ఎనిమిదింబావు."

"ఓ మై గాడ్! ఎనిమిదింబావే?...అయితే యిందాకట్నుంచి నన్నెందుకు లేపలేదు.? సరే పోన్లే, ఏది నా టూత్ బ్రష్, పేస్టు.."

"లేచి యేంలాభం . "

"అదేమిటి?...ఇంకా కాఫీకాలేదా.?"

"ఎల్లా అవుతుంది...? కాఫీపొడరు లేదని నిన్నట్నుంచీ నెత్తిన నోరెట్టుకుని మొత్తుకున్నా వినిపిస్తేగా, దొరగారికి.. ?"

"ఖూని చేసిపారేశావ్ పో! ఇప్పుడెలా...? కాఫీపొడ రెవరు తెస్తారు...?"

"మీరే...!"

"హయ్యో! కాఫీ తాగందే బైటికిపోతూ అలవాటులేదే, మనకి?"

"ఊఁ, వుండదు..! నేను చెప్పే మాటంటే మీ కసలు లెక్కలేదు...చెప్పే మాట ఈ చెవితో వినకుండానే ఆ చెవితో వదిలేస్తారయ్యె! ఎప్పుడూ మీ భక్తుల గొడవ, శిక్తుల గొడవ తప్పితే మరొక గొడవేమీ లేదుగదా...!"

"హే రామచంద్రా...! ఏం సాధించి చట్టు బండలు పెడుతోందిరా నాయనా... ఓ మహాతల్లీ! నీకు వెయ్యిదణ్ణాలు పెడ్తాను గాని, ఇహ ఆపు.. ఇవ్వాల్టికి ఆపు... ఇవ్వాళ్ళ నీకొక షిఫాన్ చీర, ఒక సవాసేరు మల్లెపూలు యిప్పించుకుంటాను; ఒక జత వంకీ (ఝునక్ ఝునక్ పాయల్ బాజే) గాజులూ, మరి యింకా దేముడు చల్లగ మేలుచేస్తే.. సినిమాకీ..."

"ఊఁ, నాకేమీ అక్కర్లేదు..."

"ఆల్ రైట్! అక్కర్లేకపోతే మరీ మంచిదిగాని, మన నౌఖర్లంతా యేరీ... మన నందిగాడేడీ...?...ఒరేయ్! నందీ! నందీ! . "

"ఆఁ, నందీ, కుందీను...వాడిక్కడెక్క

ఉంటాడు? ఏ కాఫీ హోటలుకో, సిగరెట్టు తగలెయ్యటానికో పోయుంటాడు..."

"ఆఁ అప్పుడే? ఇంకా యీ వెధవ—ఈ శంకరుడు—ఇంకా మొహమే కడగలేదు, వాడప్పుడే కాఫీకోసం పోయాడా...? పోనీ కాఫీ పొడరు లేదని తెలిసిందానివి వాడిచేత నైనా తెప్పించకపోయావా?"

"ఆ!"... "వాడిచేతికి డబ్బులిస్తే ఇహ మనమే మీ సంసారం చెయ్యక్కర్లేదు టండీ ...? సగానికి సగం వాడి కమీషన్, వాడు చెప్పేవన్నీ దొంగ లెక్కలే...! అయినా డబ్బు లెక్కడున్నయ్?"

"ఏమిటీ! దొంగ లెక్కలు చెప్తున్నాడా? కమీషన్ కొడుతున్నాడా...? ఏం చేస్తున్నాడీ డబ్బులన్నీ?"

"ఏం చేస్తాడు; ఎన్ని డబ్బులైనా వాడి 'చార్ మినార్' సిగరెట్లకే చాలవు..."

"వాట్?...రానీ వాడిపని చెపుతాను, వెధవని..."

"అన్నీ చెప్పారులేగాని, ఇప్పుడు కాఫీ మాటేమిటి, చెప్పండి."

"కాఫీ!...ఓ! కాఫీ...అవును, కాఫీ మా-టే-మి-టి-?"..."ఆఁ, మన గణపతిని పంపిద్దూ!"

"అయ్యో! రామ!......వా డేనాడో పలాయనించాడండీ!"

"ఎక్కడికి?"

"సంచారానికి."

"ఇప్పు డేంసంచారం, పొద్దున్నే?"

"వాడికివ్వాళ్లి పది టెంకాయలో, శతమో అర్ధశతమో ఉండ్రాళ్లూ పెడతానన్నారట యెవరో?"

"ఎందుకూ?"

"వాళ్లబ్బాయికి అక్షరాభ్యాసం చేయించి బళ్లో వేయిస్తున్నారట."

"......................."

* * *

"చాలు, చాలు! ఇహ ఆపండి, రామాయణం."

"ఏం? నేను రాసింది బాగోలా?"

"ఉంది, ఉంది!"

"ఎల్లా?"


"అఘోరించినట్టు."

"హూఁ, అన్నావ్...? నాకు తెలుసు నువ్వంటావని...... అయినా నీతో నాకు లెక్కేమిటి?... నువ్వు నోటికొచ్చినట్లల్లా పేలంగానే సరా...?"

"ఊఁ, చాలుగాని, ఇకనైనా లేవండి, భోజనానికి!"

"అబ్బ! వుండవే! రోజూచేసే భోజనాని కేమిటే గొడవ...? ఈ కథ పత్రికవాళ్లు వేసుకున్నారంటే ఐదో, పదో రకాలని రాలతాయి చేతిలో... పైగా మనపేరు దశ


(51-వ పేజీ చూడండి)



బుడుగు! చిచ్చులపిడుగు

ఐతే చిన్నపిల్లలసంగతి మనకెందుకులే. మనకెందుకులే అంటే మనకి ఒద్దూ అని అర్థం.

ఇప్పుడు అమ్మ చూడు. చదువు మన కెందుకులే అంటుంది గదా



నన్ను. అంటే చదువు ఒద్దులే అనిఅర్థం. అదీ సంగతి.

ఏమిటి? ఆడపిల్లల గురించి కొంచెం చెప్పాలి. ఆడపిల్లలంటే బాబాయీ వాళ్లు తాళ్ళెట్టు, ఇస్తా నంటారూ వాళ్లు.

సీగానపెసూనాంబ కూడా ఆడపిల్లేగాని, అది బాఘా చిన్నపిల్ల నుకో. దానికి తెలుగుకూడా బాగా రాదు.

నన్ను బుడుగూ అనికూడా అన లేదు. బుడుగూ అనీ బులుగూ అనీ అంతుంది. దానికి అసలు మాతలా ద్దమే చాతకాదు. మరీ చిన్నపిల్ల. అయినా రెండు జడలు వసుకుంతుం దనుకో.

మనం బోల్డు పెద్దవాళ్లం కాబట్టి పెద్దవాళ్లను గురించే మాటాడాలి. ఇలాని బాబాయి చెప్పాడు. తాళ్ళెట్టు పెద్దవాళ్లకే యియ్యాలి అన్నమాట.

అంటే యిప్పుడు బాలరాజు సినిమా జయసింహ్మ సినిమా ఉన్నాయిగదా. నాగేసరావు, ఎం. టి. రామారావూ ఇలా నించుంటారా చెట్టు దగ్గిర. అప్పుడు అంజలీయేనా సావిత్రియేనా వస్తుంది గదా.

మరి అది యెవరోవేపు యిలా కళ్లు అస్సలు మూసుకోకుండా చూస్తుందిగదా. అప్పుడు పాట పాడుతుందా. అప్పుడేమో యెవరో కూడా యిలా నవ్వి ఆగు అని చెయ్యి ఎత్తుతాడా.

మరి అది పాట మానదుగా. కాని పరిగెత్తు కెళ్ళిపోతుంది. అప్పుడేమో యెవరో ఆగు పారిపోకు అని గాఠిగా పాట పాడుతూ పరిగెట్టు కాడు.

మీ నాన్నతో చెపుతుందని బయంగా వాడికి. అందుకు.

అప్పుడేమో అది మళ్లీ బిర్జి మీద ఆగి యిలా కళ్లు మూసుకోకుండా చూసి నవుతుందో. నువ్వూ నేనూ ఇంకా బోల్డు రౌడీలూ ఈల వేస్తాంకూఢా.

అప్పుడు యిద్దరూ పాడతారు గదా.

ఆ పాటపేరు లౌ సాంగు అని బాబాయి చెప్పాడు...వాడికి లౌ సాంగులు చాలా వచ్చును. ఇంట్లో పాడితే బామ్మ కోప్పడేస్తుందనుకో.

అందికని బీచిలో పాడతాడులే.

బాబాయికి సినిమాలూ, లౌ సాంగులూ, సిగరెట్టులూ, ఆడపిల్లలూ, బామ్మ వత్తుల పెట్టిలో డబ్బులూ, బడికి సెలవులూ అంటే చ్చాలా యిష్టం.

అందికనే బాబాయీ నేనూ రోఝూ సాయింతరం బీచీ దగ్గిరికి వెళ్తాం.

అక్కడేగా ఆడబడ వుంద మరి.


అసలు బడి అంటే గుడి అని అర్దం. ఇలా అని నాన్న చెప్పాడు. నానకి బాగా తెలీదనుకో.


అసలు బడి అంటే అర్థం లేదూ అని బాబాయి చెప్పాడు.

కాని గుడి అంటే ఆడబడీ అని అర్దం ఉందిట. అదీ సంగతి.

అందికనే నేనూ బాబాయీ, ఇంకా బోల్డు బోల్డు బాబాయిలూ బొమ్మలుచొక్కాలు తొడుక్కుని, ఫవుడర్లు అద్దుకుని, సిగరొత్తులు కాలుస్తూ ఈ గుడి దగ్గిరికి వస్తారు గదా.

గుడి లోపలికి వెళ్లరనుకో.





[illegible] గుడిలోంచి రెండు జెడలు వేసుకున్న సీత ఒస్తూందిగా. ఇంకా బోల్డు జెడలు వేసుకున్న సీతలు వస్తాయనుకో.

అప్పుడు బాబాయి నవ్వుతాడు. సీత నవ్వుతుంది.

ఒక్కో సీత ఇలా హూం అనీ కోప్ప జేస్తుంది. ఇలాటి సీతని చూస్తే బాబాయికి బయం.

బయం అంటే కోపం అని అర్థంగా మరి.

అందుకని బాబాయి వురేయ్ వురేయ్ బుజుగూ మరేమోనూ, నువ్వూ ఆ సీతని ఏడిపించరా అంటాడు.

నేను సీతని ఏడిపిస్తే దానికి కోపం వస్తుంది. అప్పుడు మనికి కొంచెం డేంజెరనుకో. మనని ఎవరూ రక్షించరు కూడా.

రేపో మూడ్రోలుకో ఏం జరిగింది తెలుసా?

ఒక బాబాయీ, ఇంకో ఆరు బాబాయిలూ, నేను కలసి ఈ ఆడబడికి వెళ్ళాము.

అప్పుడు ఇందిర వచ్చిందిగదా రెండు జెడలు వేసుకుందామరి. ఇందిర అంటే కాలేజీ అమ్మాయి అని అర్థం.

ఈ ఇందిరేమో వాళ్లకి తెలీదు. మరి యెలా మాట్లాడ్డం?

ఒక బాబాయేమో నన్ను పిల్చి వురేయ్ సత్తరకాయీ సత్తరకాయీ మరేమో నువ్వూ ఈలవేసి ఇందిరిని పిలవరా అన్నాడు.

నన్ను కొట్టుతుంది బాబూ అని చెప్పాను.

అయినా, ఫరవాలేదులే అన్నాడు వాడు.

ఫరవాలేదులే అంటే, కొట్టితే కొట్టనీ అని అర్థం, మరి ఇందిర నను కొట్టిందిగా అందుకని

నేను మెల్లిగా ఈలవేశాను.

అలా కాదూ గాటిగా వెయ్యాలి, వేసి రెండు జెడల పిల్లా అని పిలవాలి అన్నాడు వారు.

సరేగదా పాపం అని నేను అలా పిలిచానుగదా.

అప్పుడేమో ఆ యిందిర ఘుబుక్కుని ఇటువేపు తిరిగి పోకిరీవాడులారా అనేసింది.

కాని అప్పుడు చూస్తే, ఒక బాబాయీ లేడు, ప్పది బాబాయిలుకూడా అక్కడ లేరు. వాళ్లు అందరూ గట్టుమీద కూచున్నారు.

నేను ఒక్కడే అక్కడ ఉన్నాడు.

నేను హాచ్చర్యపడిపోయేశాను.

ఇందిర కూడా హాచ్చర్యపడేసింది.

హారి నువ్వా పిడుగూ అంది.


నా పేరు బుజుగు. నువ్వే హారి పిడుగు అని చెప్పాను.

పోకిరీ పిల్లాడా అంది.

నువ్వే పోకిరిపిల్లాడా అని చెప్పేశాను నేను.

మరీ నన్ను రెండు జెడలు అని ఎందుకు పిలిచావూ అంది.

([illegible]-వ పేజీ చూడండి)



★ కేంద్రసచివాలయ ఉద్యోగాలు ★

శ్రీ కృష్ణ

[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

ఢిల్లీలో ప్రస్తుతం రాజకీయంగా వార్తా మాంద్యంఏర్పడింది. ఎన్నికల ప్రభావం కూడా అనుకున్నంతగా లేదు. కాశ్మీర్ సమస్య ఒకటే రంగంమీద కురంగలిస్తోంది. త్రికంసారికంటే ఈసారి కృష్ణమీనన్ బాగా వాదించారని అంతా అంటున్నారు. ప్రభుత్వ వార్తా ప్రసారశాఖకూడా మందకొడిగా పనిచేస్తోంది.

ప్రైవేటు రంగం, ప్రభుత్వ రంగం ఏది మంచిదనే దానిమీద వాద ప్రతివాదాలు ఇంకా సాగుతున్నాయి. అయితే కొన్ని ప్రధాన విషయాలను మరిచిపోవడం జరుగుతోంది. ప్రభుత్వ రంగానికి ఒక పద్ధతి, కట్టుదిట్టం ఉన్నాయి. దానికి ఒకే యజమాని, యాజమాన్యానికి కొన్ని నిర్ణీత సూత్రాలు అంటూ ఉన్నాయి. కాని ప్రైవేటు రంగానికి ఒకడుకాదు వేలాది యజమానులు ఉన్నారు. వీరంతా ఒకరితో ఒకరు పోటీ పడుతూ వ్యాపారం సాగిస్తారు. ప్రైవేటు రంగానికి పోటీయే ప్రధాన లక్షణం. ప్రభుత్వ రంగంతో పోటీపడవలసి వచ్చినప్పుడు ఈపోటీయే దౌర్బల్య లక్షణంగా కూడా పరిణమిస్తుంది. భారతదేశంలో ప్రైవేటు రంగం అనాలోచిత ప్రవర్తనకే పేరు పడింది. ఈదిగువ రెండు ఉదాహరణలిస్తున్నాను.

విషయం: వివరం

మన దేశం మొత్తంమీద 1955-56 లో ఖనిజాల ఉత్పత్తి వివరాలు ఈ విధంగా వున్నవి: ముడిఇనుము: 42,69,020 టన్నులు; మాంగనీసు 16 కోట్ల 40 లక్షల టన్నులు; రాగి: 7,281 టన్నులు; బంగారం: 2,11,461 ఔన్సులు; వెండి: 1,52,888 ఔన్సులు.

* * *

దేశంలో సాలీనా 50 వేల టన్నుల జీడిపప్పు పండుతున్నది. దీనిలో 30 వేల టన్నులవరకూ ఎగుమతి అవుతున్నది.

* * *

ద్వితీయ ప్రణాళికక్రింద దేశంలో మొత్తం 11,100 గ్రామాలకు విద్యుచ్ఛక్తి లభ్యమతుంది.

* * *

దేశ ఆటవిక సంపదాభివృద్ధికి రెండో ప్రణాళికలో మొత్తం 24 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తారు.

* * *

తోళ్లపరిశ్రమ ఈ నాడు 8 లక్షల మందికి జీవనోపాధి కల్పిస్తున్నది. ఈ పరిశ్రమ దేశానికి సాలీనా 23 కోట్ల ధనం ఆర్జించి పెడుతున్నది. ★

ప్రైవేటు రంగం ఎప్పుడూ ప్రభుత్వం మీదే ఆధారపడి ఉంటోందిగాని ప్రజల మీదకాదు. గత యుద్ధకాలంలో దిగుమతులను బాగా తగ్గించివేశారు. దీనివలన దేశంలో పరిశ్రమలువృద్ధి కావడానికి వీలేర్పడింది. ఇక ఇప్పుడు ప్రైవేటు రంగం వాదించేదేమిటంటే దిగుమతి పన్నులు అధికంగావేసి రక్షణ కల్పించడమేకాక, దిగు

మతులను నిషేధించాలని కూడాను. అయితే ఈనిషేధంవల్ల జరిగేదేమిటి? ధరలు పెరిగి, వస్తువుల నాణ్యాం తగ్గిపోవడమే. అంటే ప్రైవేటు రంగం, ప్రజల అవసరాలతో పోటీ పడుతుందన్న మాట.

మరోటి. మోటారు కార్ల దిగుమతిని బాగా అనుమతించిన రోజుల్లో కార్ల పారిశ్రామికులు తాజా మోడల్ కార్లను పేపర్లలో పూర్తి పేజీలలో ఎడ్వర్టయిజ్ చేసేవారు. కాని భారతీయ పత్రికలు దేశం స్వయం పోషకంగా ఉండాలని ప్రచారం చేశాయి. దీని ఫలితంగా పత్రికలకు ఎడ్వర్టయిజ్‌మెంట్ ఆదాయం తగ్గిపోయింది ఎందుకంటే భారతీయ పారిశ్రామికుడు కార్ల తయారీలో పోటీలేక పోవడంచూసి ఎడ్వర్టయిజ్ చేయనక్కర లేదనే అభిప్రాయంలో పడ్డాడు.

ఇది అనాలోచిత కార్యమని చెప్పక తప్పదు. ఏ పరిశ్రమకైనా ప్రధానంగా సహాయపడేది కొనుగోలుదారేగాని ప్రభుత్వం కాదు. ఉదాహరణకి, భారతీయ వస్త్ర పరిశ్రమకు భారత దేశాన్ని పాలించిన పరాయి ప్రభుత్వం సహాయం చేయకపోయినా ప్రజలు సహాయపడ్డారు కనుకనే అది నేటికీ నిలబడిఉంది.

ప్రైవేటురంగం సుసంఘటితమైన వ్యవస్థ. దానితరఫున మాట్లాడేవి, పోట్లాడేవి అనేక సంఘాలున్నాయి. కాని దోషులైన పారిశ్రామికులను ఈ సంఘా లెప్పుడూ మందలించిన పాపాన పోలేదు.

ఈవిధంగా మనదేశంలో ప్రైవేటు రంగం ప్రజా వ్యతిరేకమైనది. మరోవంక చూస్తే కార్మిక నాయకులున్నారు. వీరెప్పుడో అప్పుడు ప్రభుత్వ రంగాన్ని నాశనం చేయకమానరు. కనుక ప్రైవేటు రంగం తన్నుతాను సంస్కరించుకుంటే ఎప్పటికైనా తిరిగి కోలుకోగలదు.

ప్రభుత్వరంగానికి కావలసింది సమర్థత కానట్లూ, వీలైనంతమందికి ఉద్యోగాలివ్వడమే అయినట్లు కనబడుతుంది. ఢిల్లీలో దీనికొక ఉదాహరణ ఉంది.

ఢిల్లీలో గ్వాలియర్ ఎండ్ నార్తరన్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ అనే దొకటుండేది. ఈ కంపెనీకి నిబంధనావళి అంటూ ఏమీ లేదు. పనిచేసేవారికి యూనియన్ కూడా లేవు. అయినా ఆ కంపెనీ ఉన్నంతకాలమూ పనివాళ్లెప్పుడూ సమ్మె చేయలేదు.

ప్రభుత్వం దాన్ని జాతీయం చేసింది. ఇప్పుడు పనివారికి ఉద్యోగనిబంధనలున్నాయి. ఉండడాని కిల్లున్నాయి. జాతీయం చేయగానే కార్మిక మహానాయకుడు శిబన్‌లాల్ సక్సేనా వచ్చి పనివారిచేత సమ్మె చేయించారు.

ఎన్నికలతో ముడిపెట్టుకున్నంత కాలమూ ప్రభుత్వరంగానికి సుస్థిరత లేదు. రైల్వే, తపాలా కార్మికులు అంతకంతకూ అధిక వేతనాలు కోరడమే దీనికి నిదర్శనం.

* * *

"హ్యూమానిటీ అప్రూవ్డ్" [మహా

న్యూఢిల్లీ లేఖ

సంక్షోభం] అని రష్యన్ విప్లవంపై మారిస్ హిండస్ ఒకపుస్తకం రాశాడు. నాటినుంచీ ప్రపంచంలో సంక్షోభాలు వస్తూనే ఉన్నాయి. బెంగాల్ ఇటీవలి ఉదాహరణ. 1946 లో నవఖాలీ అల్లర్ల నాటినుంచీ పాకిస్తానీ హిందువుల పలాయనయాత్ర ఇంకా సాగుతూనేఉంది. 1952 డిసెంబరు 31 తరవాత నిరాశ్రయులసంఖ్య 32.32 లక్షలనుంచి 39.84 లక్షలవరకూ పెరిగింది.

"అల్పసంఖ్యాకులకు అభయం ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని అనడమే గాని ఇంతవరకూ ఏమీ జరగనేలేదు. పరిస్థితి ఎప్పటివలెనే అధ్వాన్నంగా ఉంది," అని భారతప్రభుత్వం ఒకసమితి ప్రకటించింది.

ఈ సమితిలో ఇంకా ఇలా ఉంది: "నిరాశ్రయులసంఖ్య దృష్ట్యా పరిస్థితిచూస్తే పశ్చిమ సరిహద్దులో ఉన్నంత ప్రమాదంగానూ తూర్పు సరిహద్దులో కూడా ఉంది. పశ్చిమ ప్రాంతంలో 47.20 లక్షల మంది నిరాశ్రయులున్నారు. అయితే తూర్పు ప్రాంతంలో పరిస్థితి చాలా చిక్కులతో కూడినది. అందుచేత పరిష్కారం చాలా క్లిష్టమైనది. ఎప్పుడెప్పుడు ఎంతమంది రక్షణార్థులు వస్తారో అంచనావెయ్యడం కష్టం. అసలీ రక్షణార్థుల రాక ఎప్పటికైనా ఆగుతుందో లేదో చెప్పడం కూడా కష్టమే. ఈ సందిగ్ధత మూలంగా ఏ ప్లాను వేయడానికి కష్టమై పోతోంది. మొదటి రోజుల్లో రక్షణార్థులు ఎప్పటికైనా పాకిస్తాన్ లో పరిస్థితులు బాగుపడతాయని, తిరిగి స్వగృహాలకు పోవచ్చుననీఆశపడేవారు. కాని ఈ ఆశ నిరాశ అయింది. అయినా వారి ఈ ఆశవల్ల పునరావాస కార్యక్రమానికి అవరోధాలు కలగనే కలిగాయి. విభజన తరవాత రెండేళ్లదాకా రక్షణార్థులకు తాత్కాలిక సహాయం చెయ్యడంతోనే సరిపోయింది. పశ్చిమ ప్రాంతంలో సమస్య కొంత సులభ సాధ్యమైంది. ఎందుచేతనంటే పాకిస్తాన్‌కు కాందిశీకులుగా వెళ్ళిపోయిన ముస్లిములు వదిలిపెట్టిన 275 వేల గృహాలు, 70 లక్షల ఎకరాల భూమి అక్కడనుంచివచ్చేసిన హిందూ కాందిశీకులకు ఇచ్చి తోడ్పడడానికి వీలైంది. కాని తూర్పు ప్రాంతంలో ముస్లిము లెవ్వరూ కాందిశీకులుగా వెళ్ళనందున హిందూరక్షణార్థులకు పునరావాసం కలిగించడం చాలా కష్టమైంది. అంతే గాక పశ్చిమ పాకిస్తాన్‌నుంచివచ్చిన రక్షణార్థులు దేశమంతటా ఆవాసం ఏర్పరచుకొని ఆర్థికంగా భారతీయులతో కలిసి పోయారు. కాని తూర్పు పాకిస్తాన్ నుంచి వచ్చిన వారు పశ్చిమ బెంగాల్ లో ఎక్కువగాను, చెదురు చెదురుగా అస్సాం, త్రిపురా ప్రాంతాల్లోనూ ఆగిపోయారు. త్రిపురలో దాదాపు అసలు జన సంఖ్య ఎంత ఉందో అంత మందీ కొత్తగా వచ్చిపడ్డారు"

పాకిస్తాన్ భారత వ్యతిరేక ప్రచారం ఎంత ఉధృతంగా చేస్తున్నా గమనించవలసిన మరో విషయం ఏమిటంటే పాకిస్తాన్ ముస్లిములకు కూడా భారత దేశమే బావున్నట్లు తోచింది. అందుకే పశ్చిమ బెంగాల్ నుంచితూర్పుబెంగాల్‌కు ముస్లిము లెవ్వరూ వలస పోక పోయినా, అటునుంచి ఇటు లక్షమంది ముస్లిములు వచ్చిపడ్డారు.

సరియైన పోషణ లేకపోవడం వల్లా, మలేరియాజాడ్యంవల్లా బెంగాలీలు శారీరకంగానూ, మానసికంగానూ కూడా దెబ్బతిన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మిళితమైపోవడం వారికి అసాధ్యంగా ఉన్నది. 1912 దాకా కేంద్ర ప్రభుత్వ సచివాలయంలో వారిదే పైచెయ్యి. ఈనాడు వారు కేవలం మచ్చుకొకడూ ఇద్దరుగా ఉన్నారు. పశ్చిమ పాకిస్తాన్ నుంచి వచ్చిన రక్షణార్థులు ఢిల్లీని "పట్టుకోవడం" ఒక టెక్నిక్‌గా అవలంబించారు. ఈ రోజున భారత ప్రభుత్వంలో వారిదే పైచెయ్యి.

ఇదంతా చూస్తుంటే ఒక ఆలోచన కలుగుతోంది. అసలు కలకత్తానుంచి రాజధానిని ఢిల్లీకెందుకు మార్చారు? ఎందుచేతనంటే బెంగాలీలు, ముఖ్యంగా క్లైవ్ స్ట్రీట్ బెంగాలీలు భారత ప్రభుత్వాన్ని గుత్తకు పుచ్చుకున్నట్లు వర్తించారు. ఢిల్లీలో ఏ ఒక్క భాషవారికీ ప్రాధాన్యం లేదు గనుక అలా జరగదని రాజధాని ఇక్కడికి మార్చారు. సిమ్లాను చేసినట్లుగా, ఢిల్లీని కూడా "రక్షణార్థుల పట్టణం కాదు" అని ప్రకటించక పోవడంవల్ల ఢిల్లీకి పూర్వపు తటస్థహోదా పోయింది. దేశ రాజధానిలో ఒక వర్గంవారికి పలుకుబడి ఎక్కువగా ఉండడాన్ని సహించవచ్చునా అనేది ఇతర రాష్ట్రాలవారందరూ తేల్చుకోవలసిన విషయం. ఢిల్లీ ప్రజలను వారు మార్చలేక పోవచ్చునుగాని, వాషింగ్టన్ లాగా ఢిల్లీకి కూడా పార్లమెంటు సభ్యులు లేకుండా చేసుకోవచ్చును. ఏ ఒక్క రాష్ట్ర పౌరులకూ కేంద్ర సచివాలంయలో అతిశయ ప్రాముఖ్యం లేకుండా వారు ఒత్తిడిచేయవచ్చును. కేంద్ర సచివాలయం ఐక్య భారత సచివాలయమేగాని ఏ ఒక్క రాష్ట్రపు గుత్త సొమ్మూ కాదు. ప్రతి రాష్ట్రమూ తనకు తగినంత ప్రాతినిధ్యం లభించాలని ఒత్తిడి చెయ్యాలి. వెనుకబడిన ఒరిస్సా, రక్షణార్థుల్తో బిలబిలలాడే బెంగాల్, కమ్యూనిస్టు ప్రాబల్యం గల కేరళలాంటి రాష్ట్రాలు తమనింతకాలమూ అశ్రద్ధ చేసినందుకు ప్రతిఫలం ఇప్పుడు కోరాలి. విద్యావంతులలో నిరుద్యోగ సమస్యను అరికట్టడానికిదొక మార్గం. భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడానికిదొక్కటే మార్గం. ★

అంతా ఘటన

రాత్రి సినిమాకి వెళ్లొచ్చేసా ఉదయం లేచే సరికి బారెడు పొద్దెక్కింది. ఇంట్లోవాళ్ళంతా ఎవరి పనుల్లో వారున్నారు. నాన్నగారు ఆఫీసు రూమ్‌లో కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్నారు. ఆయన చూడకుండా గబగబ వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకొని కాఫీతాగి నాపని చూసుకోటానికి గదిలోకి వచ్చాను. నాన్నగారు అక్కడే వున్నారు. "రవీ! సాయంత్రం ౫ గంటలకి రెడీగావుండు. ఇవాళ పెళ్ళికూతురుని చూడటానికి వెళ్ళాలి" అన్నారు. ఆ అమ్మాయి యెవరన్న సందేహం వచ్చి "ఏ అమ్మాయిని" అన్నాను. "ఏ అమ్మాయి అయితే నీకెందుకు! ౫ గంటలకి రెడీగావుండు. అంతే నువ్వు చేయవలసినది." అన్నారు. ఈ మాటలకు నా అహంభావం దెబ్బతింది. ఏమంటారో అని వూహించకుండా "నేను ఇంకా పెళ్ళిచేసుకోదల్చుకోలేదు" అన్నాను. "ఆహాహా...చా...లా బావుంది! చదువుతున్నన్నాళ్ళు చదువయ్యాక అనటం. చదువయ్యాక ఉద్యోగం అయ్యాక అనటం. ఇది ఈ కాలపువాళ్లకి పరిపాటయిపోయింది. ఇలాటివాళ్లని చాలా మందిని చూశాను. చిన్నతనంలో పెళ్ళిచేసుకుంటే పెద్దతనంలో చేతికి అందివచ్చే కొడుకుని చూచి సంతోషించవచ్చు. ఊళ్లు తిరిగే ఉద్యోగాలు నీవి. ప్రతిచోటికి ఎవరువస్తారు. హాయిగా పెళ్ళిచేసుకొని సుఖంగా వుండు.' అని పెద్ద ఉపన్యాసం ఇచ్చారు. ఇంక ఏమీ చేయలేక "సరే మీ యిష్టం. కాని......" "కానీను...అర్థమౌను...ఏమిటో త్వరగా చెప్పు" అన్నారు. "కాని...సంతలో పశువుల్ని చూసినట్లు అమ్మాయిల్ని చూసి తరువాత ఒద్దనటం నాకు ఇష్టంలేదు. పాపం ఇలా యెంతమందిచూసి ఒద్దంటారో. ఇలా అంగాంగపరిశీలన అయ్యాక పెళ్ళిఅవకపోతే ఆ అమ్మాయి ఎంత బాధపడుతుందో! నాకు చేతనయినంతమటుకు ఇలాంటి అన్యాయం కలుగకుండా చేస్తాను. అందుచేత అంతా స్థిరమయితేగాని నన్ను పిల్లని చూడమని అడగద్దు" అని ధైర్యంచేసి అనేశాను. అప్పుడు మా నాన్నగారు "ఏడిసినట్టేవుంది, నీ సలహా. ఇది పూర్వకాలంనుండి వస్తున్న ఆచారం. నీకోసం ప్రత్యేకంగా పెట్టినది కాదు తెలుసా? ఇవి మన పూర్వీకులు పెట్టినవే. అన్నీ స్థిరమయ్యాక ఆ అమ్మాయిని చూసి బాగుండలేదనటం చాలా అసహ్యకరమైన విషయం. ముందే చూసి ఆ అమ్మాయి బాగుండకపోతే జాతకం కుదరలేదనవచ్చుగాని, అన్నీ కుదిరాక బాగుండలేదంటే ఆ అమ్మాయి ఎంత బాధపడుతుందో ఆలోచించావా" అన్నారు. "హారి భగవంతుడా నిజంగా నాకు నచ్చి జాతకం కుదరకపోతే చెయ్యరనగానే నాకు భయంవేసింది. నేను ఏమీ సమాధానం చెప్పలేదు. ఇంకా అంటున్నారు, "ఎవ్వరు ఈ ఆచారంగురించి బాధపడనప్పుడు నీ కెందుకోయి ఆ బాధ? అంతేకాకుండ తిరస్కరించటం చాలవాటిమీద ఆధారపడివుంది. రుచులు వేధిస్తాయి. నాకు తెలిసినంతమటుకు ఈ అమ్మాయి చాల బావుంటుందిట. అన్నీ అనుకూలిస్తే ఇదే జరగవచ్చు." అన్నారు. ఇంక చేసేదిలేక అమ్మాయిని చూడటానికి ఒప్పుకున్నాను.

కుమారి పి. పద్మ

ఆ వేళ సాయంత్రం సరిగా ఐదుగంటలకి ఒక గుఱ్ఱంబండి వచ్చి మా యింటిముందు ఆగింది. ఆ బండి పెళ్ళికూతురు తరఫువారు పంపినదనటానికి ఏమాత్రం సందేహం లేకపోయింది. పాపం! ఆడపిల్లలు గలవారు ఇన్ని అగచాట్లు పడితేగాని పెళ్ళిళ్ళు అవ్వవుగాబోలు! ఇలా ఎంతమంది ఇళ్ళకి ఈ గుఱ్ఱంబండి వెళ్ళిందో అని ఆలోచిస్తు మెట్లుదిగాను. కాని, ఆ బండిదగ్గర వున్న వాళ్ళనిచూస్తే నాకు చాలఆశ్చర్యం వేసింది. అమ్మ, నాన్న కాకుండ ఇంకా చాలమంది వున్నారు. మా మామయ్య, అత్తయ్య, మా మేనత్త. మా నాన్నగారిని లోపలికి పిలిచి వీళ్ళంతా ఎందుకు అన్నాను. నాన్నగారికి కోపంవచ్చింది. "వీళ్ళంతా వచ్చితీరాలిసిందే" అన్నారు. ఇంక చేసేదిలేక ఆ యుద్ధసైన్యంలో ఆబండి బయలుదేరింది. చాల ఇరుగ్గావుంది. ఒళ్ళంతా హూనంచేసుకొని ఎలాగయితేం ఆ పెళ్ళివారి ఇంటిముందు ఆగాము. ఒక ముసలాయన ఇంటి గుమ్మం ముందు సిద్ధంగా వున్నాడు. పెళ్ళికూతురు తండ్రిలాగే వున్నాడు. నాకు ఆయన్ని చూస్తే జాలివేసింది. పాపం ఇలా ఎంతమందికి స్వాగతం పలికాడో అని. అప్పుడే మేమువచ్చినట్లు చుట్టుప్రక్కల దావాగ్నిలా వ్యాపించింది. చుట్టుపక్కలవున్న కిటికీలన్నీ సుందరాంగనల నయనాలతో నిండిపోయాయి. ఆ చూపులకు నేను తట్టుకోలేకపోయాను. "రండి, రండి. ప్రయాణం సుఖంగావుందా?" అన్న మధుసూదనరావుగారి స్వాగతవాక్యాలతో తేరుకున్నాను.

ఆయన మందస్మిత వదనంతో మమ్మల్ని ఒక గదిలోకి తీసుకువెళ్ళారు.' ఒక చక్కటి రౌండు టేబిల్ అమర్చివుంది. దానిమీద వెలిగించబడిన అగరువత్తులు వాసనలను గదిఅంతా విరజిమ్ముతున్నాయి. ఒకమూల వీణ తనస్థానాన్ని ఆక్రమించుకుంది. కొంతసేపటికి గుమ్మంలో గాజుల చప్పుడు వినిపించింది. ఆమె వస్తోందనుకున్నాను. కాని పెళ్ళికూతురు తల్లి అనుకుంటా కాఫీ ఫలహారాలు పట్టుకువచ్చిందిది. ఆవిడ వస్తూనే నన్ను నఖశిఖపర్యంతం పరీక్షించింది. ఆమె వదనంలో ఆనందరేఖ తాండవించింది. ఇంతలో మధుసూదనరావుగారు "అమ్మా నిర్మలా ఇలా రామ్మా" అన్నారు. మల్లెపూల వాసనలు, గాజుల గలగలలు ఆమె వస్తోందని సూచించాయి. ఆహాహా...ఏమి దృశ్యం! సిగ్గు, ఆత్రత, సంతోషం ఇత్యాది అన్నీ ఆమెలో నిండివున్నాయి. ఆ లేత కళ్ళతో బెదురుచూపులు చూస్తోంది. సరిగ్గా నా ఎదురుగుండా కూర్చుంది. నిజం చెప్పాలంటే ఆమెను చూడాలంటే నాకే ఏమిటో అనిపించింది. ఇదే కాకుండా మధుసూదనరావుగారు నన్ను చాల ఆత్రతతో పరిశీలిస్తున్నారు. అతికష్టంమీద ఆ అమ్మాయిని చూశాను. ఆమె అందం, ఆ నాజూకుతనం, ఆ సోగకళ్లు, నవ్వితే సొట్టలుపడే ఆ బుగ్గలు నన్ను ముగ్ధుడిని చేశాయి. ఆ తుమ్మెదరెక్కలవంటి జుట్టు ఆమె సౌందర్యానికి మెరుగుదిద్దింది. ఆమె సౌందర్యదేవత అంటే అతిశయోక్తి లేదు. "నిర్మలా ఒక పాట పాడమ్మా" అన్న మధుసూదనరావుగారి పలుకులతో ఈలోకంలోకి వచ్చిపడ్డాను. "మా అమ్మాయిది చాలా చక్కని కంఠం. చూడమ్మా ఇత గానికి సంగీతంఅంటే చాల అభిరుచి. అందుచేత చాల జాగ్రత్తగా పాడమ్మా" అన్నారు. అది విని ప్రతితండ్రి తన కూతురునిగూర్చి ఇలానే చెప్పుకుంటాడనుకున్నాను. కాని నాకు తెలియకుండానే ఎవరిని సంబోధించకుండా "ఏమీ భయపడవద్దు. నాకు సంగీతంఅంటే అభిరుచేకాని నాకు రాదన్నాను," అలా అని నాన్నగారి

★ అంతా ఘటన ★

వేపు చూశాను. "అలా కాదు మాట్లాడవలసిన విధం" అన్నట్లుగా చూశారు.

నిర్మల వీణకు నమస్కరించింది. మొదట చాల తగ్గుస్థాయిలో వీణమీటింది. ప్రశాంత వాతావరణంలో ఏవో మధురమైన ధ్వని తరంగాలు ఆగదిలో నాల్గుమూలలా వ్యాపించి నిరమించాయి. ఆమె గానమాధురి అచట నున్న వాళ్ళందరిని తన్మయులను చేసింది. కోమలమైన ఆమెచేతి వ్రేళ్లు వీణాతంత్రులపై నృత్యము చేస్తున్నాయి. ఆమె వ్రేళ్ల కదలిక చూస్తుంటే అసలు వీణ మీటుతోందా లేక ఊరికే వ్రేళ్ళను పైపైన త్రిప్పుతున్నదా యని అనుమానం వేసింది. నిజంగా ఆ వీణ శృతిలో ఆమెకంఠం కలిసిపోయింది.

ఆమె పాడిన రెండిటిలో ఒకటి నా ప్రీతి పాత్రమైనది. ఆమె గానమాధురి నన్ను ఆనందడోలికలలో తేలియాడజేసింది. ఆ ఆనందంలో "ఏమీ అభ్యంతరం లేకపోతే ఇంకో పాట" అన్నాను. "ఓ తప్పకుండ" అన్నారు మధుసూదన రావుగారు. "నీ ఉద్దేశాలను అప్పుడే బయట పెట్టద్దు" అన్న దృష్టిలో చూశారు నాన్నగారు.

ఈసారి ఆమెపాట చాల ఉన్నత స్థాయి నందుకుంది. ఆ పాట ముగించి ఆమె లోపలికి వెళ్ళిపోయింది. లోపలవున్న మాఅమ్మ వాళ్ళు ఆమె గానామృతాన్ని మెచ్చుకోకుండా వుండలేకపోయారు. మా మనస్సులో వుండే భావాల్ని వ్యక్తం చేసుకోటం కోసం మధుసూదనరావుగారు లోపలికి వెళ్ళారు. ఆయన వెల్లిన వెంటనే "ఎలా వుందిరా అమ్మాయి" అన్నారు నాన్నగారు. పట్టరాని సంతోషంతో "అబ్బ, చాలా బావుంది" అనేశాను. "ఉష్ అంతగట్టిగా చెప్పకు కాస్త జాగ్రత్తగా వుండు" అన్నారు. "ఏమైనా సరే ఈ అమ్మాయినే పెళ్ళిచేసుకుంటాను" అన్నాను గట్టిగా. "అప్పుడే! అప్పుడే అంత తొందరా? ఇంకా ఎంత వుంది కథా కామాయిషి. కట్నం అవీ మాట్లాడద్దూ? అన్నారు "కట్నం" అన్నమాట వినగానే నా గుండె సగంజారిపోయింది. ఇదెక్కడి కర్మంరా బాబు కట్నం దగ్గర పేచీవచ్చి ఈ అప్సరస చేయిజారిపోతుందేమో అన్న భయం నన్నావరించింది. "కట్నం విషయం ఏమీ పేచీ పెట్టకండి" అన్నాను. "సరేలే కాస్త వూరుకో ఆయన వస్తున్నారు. నీ ఉద్దేశ్యం తెలిసింది. తరువాత ఏంజేయాలో మాకు తెలుసు" అన్నారు. "మరి కొంచెము కాఫీ పుచ్చుకుంటారా" అన్న మధుసూదనరావుగారి మాటలతో ఈ లోకంలోకి వచ్చాము. "అబ్బే అక్కర్లేదు. చీకటిపడుతోంది మేము సెలవు పుచ్చుకుంటాము" అన్నారు నాన్నగారు. ఆయన భోజనంగూడా చేయమని బలవంతం చేశారు. "అబ్బే కలిగితే అతకదంటారు. బలవంతం చేయకండి" అని చెప్పుతూ నాన్నగారు బయలుదేరారు.

వాళ్ళ ఇంటిమెట్లు దిగుతున్నాను. కొంచెంగా నా కాలు జారింది. దగ్గరనున్న స్తంభం నా తలకి తగిలింది. అబ్బా అని రుమాలు అద్దాను. రుమాలు తీసేసరికి ఏముంది....రక్తం. నా ఆశ్చర్యానికి అంతు లేకపోయింది. ఇదేమిటి ఈ కాస్త దెబ్బకి రక్తం వచ్చిందని ఆశ్చర్యపోయాను. మా నాన్నగారు, అమ్మ ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని ఇతరులకు అర్థంకాని మూగ సంజ్ఞలు చేసుకున్నారు. వాళ్ళ ముఖకవళికలుగూడా మారిపోయాయి. గాయం కడుక్కుని కాసేపుకూర్చుని బయలుదేరాము. బండి కదలీ కదలగానే "మనకీ సంబంధం ససేమిరా వద్దేవద్దు. అక్కడ వుండగానే వాళ్ళఇంట్లో రక్తం చూడటమా" అని అమ్మ అంది. "అయ్యో నిజమే! ఎంత దుశ్శకునం" అని నాన్నగారు గూడ అమ్మతో పాట కలిపారు. ఈమాటలువింటూంటే నా తలగిర్రున తిరిగిపోయింది. నాఆశలన్ని అడియాశలయ్యాయి, నా గాలిమేడలన్నీ కూలిపోయాయి. వాళ్ళ బండివాడిదగ్గరే ఇన్నిమాటలు దులిపేశారు. ఆవేశంగా ఈ ఆచారాలన్నిటిని చంపి పారవెయ్యాలనిపించింది. వాళ్లు మొదలు పెట్టారు మళ్ళీ. "రక్తం, రక్తమే. ఏంమాటలనుకున్నావా? అక్కడవుండగానే రక్తం చూశామంటే ఏమిటో తెలుసా? పెళ్ళి అయిన మొదలుకొని నువ్వు నరకం అనుభవిస్తావు. బ్రతికి బయటపడ్డాము. ఏదో ఈ విధంగా మనకి దేవుడు ఆసంబంధం చేసుకోవద్దని చెప్పాడు, ఇంకానయం" అని ఈవిధంగా నాన్నగారు మాట్లేడుస్తున్నారు. ఆవేశం పట్టలేక "నాన్నగారూ! నా జీవితాన్ని నాశనంచేసి, నా శవం చూడాలంటే ఈపని చేయండి" అన్నాను. అక్కడ నా మాట వినేవాళ్లెవరయినా వుంటేగా "బాగా ఆలోచించుకో, తొందరపడకు. ఇంతకంటె సంగీతవిద్వాంసురాలు, ఇంతకంటె చక్కని అప్సరస దొరక్కపోదు." అన్నారు.

"చూస్తానుగా ఈఅమ్మాయిని కాకుండా ఇంకొకరినిచ్చి ఎలా పెళ్లి చేస్తారో" అన్నాను. ఇల్లు జేరుకున్నానన్న మాటేగాని, నా మనస్సంతా నిర్మలమీదేవుంది. కళ్ళు మూసినా తెరచినా ఆమెవిగ్రహమే. ఏమి వింటున్నా ఆమె పాటలాగే వుంది. ఒకటి రెండుసార్లు వాళ్ల ఇంటి పరిసరాలకి వెళ్లాను, నిర్మల కనపడుతుందేమోనని కాని కనపడలేదు. ఒక వారంరోజులు నా మనసు మనసులోలేదు. ఏమిటా ఇలా అయిందని విచారించాను. ఈ వారంరోజులలో చాల సార్లు ఉత్తరాలు రాసిపంపారుకాని వాటికి వేటికి సమాధానాలు వెళ్లలేదు.

తలవని తలంపుగా వాళ్ల ఇంటిపరిసరాలలో ఒకరోజుసాయంత్రం ఆమెని కలుసుకున్నాను. కాని ఆమె మాట్లాడలేదు. తీక్షణమైన దృక్కులను నాపై ప్రసరింపజేసింది. ఆచూపులకు తట్టుకోలేకపోయాను. ఈర్ష్య, క్రోధం, అసంతృప్తి, జుగుప్స అన్నీ అందులోవున్నాయి. నిర్మలని పలకరిద్దామనుకున్నాను. కాని ధైర్యం చాలలేదు. అతికష్టంమీద ఇల్లుచేరుకున్నాను. నాహృదయంలోని బరువు తగ్గించుకోటంకోసం ఎంతసేపు ఏడ్చానో నాకే తెలియదు. "ఏంరా, ఒంట్లో బాగాలేదా" అన్న నాన్నగారి పిలుపుతో లేచాను. "ఊరికే పడుకున్నా" అని అన్నాను. "మరి రెండుకళ్ళు ఎఱ్ఱగావున్నాయేం" అన్నారు. "దుమ్ముపడింది." "రెండు కళ్లలోను ఒక్కసారేనా" అంటూ చిరునవ్వు నవ్వేరు. నాకు చాల కోపంవచ్చింది. చేసింది చాలక పైగా నవ్వుతూడాను. ఇంతలో పిడుగుపడ్డట్టుగా "ఏడవకు సంబంధం నిశ్చయించాను లే" అన్నారు.

"నాన్నగారూ........"

"నిర్మలనే. గాభరాపడకు మరెవరూ గాదు. భగవాన్లుగారులేరూ? మంచి పండితులు. ఆయన చూసిపోదామనివచ్చారు. సరే ఈవిషయంచెప్పాను. ఆయన చెప్పారు రక్తం కుంకుమవంటిదని, అది కనబడటం చాల శుభసూచకం అనిగూడా చెప్పారు." ఆయన ఈమాటలు అతినెమ్మదిగా చెప్పారు. ఇన్నిరోజులు పడ్డబాధ ఆయన కేం తెలుసు. పట్టరాని సంతోషంతో "అయితే మధుసూదనరావుగారి కెప్పుడు కలుసుకుంటారు," అన్నాను. "ఇంకా ఎప్పుడు కలుసుకోటం ఏమిటి, శాస్త్రిలుగారు అలావెళ్లారు, నేను ఇలావెళ్లాను. అన్ని సంగతులు మాట్లాడాను. రేపు వచ్చే ఎనిమిదో తారీఖునే లగ్నం" అని వెళ్లిపోయారు.

పచ్చనితోరణాలలో, సన్నాయి వాయిద్యాలలో కళకళలాడే పందిట్లో నిర్మలతో నా వివాహమయింది.

తరువాత నిర్మల ఒకరోజున చెప్పింది. వాళ్ల నాన్నగారే, ఇలా చెప్పమని శాస్త్రిలు గారిని పంపించారని కొంత లంచంగూడా ఇచ్చారని. నా ఆశ్చర్యానికి అంతు లేకపోయింది. చివరకు ఎలాగయితేనేమి నా నిర్మల నాకు దక్కింది. ★

(నాటిక)

నీలి తెరలు

అంగర సూర్యారావు





(గత సంచిక తరువాయి)

మూడవ అంకం

(స్థలం:-విశ్రాంతి భవనంలో హాలు. సమయం:- సాయంత్రం 4 గంటల తర్వాత. మొదటి దృశ్యంలో కనిపించిన సోఫా టేబిలు, కుర్చీలు అలాగే వున్నవి. తీవ్రాలోచనలో మునిగి హాలులో అటూయిటూ తొందరగా తిరుగుతున్నాడు దినకర్. ఆనంద్ సోఫాలో కూర్చుని వున్నాడు.)

దినకర్ :-(చేతిలోని పుస్తకాన్ని తెరచి) కాలాన్ని చూడలేనిమనిషీ, కళ్ళుమూసుకో. నువ్వు నిర్మించుకున్న ఆదర్శపు భవనాల కంచుగోడలు కదులుతున్నాయి.

ఆనంద్ :-(ప్రాదేయ పూర్వకంగా) కవిగారూ! నామాట వినండి. ఆదర్శాల చిమ్మచీకటిలోకి ప్రయాణం చెయ్యకండి.

దిన:-(తన ధోరణిలో) నిరాశల నిసిలో నిలుచొని రేపటి అరుణోదయానికి ఎదురు చూడు. అరుణోదయానికి పూర్వమే నీలోని జీవుడు రెక్కలు కట్టుకొని లేచిపోతాడంటావా?! (నవ్వి) వెర్రివాయనా! అందుకే నిన్ను చూచి నేను జాలిపడేది.

ఆనంద్ :- దినకర్ మహాశయా! ఒకసారి బాహ్యప్రపంచంలోకి రండి. చిన్నవిషయం మాట్లాడాలి.

దిన:—(ఆనంద్ కేసి తిరిగి) బాహ్య ప్రపంచంలోకి చూడలేను. చూడగల శక్తి నాలో నశించింది. చెట్టుక్రింద ప్రసవించిన మాతృమూర్తి, పాలులేని పసిబిడ్డ, మానవశరీరంలోని రక్తమాంసాలనుపీల్చి పిప్పి చేసే యంత్రాలు, దారిద్ర్య వారాశిలో మునిగి కొట్టుకుపోయే తంత్రికోసం ఎలుగెత్తిఏడ్చే పదిమంది పసిబిడ్డలు - చూడలేను, చూడలేను బాహ్యప్రపంచాన్ని చూడలేను.

ఆనంద్ :- మీ రొక్కరూ చింతించినంతమాత్రాన ప్రపంచపు పరిస్థితి బాగుపడుతుందా మహాశయా!

దిన:- ఆమన స్తత్త్వమే మానవజాతి తిరోగమనానికి ముఖ్యకారణం. ప్రతిమనిషీ చింతించాలి. తన సోదరమానవుల దుస్థితి చూచి కుమిలికుమిలి బాధపడాలి.

ఆనంద్ :-మీది నిష్కల్మష హృదయం దినకర్. మిమ్మల్ని చూస్తుంటే నాకు ఆనందం కలుగుతోంది. మీ రిలా నిత్యదరిద్రంతో బాధపడడం నాకు యిష్టంలేదు.

దిన:-నీ యిష్టాయిష్టాలతో నాకేంపని? నా సోదరమానవులతో నేనూ భుజం భుజం కలిపి దారిద్ర్యరాకుసితో హోరాహోరీ పోరాడతాను. విజయంకలిగితే సంతోషిస్తాం. వీరస్వర్గం లభిస్తే మరీ సంతోషిస్తాం.

ఆనంద్ :-మీరు మరీ ఉన్మాద స్థితిలోకి పోతున్నారు దినకర్. నామాట వినండి. నాకో చిన్న ఉపకారంచేసి పుణ్యం కట్టుకోండి.

దిన:-అలా అడిగావు, బాగుంది. (కుర్చీలో కూర్చుని) ఏంకావాలి నీకు?

ఆనంద్ :-నవరసభరితమైన నాటకం ఒకటి కావాలి.

దిన:-నన్ను రాయమంటావా? ఏదీ కవితా సామగ్రి అందుకో. కప్పుకాఫీ, సిగరెట్ పెట్టె, సిరావున్న కలం-రానీ!

ఆనంద్ : -(జేబులోంచి సిగరెట్టుపెట్టె, అగ్గిపెట్టె, తీసి దినకర్ కు యిస్తాడు. దినకర్ సిగరెట్ వెలిగిస్తాడు.) కాఫీ యిప్పుడే వస్తుంది. (కుడివైపు తిరిగి) దండపాణీ! దండపాణీ!

దండ : (ప్రవేశించి యిద్దరినీ చూసి ఆశ్చర్యంలో) అరే! మళ్లీ యిక్కడే కూచున్నారూ! యియ్యేళకి మీగదిలో కెళ్లండి బాబూ యిక్కడికి పెళ్లికొడుకుగారు వస్తారు.

ఆనంద్ : (జేబులోనుంచి డబ్బులుతీసి) రెండుకప్పులు కాఫీ తెచ్చిపెట్టు. అలాగే పోతాం. కాఫీ తాగేవరకూ కవిగారు నాటకం ప్రారంభించరు.

దండ : (డబ్బులు తీసుకొని) నాయేమం మాట మరిసిపోలేదుగదా ఆనందబాబూ.

ఆనంద్ : (దినకర్ తో) చూడండి దినకర్. మీరు రాయబోయే నాటకంలోదండపాణికి సరిపోయేపాత్ర ఒకటి వుండాలి.

దిన : వుంటుంది. తప్పకుండావుంటుంది. నేను రాయబోయే నాటకంలో దండపాణికి అనగా యమధర్మరాజుకు చాలాముఖ్యమైన పాత్ర ఒకటి వుంటుంది.

దండ : (సంతోషంతో) సెబాస్! డింకర్ బాబుగారు రాయడం, నేను యేషం ఎయ్యడం! ఓ! నా సామిరంగా! (ఏదో చప్పున స్ఫురణకు వచ్చినట్లు) నాకు రెండు పాటలుకూడా రాయండి. నాకంటం కంచు కంటంలాంటిది!

ఆనంద్ : ఏదీ ఒక పాటపాడి వినిపించు. నీవాయిస్ టెస్టు చేస్తాం.

దండ : (ఆలోచిస్తూ) సమయానికి ఏదీ గ్యాపకంరాకుండా వుంది. (ఆకస్మికంగా స్ఫురించినట్లు) కోలాటంపాట ఒకటి పాడతాను. (అడుగులేస్తూ హాలు ఎగిరిపోయేలా పాడతాడు.)

ఏలూరు సిన్నదానా

★ సిలి తెరలు ★

ఎత్తూ మడమలదానా
ఎత్తూ మడమలమీద
రెండీమువ్వ లేదే
ఓసిన్నదానా! ఓసిన్నదానా?
యేవూరు సిన్నదానా?
యేపేరు సిన్నదానా?
తై-తక-తా-ధిమితా!

ఆనంద్ : (లేచి భిగ్గరగా) ఓ గాయక సార్వభౌమా యిక నీపాట ఆపుచెయ్యి.

దండ : నాపాట నచ్చిందా బాబూ?

ఆనంద్ : నీపాట, నీకంఠం, నీ అడుగు ఒకదానికొకటి అతుక్కుపోయినట్లు సరిపోయినై.-ఇక వేగం వెళ్ళి కాఫీ తీసుకురా.

(దండపాణి కుడివైపు నిష్క్రమిస్తాడు.)

దిన : (సిగరెట్టు గట్టిగాపీల్చి) నా నాటకంలోని నాయకుడు యువకుడు, నిరుద్యోగి, తినడానికి తిండిలేని దరిద్రుడు.

ఆనంద్ : నాటకాన్ని విషాదంతో నింపితే ప్రేక్షకులు భరించలేరు.

దిన : జీవితంలోని విషాదాన్ని భరించగలిగినవాళ్ళు నాటకంలో ఎందుకు భరించలేరు?

ఆనంద్ : దానికి జవాబు నేను చెప్పలేను. కాని ప్రేక్షకుల అభిరుచికి సరిపోయే నాటకానికి ఎక్కువ ఆదరణ లభిస్తుంది.

దిన : ఆ అభిరుచు లెటువంటివి?

ఆనంద్ : కొంచెం ప్రణయం వుండాలి.

దిన : అప్సరసలవంటి ఆడపాత్రలను సృష్టించాలా?

ఆనంద్ : అంతేకాదు. హాస్యంకావాలి.

దిన : నేడు ప్రపంచంలో నలుమూలలా రౌద్ర భయానక బీభత్స దృశ్యాలు కనిపిస్తున్నాయి. వాటిమధ్య హాస్యం, శృంగారం నాట్యం చేస్తున్నై. కరుణరసం కంటికి కనిపించకుండా పారిపోయింది. హ హ్హ హ్హ! (నవ్వుతాడు).

ఆనంద్ : మళ్లా మీరు పిచ్చిధోరణిలో పడుతున్నారు దినకర్.

(కుడివైపునుంచి దండపాణి ట్రేతో కాఫీ తీసుకువస్తాడు.)

దండ : (ఉత్సాహంతో) ఆ పాటలోని సరణాలన్నీ పాడితే నా సామిరంగా! (కప్పులు యిద్దరికీ అందిస్తాడు.)

దిన : (కాఫీతాగి ఖాళీకప్పు టేబిలుమీద పెడుతూ) సుడులు తిరిగి విరిగిపడే సముద్రపు కెరటంవంటిది మానవజీవితం. ఒక కెరటాన్ని మరో కెరటంవచ్చి కలుసుకున్నట్లు ఒక మనిషిని మరో మనిషి వచ్చి కలుసుకుంటాడు. దానితో యీ విచిత్ర నాటకానికి నాంది ప్రారంభమవుతుంది. వెన్నెల, నవ్వులు, పువ్వులు, సంతోషం,—ఆ తరవాత నిట్టూర్పులు, ఏడుపులు, వికటాట్టహాసాలు, పాలలో నీరులా కనిపించకుండా కలిసిపోతూ వుంటాయి.

ఆనంద్ : (పుస్తకం దినకర్ చేతికి అందిస్తూ) ఇక ఆలస్యం చెయ్యకండి. ప్రారంభించండి.

దిన : (పుస్తకం తీసుకొని) నిరుపేదల గుండెలలో నిదురిస్తున్న ప్రతీకార కాంక్షను మేల్కొలపనా? సింహాన్ని బోనునుంచి విడుదల చెయ్యనా?

దండ : (కుడివైపుచూసి తొందరగా) అయ్యగారు, అమ్మాయిగారు వస్తున్నారు. ఇంక మీరు మీ గదులలో కెళ్లిపొండి బాబూ!

ఆనంద్ : (దినకర్ తో) ఇక్కడ కూర్చుంటే ఎవరో ఒకరు వస్తూవుంటారు. రండి. గదిలోకిపోదాం.

దిన : వస్తాను నేస్తం!
నేను నీతో
వస్తాను నేస్తం!
నల్లని నిరాశల
విషాదవలయం దాటి
తెల్లని శాంతిపురం
పొలిమేరలవరకూ
వస్తాను నేస్తం!

(ఆనంద్, దినకర్ ఎడమవైపు నిష్క్రమిస్తూవుండగా కుడివైపునుంచి వామనమూర్తి, చిత్ర వస్తారు. యిద్దరి చేతులలోను పార్శిల్సు వున్నాయి. దండపాణి వారికెదురు వెళ్లి పార్శిల్సు అందుకొని టేబిలుమీద పెడతాడు.)

వామన: (దండపాణితో) ఎవరూ రాలేదా?

దండ: లేదుబాబూ!

చిత్ర: మీరు వృధాగా తొందరపడ్డారు డాడీ! మనవాళ్లకు పంక్చ్యువాలిటీ తెలీదని మీ కెన్నిసార్లు చెప్పాను.

వామ: దండపాణీ! మేడమీది సామాన్లు అన్నీ సరిగా సర్దావా?

దండ: అన్నీ ఎక్కడివియ్యి అక్కడే సర్దేశానండి.

వామ: ఈ పెళ్లికొడుకు చాలా తమాషా అయిన మనిషిఅని వాళ్లనాన్న మాటలవల్ల తెలుస్తోంది. ఒకటి రెండురోజులు యిక్కడే వుండిపోతానని అన్నా అనవచ్చు. లేదా ఒక అరనిముషంలోనే తిరిగి వెళ్లిపోవచ్చు.

చిత్ర: వెళితే వెళ్లనివ్వండి. కొంపతీసి మీరు అతనిని బ్రతిమాలరు కదా డాడీ!

వామ: ఇంటికి వచ్చినవాళ్లను మర్యాద చెయ్యవద్దటమ్మా!

చిత్ర: ఇటువంటిలేనిపోని మర్యాదలు చెయ్యడంవల్లనే యీకాలపు అల్లుళ్లకు కొమ్ములు మొలుస్తున్నాయి.

దండ: మా బాగా సెప్పారు అమ్మాయిగారు! నేను మొదటి మాటు మా అత్తోరింటి కెళ్లినప్పుడు మా మరదలు నా వీపుమీద గరిట తిరగేసింది.

చిత్ర: (నవ్వుతూ) మంచిపని చేసింది. ఎంతటవాడైనా చచ్చుపెద్దమ్మ అయినా అత్తవారింటిలో తల ఎగరేసుకు తిరుగుతాడు. అటువంటివాళ్లకు బుద్ధి చెప్పవలిసిందే.

వామ: (కుడివైపుచూస్తూ) చూడమ్మా, ఎవరో వస్తున్నారు. అతనే పెళ్లికొడుకు అనుకుంటాను.

చిత్ర: (అటుచూసి) కాదునాన్నా, అబ్బాయిని ఒక్కడినీ పంపించనన్నాడు కదూ వాళ్లనాన్న. పెళ్లికొడుకయితే కూడా మరొకరిని తీసుకువచ్చును.

వామ: అవును. నువు చెప్పింది నిజమే.

(కుడివైపునుంచి నిరంజన్ వస్తాడు. చిత్రవైపు రెప్పవెయ్యకుండా చూస్తూ వుంటాడు.)

దండ: (నిరంజన్‌తో) దెయ్యం పట్టినవ్న మనిషిలాగ అలా సూత్తావేటయ్యా? ఏంకావాలి నీకు?

నిరంజన్: (తేరుకొని) వామనమూర్తిగారెవరు?

వామ: నేనే! ఎందుకు?

నిరం: ఆఁ!...మరి...(ఏం చెప్పాలో లోచక క్షణం ఆలోచించి—చప్పున ఏదో స్ఫురణకు వచ్చినట్లు) ఆనంద్ ఎక్కడ వున్నాడో చెబుతారూ?

చిత్ర: (కోపంతో) ఆ మాటముందే అడగకూడదూ? ఇంత నస్పెన్సు దేనికి?

★ నీలితెరలు ★

నిరం: (చిత్రకేసి తిరిగి) మీరు... యిక్కడ... లేడీ డైపిస్టా?

చిత్ర: (మరింతకోపంతో) నాన్సెన్సు! మేనర్సు తెలియవు.

దండ: (ఆశ్చర్యంతో) మేల్ నర్సు!!— అవునండి అమ్మాయిగారూ ఇతను అచ్చంగా మేల్ నర్సులాడు వున్నాడు. నేను మొన్న ఆస్పత్రికెళ్ళినప్పుడు చూశాను.

నిరం: ఆరవ నెంబరుగది ఎక్కడో చెబుతారా?

వామ: (ఎడమవైపు చూపిస్తూ) అదుగో! అదే!

(నిరంజన్ ఎడమవైపు నిష్క్రమిస్తాడు.)

దండ: (దీర్ఘంగా ఆలోచిస్తూ) ఈయన ఆనందంగార్ని ఎందుకు అడిగాడు నెప్మా!

వామ: ఎందుకో ఒకందుకు అడిగాడంతే! అతగాడిగొడవ యిక మనకెందుకు? పూరుకో?

చిత్ర: (రిస్టువాచిచూసి) అప్పుడే అర గంటదాటి పోయిందిడాడీ, యిక నేను పైకి పోయి చదువుకుంటాను.

వామ: మరో ఐదు నిముషాలు కూర్చో. తొందరపడకు.

చిత్ర: దండపాణి. ఈ పార్శిల్సు నా గదిలో పెట్టిరా!

(దండపాణి టేబిలుమీదవున్న పార్శిల్సు మేడమీదికి తీసుకు వెడతాడు. చిత్ర పుస్తకం తెరచి సోఫాలో కూర్చుంటుంది. వామన మూర్తి హాలులో అటూ యిటూ తిరుగుతూ మధ్య మధ్య కుడివైపు పరీకించి చూస్తూ వుంటాడు. మేడమీదినుంచి దండపాణి తిరిగి వస్తాడు.)

వామ: (కుడివైపు పరీకించి చూస్తూ) చూడమ్మా! చిత్రా, ఎవరో యిద్దరు యిటొస్తున్నారు.

చిత్ర: (తేచి తండ్రిని సమీపించి) అవును డాడీ! ఆ యిద్దరిలో పొడుగ్గావున్న వాడే పెళ్ళికొడుకు అయివుండవచ్చు.

దండ: (పరికించిచూస్తూ) అవునండి. అచ్చంగా పెళ్ళికొడుకులాగే వున్నారు.

వామ: వాళ్ళతో కొంచెం మర్యాదగా మాట్లాడమ్మా! తొందరపడకు.

(కుడివైపునుంచి కిశోర్, జయరాం ప్రవేశిస్తారు. యిద్దరి ముఖాలలోను నిరాశ తొంగ విస్తోంది.)

వామ: (కిశోర్ జయరాంలకు ఎదురువెళ్లి మర్యాదగా) రండి, కూర్చోండి.

(ఆహ్వానించడమే తడవుగా జయరాం వెళ్ళి సోఫాలో కూలబడతాడు. కిశోర్ సంశయంతో ముసిరికేసి చూస్తూ నిలబడతాడు.)

దండ: యింత ఆలస్యంగా వచ్చారేం బాబూ?

జయరాం: (సోఫాలో కదలకుండా కూర్చుని కోపంతో) ఆ ప్రశ్న వెయ్యడానికి నీకుగల హక్కేమిటో ముందు చెప్పు?

వామ: (జయరాంతో వినయంగా) ఏదో తెలియక అడిగాడు. ఏమీ అనుకోకండి.

కిశోర్: వూళ్ళో పనులు చూసుకొని వచ్చేసరికి కొంచెం ఆలస్యం అయ్యిందిలెండి.

వామ: అలాగే మేమూ అనుకుంటున్నాం.

చిత్ర: పనులేమిటి? పనులు! ఎన్ని పనులున్నా టైం తప్పకూడదు.

జయ: అయితే యీరాత్రి యిక్కడ వుండడానికి మాకు గది దొరకదా?

వామ: (వినయంగా) ఎంతమాట! మీకు గది లేకుండా చేస్తానా? (దండపాణితో) అలా నిలుచుని చూస్తావేం?

(దండపాణి కుడివైపు నిష్క్రమిస్తాడు.)

కిశోర్: (హాలును పరిశీలించిచూస్తూ) ఈ ప్రదేశమంతా చాలా కొత్తగా వింతగా కనిపిస్తోంది.

వామ: అబ్బాయి! నువ్వు ఎప్పుడూ పట్నంలోనే వుంటావనుకుంటాను.

కిశోర్: అవునండి. ఎప్పుడూ పట్నంలోనే వుంటాను. ఇక్కడికి రావలసిన అవసరం ఏంవుంది చెప్పండి?

చిత్ర: (కిశోర్‌తో) ఎంతవరకు చదువుకున్నారు మీరు?

కిశోర్: ఇంటర్మీడియట్ పాసయ్యానండి.

జయ: (లేచి ముందుకు వచ్చి సంచి తెరుస్తూ) ఎందుకైనా మంచిది. యిదిగో! సర్టిఫికేట్సు చూడండి.

వామ: అమ్మమ్మ! సర్టిఫికేట్సు చూడడం ఎందుకు? మీ మాటలమీద మాకు నమ్మకం లేదంటారా?

జయ: (సోఫాలో తిరిగి కూర్చుంటూ) ఈ రోజులలో ఎక్కడ చూచినా సర్టిఫికేట్సు అడిగేవాళ్ళే. కనీసం మీరైనా మా మాట మీద నమ్మకం వుంచినందుకు సంతోషిస్తున్నాం.

వామ: మీరు గది కావాలన్నారు. ఇక్కడ రెండు రోజులు వుండే ఉద్దేశం ఏమైనా వుందా నాయనా? ఇలా అడిగేనని ఏమీ అనుకోకండి.

జయ: రెండు రోజులేమిటి? కనీసం నాలుగు రోజులైనా వుంటాం.

వామ: ఓ! అలాగేవుండండి. యిక్కడ మీకే విధమైన లోటుపాట్లు జరగవు.

(కుడివైపు నుంచి దండపాణి ట్రేతో కాఫీ బిస్కట్లు తీసుకువస్తాడు. టేబిలుమీద నాలుగు కప్పులు, నాలుగు ప్లేట్లు పెట్టి నిష్క్రమిస్తాడు.)

జయ: (బిస్కట్లన్నీ క్షణంలో తిని కాఫీ తాగి, ఖాళీకప్పు క్రింద పెడుతూ) మీరు చేసిన మర్యాదకు మేం చాలా సంతోషిస్తున్నాం.

కిశోర్: (చుట్టూ చూస్తూ) ఈ పరిసరాలు, ఈ ప్రశాంత వాతావరణం, మీరు చేస్తున్న మర్యాద- యిదన్నీ చూస్తూ వుంటే యిక్కడ నాలుగు రోజులు నిశ్చింతగా గడపవచ్చు అనిపిస్తోంది.

వామ: అలాగే వుండండి. మా యింట్లో జరిగినట్లే యిక్కడ మీకు అన్ని సదుపాయాలు జరుగుతాయి.

కిశోర్: మా యింట్లోకూడా యిటువంటి సౌకర్యాలు జరగవని మేం నిరభ్యంతరంగా ఒప్పుకుంటాం.

వామ: మర్యాదకోసం అలా అంటున్నారు కాని మా కేంలోటు? (కుడివైపు చూస్తూ) దండపాణి! దండపాణి! (దండపాణి వస్తాడు అతనితో) వీరికి గది చూపించిరా.

దండ: రండి. బాబూ!

(ముందు దండపాణి వెనుక కిశోర్, జయరాం ఎడమవైపు నిష్క్రమిస్తారు.) ★

(ఇంకా వుంది)

పతిత జనోద్ధరణం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

గతసంచిక తరవాయి

౧3

ఆ మరునాటికి అరుణిలో బయలుదేరిన జిజ్ఞాస రాగమంజరి పసిగట్టి వేసింది. అప్పటినించీ అతన్ని మరింత బిగువుగా తన కౌగిలిలో బంధించి వేసుకుంది. ఆ మైకంలో మరి నాలుగైదు రోజులవరకు అరుణి తన ప్రశ్న మాట అంత గట్టిగా పట్టించుకోలేదు. అయినా అతని హృదయంలో అది అప్పుడప్పుడు మెరుగులుతూనే ఉంది.

ఒకనాటి అపరాహ్ణవేళ రాగమంజరి, కామమంజరి అతి రహస్యంగా గుసగుసలాడుకోవడం ప్రారంభించారు. ఆ గుసగుసలలో అరుణికి తన పేరు కొంచెం అస్పష్టంగా వినిపించింది.

మళ్ళీ అతనిలో మథన ప్రారంభమైంది. అంతలో కొంచెం దూరంలో రాగమంజరి తల్లి ప్రత్యక్షమైంది. ఆమె ఇక్కడికి వచ్చిన ఉతని కింత వరకు తెలియనే తెలియలేదు! మాటవరసకైనా రాగమంజరి ఆసంగతి అతనితో చెప్పలేదు. అంతలో అతనికి కామమంజరి ఒక్కమారుగా ఉన్నట్టుగా నవ్విన నవ్వడి వినిపించింది. దానికి కారణమేమో అతనికి తెలియలేదు. ఇక ఆనాటి సాయంకాలంలోగా ఆ విషయం అంతా నిష్కర్షగా తేల్చుకుని తీరాలని అతడొక నిశ్చయానికి వచ్చివేశాడు.

కాని సూర్యాస్తమయం అయినదాకా అతనికి రాగమంజరితో ఆ విషయం ప్రసంగించడానికవకాశమే దొరకలేదు. దీపదీపాల వేళ అరుణికా అవకాశం దొరికింది. కామమంజరి అప్పుడే రాగమంజరి గదిలోనించి వెళ్లిపోయింది. రాగమంజరి ఏదో పరధ్యానంగా ఆలోచిస్తూ కూర్చుంది. అరుణి లోపలికి వెళ్లగానే ఆమె ముఖం ఒక్కమారుగా వికసించింది. ఆమె తటాలున లేచి అతని సరసన చేరింది.

అరుణి ఆమె ఎదట కొంచెం వ్యంగ్యంగా తన అనుమానాలన్నీ వెళ్లబోసుకున్నాడు. రాగమంజరి మొట్టమొదట అతని మాటలకు వినీవిననట్టుగా, అంటీ అంటనట్టుగా సమాధానాలు చెప్పింది. అరుణి అంతటితో విడిచిపెట్టలేదు. ఈ మారు స్పష్టంగా గద్దించి అడిగాడు:

"మీ అమ్మ ఇక్కడికి వచ్చిన విషయం ఇన్నాళ్లినించీ నాతో ఎందుకు చెప్పలేదు? ఆమె నా ఎదటపడకుండా అలాగలాగ తప్పించుకు తిరగడానికి కారణమేమిటి?"

రాగమంజరి ఆ ప్రశ్నకు తగిన సమాధానం చెప్పలేకపోయింది. కొంచెంసేపు నిశ్చలంగా అతనివైపు చూచి గట్టిగా కౌగలించుకుంది.

"నేను మీ యెడల ఒక పెద్ద అపచారమే చేశాను. నన్ను మనసారా మన్నిస్తానంటే అదంతా మీతో మనవి చేసుకుంటాను."

ఆమె మరి అతని ముఖం కేసి చూడలేక కనురెప్పలు వాల్చివేసింది.

"ఏమా అపచారం?"

మళ్లీ అంతకన్నా గట్టిగా గదించి అడిగాడరుణి. రాగమంజరి అతని పాదాలపై వాలిపోయి అతని కాలివేళ్లు ముద్దుపెట్టుకుంది.

"నన్ను మన్నిస్తానని అభయప్రదానం చేస్తే మనవి చేసుకుంటాను."

అని సానునయంగా నిశ్చలంగా అతనివైపు చూచింది:

"ఈ అసాధభూతి వినయాలకేమిగాని అసలు జరిగిన కథ ఏమిటో త్వరగా చెప్పు! అసలీ కామమంజరి ఎవరు? ఇక్కడికెందుకు వచ్చినట్లు? మీ అమ్మ తిన్నగా నా ఎదుట పడకుండా మొహం తప్పించి తిరగడానికి కారణమేమిటి? కామమంజరికీ నీకు గల సంబంధమేమిటి?"

రాగమంజరి ఆ ప్రశ్నల పరంపరతో అలాగే దిగాలు పడిపోయింది. ఇక లాభం లేదని తన కథ మొదలు పెట్టింది:

"కామమంజరిచంపాధీశ్వరుల ఆస్థానంలో నర్తకి—"

అరుణి అలాగే ఆమె వైపెంతో ఆశ్చర్యంగా చూచాడు. రాగమంజరి ఒక గుటక మింగి మళ్ళీ అలాగే తన కథ చెప్పుకుపోయింది:

"ఒకనాడు మహారాజ సన్నిధిలో మా ఇద్దరికీ మధ్య నృత్యపరీక్ష జరిగింది. మేమిద్దరం ఆనాడు మేనకా విశ్వామిత్ర నృత్యం చేశాము. నేనాడు సాక్షాత్తు మేనకలాగే నృత్యం చేశాను. నిజంగా కామమంజరి ఆనాడంత గొప్పగా నృత్యం చెయ్యనేలేదు. అయినా ఆమె యెడల తమకుండుకున్న మమకారం కొద్దీ మహారాజు ఆమె నృత్యమే గొప్పగా ఉన్నదని ప్రశంసించారు. రాజే తలుచుకుంటే మరి దబ్బలకేమి కొదవ? ఆపైన మిగిలిన విద్వాంసులందరు నా నృత్యమేమీ బాగాలేదని ఈసడించివేశారు. కామమంజరి నృత్యమే నా నృత్యంకన్నా బాగా మిన్నగా ఉన్నదని ఆకాశాని కెత్తివెయ్యడం ప్రారంభించారు. నాకా సమయంలో ఒళ్లు మండిపోయింది. కాని నేనొక్కర్తెను! అబలను! ఎంత గొప్పగా మేనకా విశ్వామిత్రనృత్యాభినయం పట్టితేమాత్రం ప్రయోజనమేమిటి?"

అని రాగమంజరి ఉసూరుమని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టింది. అరుణి కామె ఆకథ ఎందుకుపక్రమించిందో బోధపడలేదు:

"అయితే ప్రస్తుతం కామమంజరి ఇక్కడికి రావడానికీ దీనికీ సంబంధమేమిటి?"

అని అన్నాడెంతో విసుగ్గా.

రాగమంజరి క్షణంసేపాగి మళ్ళీ మొదలుపెట్టింది:

"స్వామీ! అదే విన్నవించుకుంటున్నాను. కొంచెం సావధానంగా చిత్తగించండి. తరవాత ఇష్టాగోష్ఠిలో మహారాజు ప్రసంగం క్రమక్రమంగా విశ్వామిత్ర మహర్షి తపోనిష్ఠమీదికి తిరిగింది. తరవాత మేమంతా జితేంద్రియులైన మహాత్ముల మహిమలను గురించి ప్రసంగించుకొన్నాము. కొంతసేపటికా ప్రసంగంలో మీ మాట వచ్చింది. మహారాజు మీరు సాక్షాత్తు మహర్షికల్పులనీ, పరమబ్రహ్మణ్యులనీ ప్రశంసించారు.

★ పతిత జనోద్ధరణం ★

కామమంజరికి మిమ్మల్ని గురించి ఏమీ తెలియనే తెలియదు. అయినా ఆమె ఇచ్చకాలు చెప్పడం మొదలు పెట్టింది. మహారాజన్న మాటకు సరిగా అదే ధోరణిలో పక్కతాళం వెయ్యడం ప్రారంభించింది.

నాకా కామమంజరి ఇచ్చకాల ధోరణి గమనించగానే హఠాత్తుగా అరికాలిమంట నెత్తికెక్కింది. ఇక తమాయించుకోలేక పోయాను:

"మహారాజా! ఎందుకీ ప్రగల్భాలు! పురుషులంతా ఎంతటి బ్రహ్మజ్ఞులయినా కాంతామణులకు దాసానుదాసులే!"

అని నా ఉక్రోషం పట్టలేక ఉన్నది కాస్తా దురుసుగా దులిపేశాను."

అని రాగమంజరి తన కథ అంతటితో ఆపివేసి కొంచెం సిగ్గుతో అరుణివైపు చూచింది. అరుణి ఆమాట విని నిలువునా నిర్ఘాంతపోయాడు. అంతలోనే రాగమంజరి తిరిగీ తన కథ ప్రారంభించింది:

"స్వామీ! నేనా సమయంలో మహారాజుమీద, కామమంజరిమీద బయలుదేరిన అక్కసుకొద్దీ ఆమాట అనేశాను. అంతే గాని అది మీమీద అగౌరవంకొద్దీ అన్నమాట కానే కాదు. నేననుకున్నట్టే ఆమాట మహారాజుకు, రాగమంజరికీ బాగా పాడుచుకుంది.

ఆపైన కామమంజరి నా మాటకు హఠాత్తుగా అడ్డుతగిలి "అరుణిముని పరమ బ్రహ్మజ్ఞ్యులనీ మహాత్ము"లనీ అన్నది. వెంటనే మహారాజామెకు పక్కతాళం వేశారు. దానితో నా ఉక్రోషం బాగా రెచ్చిపోయింది. "అందానికేమి లెండి! ఎంతటి మునీశ్వరులనైనా మూడు నిమిషాలలో నాకు దాసానుదాసులుగా చేసివేస్తాను! కావలిస్తే పందెం వెయ్యండి!" అన్నాను. దానిమీద కామమంజరి మరింత రెచ్చిపోయింది.

'అరుణిముని అలాంటివారు కానే కారు. ఒకవేళ నీవేకనక ఆయన వ్రతభంగం చెయ్యగలిగితే నృత్య నాట్యాలలో ఇక నీవే యీ రాజ్యానికంతటికీ గొప్పదానివని ఆక్షణం నించీ అంగీకరించి నీవనక నిలబడతాను సరిగదా!' అని గట్టిగా కవ్వించింది. మహారాజా మెను వెనక వేసుకువచ్చి 'చేతనైతే ఆ పందెం గెలుచుకో'మని నన్ను చూచి అతిహేళనగా నవ్వారు! వారిద్దరు ఏకమై నన్నావిధంగా కించపరచడంతో ఆవేళ అంతా నాకిక నిద్రపట్టలేదు. ఆ మరునాడే బయలుదేరి మీ ఆశ్రమానికి వచ్చివేశాను."

రాగమంజరి ఆపైన మరి మాట్లాడలేక నెమ్మదిగా విలపించుకుంది:

"స్వామీ! నేను మీయెడల చాలమాలిన మహాపచారం చేశాను. నన్ను మన్నించండి."

అని అరుణిపాదాలు రెండు పట్టుకుంది.

కథ చిట్టచివరిఘట్టంలోకి వచ్చేసరికి అరుణి మరి తనకళ్లే నమ్మలేకపోయాడు. ఒక్క నిమిషంసేపు అలాగే శిలాప్రతిమలా నిర్ఘాంతపోయాడు:

"రాగమంజరీ! అయితే ఇన్నాళ్ళనుంచీ నీవు ఆడిందిఅంతా కట్టికపటనాటకమేనా?"

రాగమంజరి తలఎత్తి క్షణకాలం అతని ముఖవైఖరి గమనించింది:

"స్వామీ! మీరన్నట్టు ఇన్నాళ్ళనించీ నేను నిజంగా కపటనాటకమే ఆడాను. కాని ఈ క్షేత్రానికి వచ్చినప్పటినుంచీ నేను చేసినదానికెంతైనా పశ్చాత్తాపపడ్డాను. నేను చేసిన పాపానికి మరిప్రాయశ్చిత్తం లేదని నాకు తెలియకపోలేదు. అయినాదయ తలిచి నన్ను కొంచెం మన్నించండి."

అని అతనిపాదాలు రెండుమరింతగట్టిగా అదిమిపట్టుకుంది. ఆమాటతో అరుణిశరీరం క్రోధావేశంతో గజగజవణికిపోయింది. అతడొక్కమారుగా విరుచుకుపడ్డాడు:

"అయితే ఈ కామమంజరినీ, మీఅమ్మనీ ఇక్కడికెందుకు పిలిపించావు? నీగొప్ప చెప్పుకుని నలుగురిలోను నన్నవమానపరచడానికేనా?"

ఉరుమువంటి ఆప్రశ్న విని రాగమంజరిని అంతగా నిర్ఘాంతపడలేదు:

"వారిద్దరు మిమ్మల్ని చంపానగరానికి తోడుకురమ్మన్నారుగాని నేనే దానికంగీకరించలేదు. తిరిగి మీతోకలిసి ఆశ్రమానికే వెళ్ళిపోతానని ఇప్పటినించీ నిజంగా నాకు ప్రపంచంపై విరక్తికలిగిందనీ అన్నాను. నామాట నమ్మండి! నన్ను మన్నించండి."

అని రాగమంజరి అతన్ని మరింత అప్యాయంగా బతిమాలుకోవడం మొదలుపెట్టింది. ఆపైన వెంటనే అతనిపాదాలమీద వాలిపోయింది.

కాని అదంతా కేవలం నటనేఅనిగ్రహించడానికి అరుణికొక్క క్షణంకూడా పట్టలేదు ఉత్తరక్షణంలోనే లేచి నిలబడి ఒక్క దూకులోనే అతడామెపట్టు విడిపించుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు. అగదిలోనే కుప్పగా కూలబడిపోయిన రాగమంజరికి "ఛీ పాపాత్మురాలా! ఎంతద్రోహాని కొడిగట్టావు. ఇప్పటికీ ఇంకా నటనేనా?" చాల్చాలు లే! పో!" అన్నమాటలు విస్పష్టంగా వినిపించాయి.

౧౪

అరుణి ఒళ్ళు తెలియకుండా అలాగ ఆమసక మసక చీకటిలోపడి తొందర తొందరగా నడిచివెళ్ళిపోయాడు. అంతే గాని ఒక్కమారైనా వెనక్కి తిరిగి చూడలేదు. అతడెక్కడికి నడిచివెళ్ళిపోతున్నాడో అతనికే తెలియదు!

అరుణికింక ఆక్షేత్రంలో ఒక్కక్షణం కూడా ఉండడానికి మనస్కరించలేదు. ఒక్క దూకులో నందీశ్వర క్షేత్రం పొలిమేర దాకా నడిచివెళ్ళిపోయాడు. అప్పటికి బాగా చీకటి పడింది. అతనికి మార్గం కూడా తిన్నగా కనిపించలేదు. పైగా గమ్యస్థానమేదో అతనికే తెలియదు! అలాగలాగ నడిచి పోగా పోగా ఆ క్షేత్రానికి పొలిమేరలో అతనికొక జీర్ణదేవాలయం కనిపించింది.

ఒళ్లెరగని నడకతో అరుణి బాగా అలిసిపోయాడు. ఆదేవాలయం చూడగానే అతనికి ఆరాత్రికక్కడ విశ్రమించాలని అనిపించింది. అతడలాగే ఆజీర్ణదేవాలయ మంటపంలో చదికిలపడ్డాడు. కొంత సేపటికి నెమ్మదిగా అక్కడ మేనువాల్చాడు.

అప్పటికతనికి, కొంచెం స్పృహవచ్చినట్లయింది. అలాగే పడుకుని గత చరిత్ర అంతా తలుచుకోవడం మొదలుపెట్టాడు. అదంతా అతనికొక పీడకలలా కనిపించింది. అలాగ తలుచుకుంటున్నంతసేపు అతని నోటినుంచి అప్రయత్నంగా "ఎంతటి ద్రోహాని కొడిగట్టింది!" అన్న వాక్యం నాలుగైదు మారులు వెలువడింది.

కొంతసేపు గడిచిపోయేసరికి నాళ్ళనించీ జరిగినదంతా అతనికికొంచెంస్పష్టంగా తెలిసింది. ఆశ్రమానికి వచ్చినప్పుడు వేశ్యమాత ఆడినది అంతా కేవలం నాటకమే అని అతని కొక్కక్షణంలో అవగతమైపోయింది. గంగానదిలో మునిగిపోతున్నట్టు రాగమంజరి కేకలుపెట్టడం కూడా కేవలం నటనేఅని అతడొక్కక్షణంలో గ్రహించి వేశాడు.

సరీగా అదే సమయంలో అతని కెదురుగా ఒకమూలకొంచెం శిథిలమైపోయిన గ్రామ దేవతా విగ్రహం కనిపించింది. అదిచూడ గానే అతనికి ఆశ్రమంలో చండీ దేవతా మూర్తి జ్ఞాపకం వచ్చింది.

"అవిచ్ఛిన్నంగా రెండు పుష్కరాల పాటా దేవత పాదాలాశ్రయించాను. నా తపః ఫలితం అంతా చిట్టచివరికీవిధంగా బుగ్గి అయిపోయింది."

అని సణుగుకోవడం మొదలు పెట్టాడు. అతనికా దేవతావిగ్రహం చూస్తూంటే హృదయంలో పట్టరాని అసహ్యభావం బయలుదేరింది. ఆరుణి ఇక ఆ దేవతముఖం చూడలేక పెడమొహం పెట్టుకుని కూర్చున్నాడు.

క్రమక్రమంగా అతని హృదయంలో ప్రస్తుతం తన గమ్యస్థానాన్ని గురించిన జిజ్ఞాస బయలుదేరింది. మొట్ట మొదటగా తిరిగి తిన్నగా తన ఆశ్రమానికే వెళ్ళిపోవాలని అనుకొన్నాడు. శిష్యుల కింకా తనమీద అంతటి అనుమానం కలగ లేదని అతడింతకు పూర్వమే గ్రహించు కొన్నాడు. ఆశ్రమానికి చేరుకుంటే తిరిగీ నిశ్చల హృదయంతో జపతపాదులుపక్రమింప వచ్చునని అతని ఆశ.

కాని తిరిగి తన ఆశ్రమానికి వెళ్ళడం అంటే అతనికి రుచించలేదు. ఇక మిగిలినది మరీచి మహర్షి ఆశ్రమం. ఆమాట తలుచుకుంటేనే అతనికెందుకో పెద్ద సంకోచం బయలుదేరింది. తానీ విధంగా భ్రష్టుడైపోయి మరీచి మహర్షి ఆశ్రమం చేరుకుంటే ఆయన అప్యాయంగా ఆదరించగలడనే ఆశ ఏమి ఉంది?

మరీచి మహర్షి తన కథవిని మరి ఆశ్రమానికి దరిమానికికూడా రావద్దని దూర దూరంగా తరిమి వెయ్యవచ్చును! మరి గత్యంతరం? చల్లచల్లగా తన ఆశ్రమానికి వెళ్ళిపోవడమే అతనికిక శరణ్యంగా కనిపించింది. కాని ఆ విధంగా తన ఆశ్రమానికి చేరుకోవడం అతనికంతగా రుచించలేదు.

అతని గుంజాటన ఎంతసేపటికీ నిష్కర్షగా ఎటు తేలలేదు.

ఆ గుంజాటనతో అతనికి ఆ రాత్రి అంతా తిన్నగా నిద్ర పట్టలేదు. తెల్లవారు జామున కొంచెం చిన్న కునుకు పట్టింది. నిద్రలేవగానే ఆరుణికి ఆచార్యుని సన్నిధికి వెళ్ళిపోయి తన పాపపంకిలగాథ అంతా ఆ మహర్షికి ఆ మూలాగ్రంగా నివేదించి, ఆయన పాదాలాశ్రయించడమే శరణ్యమని అనిపించింది. తరవాత ఆ జీర్ణ దేవాలయంలో అతడొక్క క్షణమైనా నిలవలేదు. వెంటనే బయలుదేరాడు. మార్గంలో అన్న పానాదుల విషయంకూడా అతడంతగా ఆలోచించలేదు. ఎక్కడైనా లభ్యమైతే కాయో కసరో తిని ఆనాటి కలాగే కాలక్షేపం చేసేవాడు.

ఆరుణి అలాగ ఏకబిగిని పదిపదిహేను రోజులపాటు ప్రయాణం సాగించి ఒకనాటి ఉదయానికి మరీచీమహర్షి ఆశ్రమం చేరుకున్నాడు.

కాని మహర్షికి ఎదుటపడడాని కతని కెంతో సంకోచం కలిగింది. అయినా ధైర్యం వహించి అతని సన్నిధికివెళ్లి సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆరుణి కన్నీటిలో ఆచార్యునిపాదాలు తడిసిపోయాయి. మరీచి ఎంతో ఆప్యాయంగా పిలిచి "లే నాయనా!" అని ఆజ్ఞాపించేదాకా అత డాచార్యుని పాదాలు విడిచిపెట్టలేదు. వాత్సల్యపూరితమైన ఆతనిపిలుపు వినగానే ఆరుణికి కొంచెం ధైర్యం వచ్చింది. వెంటనే నెమ్మదిగా లేచి కూర్చున్నాడు.

౧౫

మరీచి ఆరుణినెంతో వాత్సల్యంతో ఆదరించి అతని యోగ క్షేమాలడిగి, తెలుసుకొన్నాడు. మహర్షి ఆదరం చవి చూచిన ఆరుణి కప్పటికి బాగా ధైర్యం కలిగింది. తల వంచుకుని నెమ్మదిగా తన విషాద గాథ అంతా ఆ మూలాగ్రంగా మరీచి మహర్షికి విన్నవించుకొన్నాడు. ఆకథ పూర్తికాగానే మహర్షి తనమీద విరుచుకు పడగలడేమో అని ఆరుణి కొంచెం భయపడ్డాడు. కాని మహర్షి ఆరుణిని చల్లని చల్లని మాటలతోనే ఓదార్చాడు. అంతేగాని అతనిని పల్లెత్తుమాట అనలేదు. ఆ అపార వాత్సల్యం చవిచూచిన ఆరుణికంఠం గద్గద భారంతో వణికిపోయింది. అతడు తన కిటువల కలిగిన ఒకసంశయం మహర్షికివిన్నవించుకున్నాడు.

"మహర్షీ! నేను రాగమంజరిమీద ఎంతైనా జాలి దలిచాను. ఆమె నుద్ధరింపవలెననే అనుకున్నాను. చివరికా పాపాత్ములు నన్నీ విధంగా వంచించడానికి కారణమేమిటి? నేనేమి పాపంచేసుకొన్నాను?"

మహర్షి పెదవిపై చిరునవ్వు చిగిరించింది. వెంటనే కొంచెం మృదువుగా మందలించాడు:

"ఆరుణీ! నీవామె నెందుకు నిందిస్తావు! దీనిలో నాకామె చేసిన తప్పిదమేమీ గోచరించడం లేదు!"

ఆరుణి తెల్లబోయి మహర్షివైపలాగే చూస్తూ కూర్చున్నాడు. మరీచి మహర్షి అంతలోనే అందుకొన్నాడు:

"పై పైకి నీ హృదయసంకల్పం నిష్కల్మషంగా ఉంటే ఉండవచ్చును. కాని అంతరాంతరాలలో నీలోని కామలాలస పూర్తిగా నశించలేదు. ఆ కారణంవల్లనే మొట్టమొదటగా నీకామె యెడల ఆ విధంగా జాలికలిగింది. అదే చిట్టచివరికి నీ భ్రష్టత్వానికి దారితీసింది. అనవసరంగా ఆమె నిందించడంవల్ల ప్రయోజనమేమిటి?"

అయినా ఆరుణికా విషయం పూర్తిగా బోధపడలేదు. కొంచెం సేపాలోచించి మెల్లిగా నసిగాడు:

"నాకింకా సందేహ నివృత్తి కాలేదు. దయఉంచి నా అజ్ఞత మన్నించండి... అయితే మొదటనించీ ఈ పన్నాగం అంతా పన్ని నన్నీ విధంగా మోసగించినది ఆమే కదా?"

"కావచ్చును! కాని నీ హృదయం నిష్కల్మషంగా ఉన్నప్పుడు ఆమె ఎంత పాపబుద్ధిలో వస్తే మాత్రం నిన్నేమి చెయ్యగలదు?"

అని మరీచిమహర్షి తిరిగి ఒక్క నవ్వు నవ్వాడు:

"ఆరుణీ! అజ్ఞులు తమలోక ప్రవృత్తికి కేవలం బాహ్యసంఘటనలే ప్రధాన కారణాలని భ్రమిస్తారు. అంతేగాని తమలోని సంస్కారాల సంకల్పాల వల్లనే బాహ్యసంఘటనలుద్భవిస్తాయని గ్రహించుకోలేరు!"


"వెర్రివాడా! నీ హృదయం నిష్కల్మషమైతే ప్రపంచంలోని వారంతా సజ్జనులుగానే కనిపిస్తారు. లేకపోతే వారంతా దుష్టులుగానే భాసిస్తారు. ఈ రహస్యం తెలిస్తే ఒకర్ని నిందించవలసిన అవసరమే లేదు. కనకనే నిన్ను ముందుగా నీ ఆత్మ సముద్ధరణ విషయం ఆలోచించుకోవలసిందని అన్నాను—జ్ఞాపకం ఉన్నదా?"

ఆరుణి మరీచి సూక్తులు జాగ్రత్తగా విని ఒక్క నిటూర్పు విడిచి పెట్టాడు:

అయితే జీవులకిక పతితులు, దుఃఖితులు అయిన వారి నుద్ధరించే అధికారమే లేదన్న మాట!"

మరీచి ముఖం మళ్ళీ కొంచెం జేవురించింది:

"త్రికరణ శుద్ధిలేని వారికా అధికారం లేనిమాట నిజమే! అదికాక నిన్నింకా ఒక్క భ్రమపట్టుకుని పీడిస్తూంది. నీ వెన్నడు ఇంకొకరి నుద్ధరించలేవు! అది చెయ్యగలిగినదా జగన్మాత మాత్రమే! ప్రపంచం అంతా





నీ వెన్నడూ ఇంకొకరి నుద్ధరించలేవు! అది చెయ్యగలిగినదా జగన్మాత మాత్రమే!

★ పతితజనోద్ధరణం ★

ఆ జగన్మాతృస్వరూపమే! కనక నీవొకరికి చేయగలిగిన ఉపకృతి ఏదైనా ఉంటే అది నీ ఆత్మోద్ధరణమాత్రమే ఉపకరించగలదు. కనక నీవొకరికి ఉపకృతి చేస్తున్నావని భావించడం కేవలం అహంకారమే! ఆ అహంకారనాశనం జరిగేవరకు నీ కొకరిని ఉద్ధరించే అధికారమే లేదు. ఇది ముమ్మాటికీ నిజం. ఈ ఆర్యసూక్తి జాగ్రత్తగా మననం చేసుకో!"

అరుణికా ఉపదేశంతో కొంచం ఊరట కలిగింది. అయినా అతనికి రాగమంజరి యెడల ద్వేషభావం ఇంకా బాగా సడలలేదు. ఒక నిట్టూర్పు విడిచిపెట్టాడు:

"ఏది ఏమైనా ఆ పాపాత్మురాలు నాకొక అశని పాతంలా దాపురించింది."

అని తలవంచుకొన్నాడు. మరీచి మళ్ళీ అతన్ని మందలించాడు:

"నాయనా! ఈ అఘాతంవల్లే నీలోని పాపచింత అంతా క్షాళితమైపోయింది. ఇక ముందిది నీ సాధన కెంతైనా ఉపకరించగలదు. కనక ఆమె నీకీవిధంగా ఉపకరించినదనే అనుకో! ఇక ఇప్పటినించీ ఆమె నెన్నడు నిందించకు. ఆమె జగన్మాతస్వరూపిణి అని భావించుకో! ఆమె ఆ విధంగా నీ హృదయకల్మషం పోగొట్టి నిన్నుద్ధరించినదనుకో! అదే నీకు శ్రేయస్కరం!"

అరుణి నెమ్మదిగా అక్కడినించి లేచి వెళ్ళి నాలుగైదు రోజులపాటు మహర్షి చేసిన సదుపదేశం అంతా జాగ్రత్తగా మననం చేసుకొన్నాడు.

క్రమంగా ఆ ప్రశాంతాశ్రమంలో అతని హృదయం పద్మముకుళంలా స్వచ్ఛమై వికసించింది.

"నిజానికి నాలో అంతకుపూర్వం అంతర్నిహితంగా ఉండిపోయిన కామ సంకల్పం వల్ల నేనే పతితుడనైపోయాను. ఆ తరుణంలో రాగమంజరే నన్నుద్ధరించింది."

అని ఆలోచిస్తూ ఒక్క చిరునవ్వు నవ్వుకున్నాడారుణి. ఆ భావనతో అతని అహంకారం అంతా పటాపంచలై పోయింది. అదే క్షణంలో అతని హృదయంలో ఒక నూతన విజ్ఞానజ్యోతి మెరిసింది.

—సమాప్తం.

నిరుద్యోగ పర్వం

బి. యే. పాసయినతర్వాత రామ్మూర్తి ఏం చేస్తాడని పట్టుకున్నది. బి. యే. పాస్ కావాలని రామ్మూర్తి పెద్దలంతా కోరినట్టే అతనుకూడా పాసయి కూచున్నాడు.

ఐతే రామ్మూర్తి తర్వాత ఏం చెయ్యాలి?- రామ్మూర్తి తండ్రి స్కూల్లో టీచరు వుద్యోగంచేస్తూ పాతికేళ్ళయి గడుపుకొస్తున్నాడు.

“బియ్యేడీకి పోతేనో?” అన్నది రామ్మూర్తి తల్లి.

“ఏమన్నా చెయ్యనీ కానీ-వాడిని మరి బడిపంతులు వుద్యోగంమాత్రం చెయ్యనివ్వను. పాతిక సంవత్సరాలై నేను అందులోనేపడి ఏడుస్తున్నా-ముక్తి మోక్షం దొరకటం లేదు. బడిపంతులు వుద్యోగం ఎందుకూ పనికిరానివాడు చెయ్యాల్సిందని నా వుద్దేశం!” అని రామ్మూర్తి తండ్రి ప్రకటించాడు.

రామ్మూర్తికి ఒకవుద్దేశం అంటూ ప్రత్యేకించి ఏమీ కనిపించటం లేదు. అతని దృష్టికి స్కూలుటీచరు వుద్యోగం మంచిదేనని వున్నట్టు తోచింది. సంవత్సరం పొడుగునా సెలవలూ-పెద్దగా చిరాకుపుట్టించేపని కాకపోవటం-పదిమంది కుర్రాళ్లు గౌరవంగా నమస్కారాలు పెడుతూ వుండటం-ఇటువంటివి రామ్మూర్తికి మంచివిగానే తోచినై. ఐతే తండ్రిమాత్రం ఆ వుద్యోగం ఎందు కొద్దంటున్నాడో అతనికి అర్థంకాలేదు.

“ఇంతకూ నన్నేం చెయ్యమని నీ వుద్దేశం?” అన్నాడు తెగించి రామ్మూర్తి తండ్రితో.

“ఏం చేస్తావు? వేరే వుద్యోగాలకోసం చూస్తావు. మీనమేషాలు లెక్కపెడుతూ కూచోక, పత్రికల్లోనో ఎక్కడో చూస్తూ ఎక్కడెక్కడ ఏమేం ఖాళీగావుంటున్నయ్యో చూసుకో. కొత్తగవర్నమెంటులో పడివుంటే, ఎప్పటికన్నా మెరుగే. ప్రమోషనులూ-ఇంక్రిమెంటులూ-ఆఖరుకు రిటైరయితే ఇంత పింఛనుకూడా పారేస్తారు!”

రామ్మూర్తి వార్తాపత్రికలు గాలించసాగించాడు, సర్టిఫికేట్లు సంపాయించాడు. దరఖాస్తులు పంపుతున్నాడు!

ఇంతలో ఎక్కడినుంచో రామ్మూర్తి మేనమామ కలగజేసుకున్నాడు.

“ఎందుకురా ప్రతీవాడికీ గవర్నమెంటు వుద్యోగాలు? కలకాలం గుమస్తాగా పడివుండాల్సిందేగా. ప్రమోషనా - వల్లకాడా? నిత్యం ఆ బల్లదగ్గర కాయితాలు రాయటం తప్ప పదిమందిలోనూ గౌరవమూ - పేరా - ప్రఖ్యాతా? నామాటే చూసుకో. తెల్లవారి లేచి ఆరోగంటకు ఆఫీసుకు పోతాను. సాయంత్రం ఏ ఏడెనిమిది గంటలకో తెముల్చుకుని ఇంటికి వస్తే అదృష్టవంతుడినే. గంతలుకట్టిన గానుగెద్దులాగా జీవితాంతం చెయ్యాల్సినపనే యిది! సాయంత్రం కాస్సేపు సరదాగా తిరుగుదామంటే ఈజీవితం నోచుకోలేదు. ఇంత చచ్చినా ఆ జీతంరాళ్లు నూటపాతిక దాటవు. ఈ సంసారం అప్పులతోనే నడుస్తున్నది. ఇదట్లా తీరుతుందో

రావి కొండలరావు

రుద్రుడికే తెలీదు. గుమస్తాగిరీ మాత్రం చెయ్యకు. ఐనా నీవంటివాడికి గుమస్తా ఖర్మం ఏంరా?—నిక్షేపంవంటి తెలివితేటలున్నయ్ - బోలెడన్ని కథలు రాశావు - ఏ పత్రిక ఆఫీసులోనో నువ్వు వూఁ అంటే ఏ సబ్ ఎడిటర్ వుద్యోగమో పారేస్తారు. నామాటవిని ఆ పనిచెయ్యి. కీర్తికి కీర్తి-ఎంతలేదన్నా రెండువందలుదాటి తెచ్చుకుంటావు. అటువంటిదాల్లో వుంటే పైకిరాగల లక్షణాలు నీలో వున్నైగనుక చెబుతున్నాను. ఇటువంటి పనులు చెయ్యగలిగే శక్తికలవాళ్లు లోకంలో తక్కువ. గుమస్తాకేం - ప్రతీవాడూ పనికొస్తాడు” అనే ధోరణిలో ఆయన ఉత్తరం రాశాడు.

రామ్మూర్తికి ఇది బాగానే కనిపించింది. నాలుగయిదు పత్రికా కార్యాలయాలకు దరఖాస్తులు పెట్టాడు. మరోచిత్రం ఏమిటంటే రామ్మూర్తికి నాటకాల సరదావుంది. చదువుకునేరోజుల్లో చాలాసార్లు బడిలోనూ కాలేజీలోనూ నాటకాల్లో వేషాలు వేశాడు. కొన్ని బహుమానాలు కూడా సంపాయించాడు! ఇది ఆధారంగా తీసుకుని రామ్మూర్తి స్నేహితులు కొందరు అతన్ని సినిమాపరిశ్రమలో జేరమన్నారు. చదువుకున్నవాడూ-సంస్కారం, రూపం రెండూవున్నవాడూ అరుదు అన్నారు. పైగా నాటకాల్లో చచ్చేంత అనుభవం వుందన్నారు!

రామ్మూర్తికి ఈ సలహాకూడా నచ్చింది. ఐతే అతను దేనికీ ఛటాలున నిర్ధారణకు రాలేకపోతున్నాడు!

తన మేనమామ రాసిన విషయాన్నీ, స్నేహితులు యిచ్చిన సలహాలనూ రామ్మూర్తి ఆలోచించి తండ్రితో చెప్పాడు—

“ఇక్కడ వుండి ఈ పత్రికా కార్యాలయాలకు వుత్తరాలు రాయటం ప్రయోజనకరంగా కనిపించటం లేదు. ఏ సినిమాడైరక్టరునో కలుసుకుని అతనిదగ్గర అసిస్టెంటుగా వుండటానికి అడగనూవచ్చు - పత్రికాధిపతులను కలవనూవొచ్చు. నేను అనే దేమిటంటే ఒకటిరెండు నెలలు మద్రాసులోవుండి ప్రయత్నంచేదామని!”

ఈ వ్యవహారం రామ్మూర్తి తండ్రికి నచ్చలేదు. ఆయన ఇదంతా కొట్టిపారేశాడు. కాని, రామ్మూర్తి తల్లీ, రామ్మూర్తి స్నేహితులూ, బంధువులూ, పైగా మేనమామా-వీళ్లంతా అతన్ని మద్రాసుకు పంపటం వుత్తమం అని సలహాలివ్వటం సాగించారు. ఆఖరుకు రామ్మూర్తిని మద్రాసు పంపాలనే నిర్ధారణకు రావటానికి అతని తండ్రికి నెలరోజులుపట్టింది!

రామ్మూర్తి మద్రాసు చేరాడు. చేరుతూనే ఒక పత్రికాకార్యాలయంలోకి ప్రవేశించి తననుగురించి పరిచయంచేసుకుని-తన అభిలాష వ్యక్తంచేశాడు. “మా ఆఫీసులో వుద్యోగాలేం లేవే! ఐనా ఒకసారి మా ప్రొప్రయిటర్ గార్ని చూడండి!” అన్నాడు రామ్మూర్తి చెప్పినదంతా విని ఒకాయన. రామ్మూర్తి ప్రొప్రయిటర్‌ను చూడటానికిపోతే ఆయన అక్కడలేడు!

“లేరండీ” అన్నాడు రామ్మూర్తి తిరిగివచ్చి.

“సరే-వొస్తాలెండి.” అని ఆయన, “ఏం పాసయానన్నారు?” అని ప్రశ్నించాడు.

“బియ్యే.”

నిరుద్యోగపర్వం

ఆయన కొంతసేపు ఆలోచించి "పెద్దవాడి
నిగా ఒక సలహా యివ్వమంటారా?"
అన్నాడు.

తప్పకుండా ఇవ్వమన్నాడు రామ్మూర్తి కళ్లు పెద్దవిచేస్తూ.

"నిరుద్యోగసయారు కాబట్టి మీకు ఇంకో వుద్యోగం దొరకదనే భయం లేదు. జర్నలిజంలో పడి బాగుపడినవాడు ఇంతవరకూ లోకంలో లేడు. జర్నలిజం అనేటప్పటికి ప్రతివాడికీ కొన్ని వూహలుంటాయి.. నిజమే. తీరా ఈ ప్రపంచంలో పడేసరికి అవేవీ పనిచెయ్యవు. 'ఇక్కడ కూచుని అవీయివీ రాయటంతప్ప-స్వంత' అభిప్రాయాలకు ఇక్కడ అంతచోటు కూడా వుండదు. పాతిక సంవత్సరాలుగా నేను ఇక్కడే పనిచేస్తున్నాను. మొదట్లో ఎన్నో కష్టాలు పడవలసివచ్చింది. ఒక స్టేజిలో ఈ వుద్యోగం మానేసి ఇంకో వుద్యోగానికి పోదామని కూడా అనిపించింది. కాని, ఆదర్శంగా మొదట్నుంచీ పెట్టుకుని తలదూర్చినతర్వాత కష్టాలు అనుభవిస్తే అనుభవిస్తాం అని వుండిపోయాను. మీరు ఇంకా కుర్రాళ్ళు. ఇంకా జీవితం అంటే ఏమీ తెలీదు. మనసులో ఏవేవో వూహలు పెట్టుకుని చేదామనే వుత్సాహంతో వుంటారు. ఇక్కడేమీ లాభంలేదు. నేనేదో నిరుత్సాహపరుస్తున్నానని, 'మధ్య వీడి కెందుకు' అనీ అనుకోకండి. మొదట్నుంచీ యిందులో వుండి సాధకబాధకాలు అనుభవిస్తున్నాను కాబట్టి చెబుతున్నాను. ఆ తర్వాత మీ ఇష్టం! ముందుకు రావలసిన వాళ్ళకూ నాలుగురాళ్లు వెనకేసుకునేందుకూ మాత్రం ఇది చోటుకాదు!" అన్నాడాయన.

రామ్మూర్తికి నోరువిడలేదు - తన మేనమామ మాత్రం చటాలున గుర్తొచ్చాడు!

పత్రికా కార్యాలయంనుంచి బయట పడ్డాక రామ్మూర్తి చాలా ఆలోచించాడు. ఈ వుద్యోగ ప్రయత్నాలు అతనికి చాలా అవకతవకగా కనిపించినై. ఎక్కడకు పోయినా ఎదురే కనిపిస్తున్నది. తండ్రీ, మేనమామా, పత్రికా కార్యాలయంలోని ఒక సంపాదకుడూ-వీళ్ళ ముగ్గురికీ అభిప్రాయాలలో చాలా భేదాలు కనుపిస్తున్నయ్. ఆ 'భేదాలు' ఎందుకొస్తున్నయ్యా అని రామ్మూర్తి తల పగలగొట్టుకున్నాడు.

నాలుగురోజులు తిరగ్గా రామ్మూర్తికి ఒక సినిమా డైరక్టరు దర్శనం లభించింది.

"నమస్కారం" అన్నాడు రామ్మూర్తి.

"మీ పేరు" అన్నాడు దర్శకుడు.

"మూర్తి" అని బదులు చెప్పాడు 'రామ్మూర్తి' అనేపేరు తనకే అసహ్యంగా తోచి. అదీగాక, సినిమాపరిశ్రమలో 'రామ్మూర్తి' అనేపేరు పనికిరాదనీ, దాన్ని 'మూర్తి' చెయ్యాలనీ అతను భావించాడు.

డైరక్టరు ఆప్యాయంగా చాలాప్రశ్నలు వేశాడు. అన్నింటికీ రామ్మూర్తి జవాబిచ్చాడు.

"సరే ఐతే-ప్రస్తుతం అన్ని వేషాలకూ మనుషులను ఏర్పాటుచేసేశాం. పోతే, నాకు అసిస్టెంట్లు నలుగురున్నారు. ఇద్దరికి అసలు పనీపాటూకూడా లేదు! ఏవన్నా వేషాలురాగానే కబురుచేస్తాను-మీ అడ్రసు ఆఫీసులో ఇచ్చి వెళ్లండి!" అనేసి ఆయన నిష్క్రమించాడు.

'థాంక్స్' అనుకున్నాడు రామ్మూర్తి మనసులో.

ఆఫీసులో చూడగా-ఆగదిలో ఒక ముసలాయనతప్ప ఇంకెవరూ కనిపించలేదు. ఆయన ఏవో లెక్కలు చేసుకుంటున్నట్టు కనిపించాడు. తన అడ్రస్ కాగితంమీద రాసి ఇచ్చాడు ఆయనకు.

"ఇంతసేపూ డైరెక్టరుగారితో మాట్లాడుతున్నది మీరేనా?" అన్నాడాయన కళ్ళజోడు తీసి బల్లమీద పెడుతూ.

"అవును."

"కూచోండి."

రామ్మూర్తి ఉత్సాహంగాకూచున్నాడు.

"నేనోమాట చెబుతాను వినండి. మీరు అన్యథా భావించకండి. బాగుపడదామనుకునే వాళ్ళకూ, సుఖపడదామనుకునే వాళ్ళకూ ఈ ఇండస్ట్రీలో స్థానంలేదు. ఇక్కడ కావలసింది ఇంకోటి! మీరు నిరుద్యోగసయారా యమ్మే పాసయారా అక్కర్లేదు ఇక్కడ. ఇక్కడసలు తెలివితేట లున్నవాళ్లు పనికిరారు. 'నేను తెలివైనవాడిని' అని చెబితే ఇక్కడ ఉద్యోగం రాదు. 'నేను వెధవను' అనే ధోరణిలో చెప్పాలి. ఈయనేదో వేషం ఇస్తాడనే ఉద్దేశంలో మీరుండి - రోజూ ఆశగా ఎదురుచూస్తారు. పిక్చరు పూర్తయిపోతుంది. మీకు వేషమూరాదు - ఏమీ రాదు. అవన్నీ వట్టికబుర్లు. ఈ పరిశ్రమలో నాకు పదిహేను ఏళ్లయి అనుభవముంది. మొదట్లో అసిస్టెంటు డైరెక్టరుగా వుండేవాడిని. డైరెక్టరును ఐపోతానని కలలుగన్నాను. ఎనిమిది పిక్చర్లకు అసిస్టెంటుగా పనిచేశాను. ఎవడికీ మనమీద కనీసం గౌరవమన్నా లేదు. ఆఖరుకు అసిస్టెంటుకుకూడా నేను పనికిరానన్నారు. ఈ ఆఫీసులో పడ్డాను. గంపెడు సంసారం. అంతాబాధ. ఈ పరిశ్రమలోకి మాత్రం రాకండి - ఎందులోనన్నా పని చెయ్యండి. నైతికంగాకూడా మనుషులు చెడిపోయేవాళ్లున్నారు. మనం ఏదానికీ మాటాడటానికి వుండదు. సలహాయివ్వబోతే పనికిరాదు! స్వానుభవం నాయనా స్వానుభవం!" అన్నాడు ముసలాయన తన ఆవేదనంతా రామ్మూర్తిముందు వెళ్ళగక్కుతూ.

రామ్మూర్తికి కళ్లుతిరిగాయి. నిరుత్సాహముగా లేచాడు. మారుమాటాడకుండా బయటపడ్డాడు.

అంతా కార్లూ- బస్సులూ రొదగోల. ఆ గోలమధ్యలోపడ్డాడు. అతనికి తల తిరిగిపోతున్నది. ఎవరి ఉద్యోగాన్ని వాళ్లెందుకు ఇట్లా తిట్టుకుంటున్నారో అతనికి అర్థం కాలేదు. ఐతే తనేంచెయ్యాలి? తనతండ్రికి బడిపంతులు ఉద్యోగం నరకం! ఇంకొడికి స్వర్గం—మేనమామకు అతని ఉద్యోగం నరకం—పత్రికలో వుద్యోగం స్వర్గం! ఇంకొడికి అది నరకం!...వాళ్లుచేసే ఉద్యోగాలు కాక...ప్రతివాడికీ ఎదటివాడి వుద్యోగం-ఎండమావుల్లాగా కనిపిస్తున్నదా! ఆత్మలను చంపుకుని వీళ్లంతా ఎందుకు చేస్తున్నారు ఆ ఉద్యోగాలు? ఈ భేదాలు ఎందుకొచ్చినై?—

ఏం చెయ్యాలి తను?—

ఎందులో చేరాలి?—

తనభవిష్యత్తు ఏమిటి?—

తల పైకెత్తి రామ్మూర్తి ఆకాశంవంక చూశాడు. శూన్యం తప్ప మరేమీ కనిపించలేదు!! ★

అతిరథులూ మహారథులూ

"కుట్టింది గుణవంతురాలూ, కూసింది గయ్యాళీ...! మీరు చేసేపిచ్చి చేష్టలన్నీ ఎవరికీ తెలీవు. నేను వాగింది మాత్రం అందరికీ వినిపిస్తుంది. పొద్దున్నగా కొళాయి దగ్గర బిందెలు పారేసి కాళ్ళు చాచుక్కూచున్నాను. ఎంతకీ వదలరాయను. పట్టుకున్న నీళ్ళన్నీ ఏ గోతిలో పోస్తున్నారో తెలీటం లేదు. ఇంత మొండికాపురాన్నింట్లో పెట్టుకుని, వేగడం బ్రహ్మతరంగాదుగదా బ్రహ్మనుపుట్టించిన వాడిక్కూడా చేతగాదు. రామ!...రామ...ఇంత ముదనష్టపు వాళ్లు ప్రపంచంలో పుట్టరు...పుట్టబోరు!"

ఇలా ఏకటాకీని, మూర్తిదాల్చిన కాళికలా గర్జిస్తోంది గజలక్ష్మమ్మగారు. ఆంజనేయస్వామిగారికోసం అప్పుడే గడపలో అడుగుపెట్టిన సుబ్బారావు అమాంతం నించుండిపోయాడు పక్కకితొలగి.

"అవునే! మట్టూమర్యాదా లేని వాళ్లతో మాటలు పెంచుకోటం, మనకుమాత్రం ఏం మర్యాద?...పక్కయింటి కెళ్లి పట్టుకొచ్చుకోండి ఈపూటకి నీళ్ళు!"

అతినింపాదిగా అంటున్న ఆంజనేయస్వామిగారి కంఠం వినిపించింది సుబ్బారావుకు.

గొంతు సవరించుకుంటూ గోడ పక్కనించి గుమ్మంలోకి వచ్చాడు సుబ్బారావు. కంఠధ్వని విన్నారు కాబోలు గబగబా వాకిట్లోకి వచ్చారు ఆంజనేయస్వామిగారు 'ఎవరక్కడ' అంటూ.

అప్పటివరకూ జరిగిన ఆర్భాటం చూసి, పరిస్థితి బాగా లేదని భావించి, యింటిముఖం పట్టబోతున్న సుబ్బారావును చూసి, ఆంజనేయస్వామిగారు ఆహ్వానించారు లోపలికి. సమయం కాని సమయమైనా తప్పనిసరి అవడం చేత, లోపలికెళ్ళికూర్చున్నాడు సుబ్బారావు.

"ఆంజనేయస్వామిగారు అందెవేసిన చెయ్యి జాతకాలు రాయడంలో. సంస్కృతాంధ్ర సాహిత్యాల్లో ఆయనతో సమానంగా నిలబడగల వ్యక్తి నిజంగా లేడనవచ్చు. ఎంత పండితుడో అంత సాత్వికుడు. నోటిలో నాలుక లేదు. మెత్తగా జడపత్తిలా కనిపిస్తాడు. ప్రతివాళ్లనీ, యిట్టే ఆకర్షిస్తాడు. ఎంతటి ఘాటైన మాటైనా ఆయన కంఠం దాని కొక అందమైన, మృదు మధురమైన స్వరూపం మలచగలదు. సజ్జనుడు. స్నేహపాత్రుడు. ఇతరుల కష్టసుఖాలలో అవలీలగా పాలుపంచుకోగలిగిన పరమ ధార్మికుడు"

ఇవి ఆంజనేయస్వామిగార్ని గురించి ఆవూళ్లో అందరనుకునే మాటలు.

అలాంటి ఆంజనేయస్వామిగారికోసం అంతసేపట్నించీ సుబ్బారావు కాచుక్కూచున్నాడంటే ఆశ్చర్యమేముంది?... అందులో అతడు జీవితయాత్రలో అడుగు పెట్టిన తొలి రోజుల్లో అందాలు చిందించే కొడుకు పుట్టాడు సుబ్బారావుకు. ఆ చిన్నారి కొడుకు జాతకం, ఆంజనేయస్వామిగారి హస్తాల్లో వ్రాయించాలని అతని ఊహ. అందుకే అంత పొద్దున్నే - అలా వచ్చి వాకిట్లో నిలబడ్డాడు. జననం గురించి చెప్పి, తిథి వార నక్షత్రాలు కనుక్కొని, 'తీరిక చేసుకుని మీరు త్వరగా రాసి ఇవ్వాలి:' అని అతి విధేయత అగుపించేట్టు

శ్రీనివాసకాశ్యప

చెప్పి - యింటి ముఖం పట్టాడు సుబ్బారావు.

* * *

ఆంజనేయస్వామిగారంటే ఆ వూళ్ళో తెలీని వ్యక్తిలేడు. చిన్ననాటినుండీ కొన్ని లక్షల జాతకాలు వ్రాసిపారేసుంటాడాయన. తరతరాలుగా వారి కదేవృత్తి. వారి వంగడంలో అందరూ పండిత ప్రకాండులే; పరమశ్రోత్రియులే!

పైన శాలువా కప్పుకుని, పంచాంగం చేత్తో పట్టుకుని బయల్దేరితే - ఆంజనేయస్వామిగారు, అక్కడక్కడా మజిలీలు చేసుకుంటూ ఆయన్ను అన్నివిధాలా గౌరవించే పెద్దల యిళ్లన్నీ ఓసారి చుట్టబెట్టి - ఏ పన్నెండింటికో తిరిగొస్తూంటారు యింటికి. రోజూ అలా ఓసారి అందర్నీ పలకరించి, వారి వారి మంచిచెడులన్నీ విచారించి, వారికావలసిన విషయాలేవేనావుంటే చెప్పి యింటికి రావడం ఆంజనేయస్వామిగారి కలవాటు.

అలాగే ఆనాడుగూడా బయల్దేరబోతున్న ఆయనకు, గజలక్ష్మమ్మగారి గర్జన వినిపించి ఆగిపోయారు. హడావుడి అంతా తగ్గాక బయల్దేరబోతూ వుంటే సుబ్బారావు వచ్చాడు చూడండి జాతకమంటూ. ఇన్నీ సరిదిద్దుకుని, సుబ్బారావును చూసి చెప్తానని చెప్పిపంపించి తాపీగా, పంచాంగం - ముహూర్త దర్పణం మున్నగు గ్రంథాలన్నీ తీసుకుని బయల్దేరారు ఆంజనేయస్వామిగారు.

అలా నాలుగడుగులు వేశారో లేదో, అప్పుడే మార్కెట్టునించి వస్తున్న పరంధామయ్యగారు పలకరించి, నిలవేశారు.

"నిన్న సాయంకాలమూ, ఇవ్వాళ పొద్దున్నా ఏమిటో మీ యింట్లో గంద్రగోళంగా వుంది?..." అని అడిగారు పరంధామయ్యగారు కొశ్చెన్‌మార్కు ముఖం పెట్టి.

"గంద్రగోళాని కేముంది? కాపురముంటున్న కల్యాణరామయ్యర్ భార్యతో పోరు! వాళ్లు వచ్చిన ఏ రెండు మూడ్నెల్లో సరసంగా ప్రవర్తించారు. ఇక తరువాత చూడండి అన్నిటికీ అడ్డమే! ముందు ముఖ్యంగా నీళ్ళువదలరు మా ఆవిడ పట్టుకోడానికి. మొదట మొదట యిది, పోనీలెమ్మని సర్దుకుపోతూ వచ్చింది. రాను రాను వాళ్ల ప్రవర్తన పెడదోవలు తొక్క మొదలెట్టింది. దాంతో ఘర్షణ! యింతకంటే ఏముంటుంది చెప్పండి!" అన్నారు ఆంజనేయస్వామిగారు అతి నింపాదిగా.

"మీ గృహిణీమణి గట్టిగా కాపురంచేసే యిల్లాలు గనుక సరిపోయిందిగాని, లేకపోతేనా!...ఆ కళ్యాణ రామయ్యర్ భార్య కామాక్షమ్మన్నదే...హబ్బో! అంతగయ్యాళి గంపను నేనింతవరకూ చూళ్లేదంటే నమ్మండి. యింతకుపూర్వం మా ఫ్రెండ్సింట్లో గూడా

★ రథులూ - మహారథులూ ★

వీళ్లు కాపురం పెలగబెట్టి వచ్చారులెండి! వీళ్ళ సంగతి వాళ్ళ నడగాల్సిందే గాని, నా వల్లగాదు, వాళ్ళ చిద్విలాసాలన్నీ చిత్రించ డానికి!" అన్నారు పరంధామయ్యగారు అదను కనిపెట్టి అమాత్రం అవగలిగినందుకు సంతసిస్తూ.

"అయితే...మీకు వాళ్ళనుగురించి యింతకుముందే తెల్సునన్నమాట!" అన్నారు ఆంజనేయస్వామిగారు ఆశ్చర్యం వెళ్లబుచ్చుతూ,

"హా...హా...దానికేం లెండి! తెలుసు గనక చెప్పాను!" అన్నాడు పరంధామయ్య గారు పళ్లికిలిస్తూ.

"సరే కానీయండి చూద్దాం! సరసంగా వుండగలిగితే వుంటారు. లేకపోతే యింకో యిల్లు చూచుకుంటారు. మనమూ మర్యాదకే చూస్తున్నాం! వాళ్లు మనకు శాశ్వతమా మనిల్లే వాళ్ళకు శాశ్వతమా!" అని గబగబా ముందుకు నడిచారు ఆంజనేయస్వామిగారు.

సమయానికి తగ్గట్టు సమిధ వేసినందుకు సంతోషిస్తూ యిల్లుచేరుకున్నాడు పరంధామయ్య గారు.

* * *

కూడుగుడ్డలకు లోటైై కుంభకోణంనించి వచ్చి, హోటలు పెలయించి ఒచ్చిపోయే వారికి మంచివాడుగా మర్యాదస్తుడుగా మెలగుతున్న కళ్యాణరామయ్యర్ కాస్తా కూస్తా సంపాదించుకున్నాడు. ఊళ్ళో అందరూ అయ్యర్ హోటలుకు ఎగబడుతూ ఎకరాలకు ఎకరాలు ఎదజల్లుకున్నారు. కొన్ని కళ్యాణరామయ్యరే కొనుక్కున్నాడు. పదెకరాల దాకా పల్లపు భూమి సంపాదించాడు. అయితే యిల్లుమాత్రం ఇంకా కట్టించుకోలేదు ఎందుచేతో!

అందరికీ మంచివాడుగా ఉన్న అయ్యర్, ఆంజనేయస్వామిగారికీ ఆయన సతీమణికీ చెడ్డవాడుగా ఎందుకు కనిపిస్తాడో ఎవరికీ అంతుబట్టదు. అదే కాక, యిరుగు పొరుగుల్లో వుండే పరంధామయ్య, పాపారావు వగైరాలు అయ్యర్ ని అంతగా మెచ్చుకోలేరు. పదిగజాల దూరంలో ఉన్న పరంధామయ్యగారు మాత్రం—అయ్యరంటే అంతులేని వాత్సల్యాన్ని చూపిస్తారు.

నిజంగా అతడెంత కంటకుడుగా వుంటే-శరాయిదేశంవచ్చి పదిరాళ్ళిలా సంపాదించుకో గలుగుతాడు ?...అర్థంపర్థంలేని అడ్డ వాళ్ళ తగాదాల నాధారం చేసుకుని, అయ్యర్ ని అలా దుయ్యబట్టడం అవివేకం అంటారు కొందరు.

"అయ్యర్ తలుచుకుంటే-హోటలుకూ, కాపురముండడానికీ, కన్నుమూసి కన్ను తెరిచేలోపల కట్టించగలడు రెండతిసులమేడ-ఏం! ఆంజనేయస్వామిగారి యిల్లే అతడికి శాశ్వతమా ?!"..

ఇది అయ్యర్ అనుయాయులు అనే మాట.

"మద్రాసునుంచి కూడ కట్టుకొని, సాంబారు రుచిమరిపి, 'యిడ్లీ' అంటే ఎక్కడ లేనిమమతా కలిగించి, ఎకరాలకెకరాలు ఎగరతన్నుకు పోతున్నాడు అయ్యర్ !"

పెద్దపెద్ద భూస్వాముల తంత్రులు పెట్టే గోలయింది.


"'యిడ్లీ-సాంబారు' రుచి, యింతింతకాదని మెచ్చుకుని, మెదువికోడా (మెత్తని పకోడా) మీరే చెయ్యాలి మేమేంతినాలి." అని అహర్నిశలూ అంటూవుంటే పరంధామయ్యగారూ, పాపారావుగారూ, ఆంజనేయస్వామిగారు అమాంతం ఇలా మారి పోయా రేమిటి ?...

కొందరు కూటస్థులమాట యిది.

అందరికీ తలలోనాలుకలా తరతరాలుగా తెలుగువాడు కాకపోయినా ఆంధ్రులలో ఐక్యం అయిపోయిన అయ్యర్ ని అన్నిరకాలుగానూ అంటూవుండడం ఆవూళ్ళో అలవాటు. అయినా ఏ కొద్దిమందో తప్ప-తక్కినవాళ్లంతా-అయ్యర్ని గూర్చి "అఘండవ్యక్తి-సమయానికి తగ్గట్టు నడుచుకోగల సమర్థుడు" అంటారు.

అయినా అయ్యరివన్నీ పట్టించుకోడు. యింట్లో ఇంతింత తగాదాలు తలెత్తుతున్నా పల్లెత్తుమాట అన్న పాపానపోలేదు అయ్యర్. తన వ్యాపారమేమో తనేమో. కోడికూతతో లేచి, మడి బుజానేసుకుని పోయేవాళ్లతో సమంగా నిద్రలేస్తాడు. పైన తుండుగుడ్డ వేసుకుని, అడ్డపంచ నడికిబిగించి, తమలపాకులడబ్బా చేత్తోపుచ్చుకుని హోటలుకు వెళ్లి ఓంప్రథమంగా ఇడ్లీగిన్నె పొయిమీద ఎక్కిస్తాడు. అది మొదలు మళ్లీ రాత్రి ఏ తొమ్మిదికో పదికో కాని యిల్లుచేరడు. ఈలోపల యింట్లో ఏంజరిగినా, అయ్యరుకు అంతుపట్టదు. అంతు పట్టించుకోవాలని

(43.వ పేజీ చూడండి)


శివరాత్రి మహాపర్వం
ముగ్గు
యం.జి. కాంతమ్మ
ఆదోని

శివరాత్రి మాహాత్మ్యం

శివరాత్రి యావదాంధ్ర దేశానికీ మహా పర్వదినం మాఘ బహుళ చతుర్దశినాడు వచ్చే శివరాత్రికే మహాశివరాత్రి అని పేరు సాంప్రదాయికులు ప్రతి బహుళ చతుర్దశికీ మాసశివరాత్రి వ్రతం చేస్తారు. అయితే మాసశివరాత్రివ్రతం మనదేశంలో ఎక్కువగా శైవులలోనే పరిమితమై ఉంది

త్రిలింగదేశం

ఆంధ్రదేశంలో చాలా ప్రాచీన కాలం నించీ శైవవైష్ణవ సంప్రదాయాలు రెండు బాగా వ్యాప్తిలోకి వచ్చాయి అయినా చూపువాసి శైవ సంప్రదాయానికే బహుళ ప్రచారం ఏర్పడినట్లు కనబడుతుంది కాకతీయ చక్రవర్తుల కాలంలో మన దేశానికి 'త్రిలింగ' దేశమనే పేరేర్పడింది. శబ్దశాస్త్రజ్ఞు లు కొందరు త్రిలింగ శబ్దంలోనించే తెలుగు పదం బయలుదేరిందని అంటున్నారు ఏది ఏమయినా మన వాఙ్మయంలో నిదిగా పాతుకుపోయింది

కాకతీయులు పరమమాహేశ్వరులు ఆంధ్రదేశంలో ఆకాలంలో ప్రసిద్ధికెక్కిన మూడు శైవక్షేత్రాల ప్రాతిపదికతో కాకతీయులానాడు 'త్రిలింగ' దేశానికి పునాది వేశారు

ఈ మూడు లింగాలలో మొట్టమొదట పేర్కొనవలసింది శ్రీశైలం రెండవది దక్షారామం మూడవది కాళేశ్వరం ఆ రోజుల్లో కాకతీయ సామ్రాజ్యం ఇంచుమించుగా నేటి ఆంధ్రప్రదేశంలో అంతటా విస్తరించి ఉండేది

ఆ రోజుల్లో ఈ మూడు శైవక్షేత్రాలు ఈనాటికంటే బాగా ప్రసిద్ధి వహించి ఉండవచ్చును ఏది ఏమైనా కాకతీయులానాడీ మూడు శైవక్షేత్రాలు కలిగిన ఆంధ్రప్రదేశాని కంతటికీ త్రిలింగమని నామకరణం చేశారు

ఈ మూడు ప్రధాన శైవదేవాలయాల లోను మొదటిది రాయలసీమలోను, రెండవది సర్కారు జిల్లాల్లోను, మూడవది తెలంగాణాలోను ఉన్నాయి ఆంధ్రప్రదేశము మళ్ళీ ఇన్నాళ్ళకు 'త్రిలింగ' దేశ స్వరూపం ధరించింది

ఈ విధంగా చూస్తే ఈ నాటి శివరాత్రి మనకు నిజంగా మహా 'శివ'రాత్రే.

శివపూజ భారతదేశంలో ఎప్పుడు ప్రారంభమైనదో సరిగా నిర్ణయించి చెప్పడం చాలాకష్టం

శ్రీ వివేకానందస్వామి ఒకచోట యీ విషయాన్ని గురించి ప్రసంగిస్తూ అథర్వణ వేదంలోని యూపస్తంభవర్ణన పరమయిన స్తోత్రంతో శివారాధన ప్రారంభమై ఉండవచ్చుననీ ఆ యూపస్తంభమే క్రమక్రమంగా శివలింగాకారం ధరించి ఉండవచ్చుననీ అన్నారు



పంచరామాలలో ఒకటి, సామర్లకోట వద్ద వున్న కుమారారామంలోని భీమేశ్వరస్వామి

పతంజలి మహాభాష్యంలో శివస్కందాది ప్రతిమలప్రసక్తి కనిపిస్తున్నది మహాభాష్యం క్రీస్తుశకం మొదటి శతాబ్దంలో బయలుదేరినది. అందుచేత ఆకాలానికి శివపూజ బాగా వ్యాప్తిలోకి వచ్చినదని నిశ్చయించవచ్చును.

ఆ తరవాత బసవేశ్వరుని వీరశైవోద్యమ వ్యాప్తితో ఆంధ్ర కర్ణాటక దేశాలలో శైవ సంప్రదాయం బాగా విజృంభించింది మన దేశంలో సుప్రసిద్ధ త్రిలింగ క్షేత్రాలే కాక కాళహస్తి, పట్టిసమూ, కోటప్పకొండ మొదలయిన పుణ్యక్షేత్రాలింకా ఎన్నెన్నో ఉన్నాయి ఇవన్నీ ఆంధ్రదేశంలో బహుళం విజృంభించిన శైవభక్తికీ సంప్రదాయానికీ ప్రబల తార్కాణాలు.

శివరాత్రినాటి ఉదయం స్నానసంధ్యాదులు నిర్వర్తించుకొని దేవాలయాలలో అభిషేకాలు పూజలు మొదలయినవి చేస్తారు. ఆనాడంతా ఉపవాసం ఉండి రాత్రి తెల్లవార్లు జాగరణ చేస్తారు శివరాత్రి వ్రతంలో జాగరణం చాలాముఖ్యం

శివరాత్రినాడు జాగరణం చేసినంత మాత్రాన సమస్త పాతకాలు హరించిపోతాయని శైవపురాణాలుగ్గడిస్తున్నాయి

మాహాత్మ్యం

శివరాత్రి మహాత్మ్యం ప్రతిపాదించే గాథ లెన్నెన్నో మన పురాణాల్లో కనిపిస్తునాయి వీనిలో నిషాదుని కథ చాలా ముఖ్యమైనది.

పూర్వం మృగం మావృత్తి అవలంబించి అరణ్య జంతువులను సంహరించి జీవించే బోయవాడొకడుండేవాడు వాడొక కోమటికి బాగా అప్పు పడిపోయాడు ఆ కోమటి వాణ్ణి ఒక దేవాలయంలో బంధించాడట అంతలో శివరాత్రి వచ్చింది.


బోయవానికి తప్పని సరిగా శివరాత్రి నాడుపవాసం చెయ్యవలిసిన అవసరం కలిగింది వాడికి ఆ రోజున ఎవ్వరు పట్టెడన్నం పెట్టిన పాపాన్ని పోలేదు. కాని అది వాడికి పుణ్యం కిందే పరిణమించింది ఆ పైన వాడారాత్రి అంతా సరిగ్గా నిద్రపట్టక పోవడంవల్ల జాగరణం కూడా చేశాడు


మరునాడు భక్తులు కొందరక్కడికి వచ్చి బోయవాణ్ణివిడిపించారు వెంటనేవాడడవిలో వేటాడడానికి వెళ్ళాడు ఒక పెద్ద పులి తరుముకు వస్తే భయపడి ఒక చెట్టెక్కి కూర్చున్నాడు అదృష్టవశాత్తు అది ఒక మారేడు చెట్టు

బోయవాడు గతరాత్రి విన్న శివనామ స్మరణ వేళాకోళంగా అనుకరిస్తూ శివనామ స్మరణ చేయడం ప్రారంభించాడు తన కడ్డు వచ్చిన మారేడు రెమ్మలు విరిచి నేల మీద పడవేశాడు అవి చెట్టు కింద ఆకులలో కప్పడిపోయిన శివలింగంమీదపడ్డాయి. తృలవని తలంపుగా అది ఆనాడు శివపూజగా పరిణమించింది

ఆ మరునాడతడి కొక ఆడజింక కనిపించింది దాన్ని చంపబోతే అది చంపవద్దని మొరపెట్టుకుంది మొగజింకను, తన పిల్లల్ని

(55-వ పేజీ చూడండి)





కోటప్పకొండ సంబరం

"చేదుకో - కోటయ్యా"

గంధం లోకనాధశర్మ

చేదుకో - చేదుకో
చేదుకో - కోటయ్య
చేదుకోవయ్యా

కైలాస యీసుడా
కార్తికేయుండా
కాకాని వాసుడా
కాలరుద్రుండా!

మూడు మూర్తుల మేటి
ముగ్గురకు సాటి
ముద్దుగా మమ్మేలు
మొక్కెదము కోటయ్య!

అర్ధనారీశ్వరుడా,
అల్ప సంతోషీ,
అమరావతీవాస,
ఆదికేశవుడా!

తిన్నని బ్రోచినా
త్రినేత్ర సాంబా!
త్రిలింగ గురవయ్యా,
తీవ్ర నేత్రుండా!

కాళహస్తీశ్వరా,
కాటి కాపరుడా,
కంచీ నివాసుడా,
కామ దహనుండా!

ఫల్గునుని బ్రోచినా
పాప నాశనుడా,
పాశుపత మిచ్చినా
పాము భూషణుడా!

శివరాత్రి పర్వాన
శంభో శివా యంచు
నీ ఆలయము జేరి
నిన్ను పూజించేము!


కోటయ్య కొండనా
గోపురం బున్నా
కోటి లింగేశ్వరా,
కోటయ్య సామీ!

చేదుకో - చేదుకో
చేదుకో - కోటయ్యా
చేదుకోవయ్యా!



ఏటేటా మహాశివరాత్రినాడు గుంటూరు జిల్లా నర్సార
[illegible]

శ్రీకాళహస్తీశ్వ



భక్త శిఖామణి కన్నప్ప

సుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి శ్రీకాళహస్తీశ్వరుణ్ణి స్తుతిస్తూ ఒక శతకం రచించాడు ఆ శతకంలో

"ఏ వేదంబు పఠించె లూత?
భుజగంబే శాస్త్రముల్ సూచె? దా
నే విద్యాభ్యసనం బొనర్చె కరి?
చెంచే మంత్రమూహించె? బో
ధావిర్భావనిదానముల్ చదువు
లయ్యా! కావు, నీ పాద సం
సేవాసక్తియె కాక జంతుతతికిన్
శ్రీ కాళహస్తీశ్వరా!"


అన్నాడు

"సాలెపురుగు ఏ వేదాలు చదివింది? పాము ఏ శాస్త్రాలు చదివింది? కరి ఏ విద్య అభ్యసించింది? చెంచు ఏ మంత్రం జపించాడు? ఈ వేదాలు, శాస్త్రాలు, విద్యలు, మంత్రాలు ఇవన్నీ అసలైన ముక్తి జ్ఞానం కలిగించే చదువులేనా? కావు నీ పాద సంసేవాసక్తి ఒక్కటే ప్రాణికోటికి జ్ఞాన దాయకమైన, నిజమైన విద్య." అని తాత్పర్యం.

అకుంఠితమైన భక్తినిష్ఠకూ, కేవల శాస్త్ర జ్ఞానానికీ ఎంత తేడా ఉన్నదో చెప్పడమే ఈ పద్య ప్రయోజనం

అటువంటి అకుంఠిత భక్తి విశేషంతో మహేశ్వరుని గురించి అనేక సంవత్సరాలు తపస్సుచేసిన సాలెపురుగు, నాగుబాము, ఏనుగూ శివసాయుజ్యం పొందిన ప్రసిద్ధ శివక్షేత్రం శ్రీ కాళహస్తి ఏటేటా ఈ క్షేత్రంలో శివరాత్రి మహాపర్వానికి నేత్ర పర్వంగా ఉత్సవం జరుగుతుంది మొట్ట మొదటగా పై మూడు జంతువులూ ఇక్కడ తపస్సుచేసి ఈ స్థలానికి అనన్య మహాత్తును ఆపాదించాయి కనుక, ఆ మూడింటి పేర మీదుగా ఈ క్షేత్రం పేరుకూడా శ్రీ(సాలెపురుగు) కాళ(నాగుపాము) హస్తి (ఏనుగు) అయింది ఇక్కడ ఆ మూడుజంతువుల ఆకారాలనూ ఏకీకరించుకొని వెలసిన దేవుడు శ్రీ కాళహస్తీశ్వరుడైనాడు కాళహస్తిలోని లింగానికి చివర ఉన్న ఆయిదు ముఖాలు సర్పరాజు పంచఫణాలనీ, కొననుండి అడుగుదాకా లింగం నడుమ కనిపించే రెండు తెల్లపట్టెలు ఏనుగు దంతాలనీ, అడుగున సాలెపురుగు ఆకారంలో ఉన్న భాగం సాలెపురుగనీ అంటారు

'కైలాసవాసుడైన మహేశ్వరుడు దక్షి




శ్రీ కాళహస్తీన

ఏనుగుదంతాలను,

భాగాన పాలేరు రూపా



శ్రీ కాళహస్తీశ్వరాలయ పశ్చిమ ద్వారము.



...ర పుణ్యక్షేత్రం



...ని నిజాకృతి
...గను, అడుగు...
...న్ని చూడవచ్చు.




ముఖద్వారం వద్ద ఏకశిలా ధ్వజస్తంభంపై ఒకవైపు చెక్కిన శక్తిస్వరూపిణి

...ణదేశీయుల సమీపాన నివసించడానికి అనుకూలంగా బ్రహ్మదేవుడు కైలాసపర్వత శిఖరమొకదాన్ని తెచ్చి ఇక్కడ ప్రతిష్ఠించినట్లూ, అది కాళహస్తిపర్వతమై వెలసినట్లూ ఒక స్థలపురాణం ద్వారా తెలుస్తున్నది కనుకనే దక్షిణ కైలాసమని కూడా దీనికి మరో పేరున్నది

ఇకపోతే ధూర్జటి పద్యంలో ఉదహరించిన చెంచు కథ ఒకటి ఉన్నది ప్రసిద్ధ శివభక్తుడైన కన్నప్పయే ఈ చెంచు ఇతని అసలు పేరు తిన్నడు భిల్లకులంలో జన్మించాడు ఒకనాడితడు వేటాడుతూ అడవిలో తిరుగుతుండగా ఒకానొక నికుంజగృహంలో శివలింగం కన్నులపండువుగా కనిపించింది నిర్జనంగా, నిశ్శబ్దంగా ఉన్న ఆ భీకరారణ్యంలో దిక్కూ, మొక్కూ లేనట్లు ఒంటరిగా పడిఉన్న శివలింగాన్ని చూడగానే అసంస్కృతుడూ, అమాయికుడూ అయిన ఆ కిరాతుని హృదయం అనుకంపతో ఆర్ద్రమైంది. అప్పుడతడు ధూళి ధూసరితమైన త్రినేత్ర ప్రతిమను తన చెప్పులతో తుడిచి శుభ్రం చేశాడు అనతి దూరంలో ప్రవహిస్తున్న స్వర్ణముఖిలో నుంచి పుడిసెడు నీరు తెచ్చి దేవునిపై పుక్కిలించి అభిషేకం చేశాడు తాను చంపి తెచ్చిన పందిని కాల్చి, మాంసం కొంతరుచి చూచి బాగుందని తేల్చుకుని శివునికి నైవేద్యం ఇచ్చాడు

ఈవిధంగా తిన్నడు గాఢమూ మూఢమూ అయిన భక్తి తాత్పర్యాలతో అయిదు రోజులపాటు పరమశివుణ్ని మనసుతో భావిస్తూ, శరీరంతో సేవిస్తూ అక్కడే గడిపాడు


ఆరోనాడు పరమేశ్వరుడు తిన్ననిభక్తి తిన్ననిదో కాదో పరీక్షించాలనుకున్నాడు. తిన్నడు వేటకువెళ్ళి మాంసం తీసుకువచ్చే సమయానికి, తన కుడికంటినించి రక్తధార స్రవించేట్లు చేశాడు అది చూడగానే తిన్నడు "అయ్యో, నా తండ్రికి ఎంత దురవస్థ సంభవించింది? ఎవరిపాపానికి ఒడిగట్టారో గదా!" అని విలపించి, ఎన్నో మందులూ, మాకులూ తెచ్చి ముక్కంటి కంటికి పట్టించాడు కాని రక్తధార ఎక్కువైందే గాని తగ్గలేదు ఇక లాభం లేదని తలచితిన్నడు బాణాగ్రంలో తన కన్ను పెరుకుకొని ఆ కంటెని తీసి శివునికంటికిఅమర్చాడు. వెంటనే రక్తధార తగ్గింది తగ్గిందని తిన్నడు సంతోష...






ఆలయ ప్రాంగణంలో విజయనగర సామ్రాజ్యాధిపతి అచ్యుతరాయల పట్టాభిషేకోత్సవము జరిగిన ప్రత్యేక మండపం.

—ఫోటోలు: డి. రామలింగేశ్వరరావు.



శ్రీ కాళహస్తీశ్వరాలయ ముఖద్వారం.



జ్ఞాన ప్రసూనాంబ

[ఉత్సవ విగ్రహం]

★ శ్రీ కాళహస్తీశ్వర పుణ్యక్షేత్రం ★

పడుతున్న సమయానికి శివుని రెండవ కంటి నుంచి రక్తం కారజొచ్చింది అప్పుడతడు "సరే ఇంకో కన్నున్నదిగదా" అది కూడా వారికి సమర్పిద్దామనుకున్నాడు అయితే రెండు కళ్ళూ లేకపోతే శివుని ఎడమకన్ను ఎక్కడుంటో గుర్తు తెలియదని, చెప్పు విడవకుండానే కాలితో తిన్నడు తిన్నగా శివ నేత్రాన్ని తొక్కిపట్టి, తన రెండో కన్ను పెకలించుకోబోయినాడు అంతలో ఆది దేవుడు ప్రత్యక్షమై అతన్ని వారించాడు "నీ భక్తి పరీక్షించడానికే ఈ చిత్రమంతా కల్పించాను నీభక్తి అనన్య సామాన్యము, నిరుపమానము" అని శ్లాఘించి కైవల్యమనుగ్రహించాడు సామాన్యభక్తులు బిల్వపత్రాలతోనే శివుని పూజిస్తారు కాని తిన్నడు నేత్రపత్రాలతో శివపూజ చేసితరించాడు. ఆ నాటినుంచి తిన్నప్ప కన్నప్ప అయ్యాడు ఇది మరొక స్థల పురాణం

అసలీ తిన్నడు పూర్వజన్మలో అర్జునుడని కూడా ఒక ప్రతీతి ఉన్నది వనవాస కాలములో అర్జునుడు విజయవాడలో ఇంద్రకీలాద్రిపై తపస్సుచేసి శివుణ్ణి మెప్పించి ఆయన వరంకోరుకోమనగా పాశుపతాస్త్రం కోరుకున్నాడనీ, ఆ తరవాత 'అయ్యో, లౌకిక లోభాలకు లోబడి కేవల పాశుపతాస్త్రం కోరుకున్నానే, పాశుపత సాయుజ్యం కోరుకోలేకపోయానే' అని చింతించాడనీ, అప్పుడు పాలాక్షుడతన్ని ఓదార్చి మరోజన్మలో కిరాతుడవై పుట్టి నన్ను సేవించి నా సాయుజ్యం పొందగలవని అభయమిచ్చాడనీ అంటారు ఆ అర్జునుడే ఈ కిరాతుడైనాడని గాథ.

పృథివ్యాప్తేజో వాయు రాకాశ లింగాలలో వాయులింగం కాళహస్తిలో వెలసింది. దీనికి నిదర్శనంగా గర్భాలయంలోని దీపశిఖ వాయుసంచలిత మైనట్లు గోచరిస్తుంది. శివరాత్రినాడు (ఫిబ్రవరి 27) కాళహస్తిలో జరిగే మహోత్సవానికి ఎక్కడెక్కడి జనులూ వచ్చి స్వామిదర్శనం చేసుకుని తరిస్తారు


ఈ దేవాలయం 12 వ శతాబ్దాంలో వీర రాజేంద్రచోళదేవునిచేత నిర్మితమైనట్లు శాసనాలు తెలుపుతున్నాయి ఆలయంలోని నూరుకాళ్ల మండపాన్ని, గాలిగోపురాన్ని శ్రీ కృష్ణదేవరాయలు నిర్మించాడనికూడా శాసనాధారాలున్నాయి

ప్రధానాలయంలో అడుగిడగానే వరసగా బాలజ్ఞాన ప్రసూనాంబ, పాతాళ విఘ్నేశ్వరుడు, ప్రథమ ప్రాకారం దాటి వెళ్ళగానే దక్షిణామూర్తి, మృత్యుంజయుడు

(55-వ పేజీ చూడండి)



శ్రీ కాళహస్తీశ్వరాలయంలోని నందికేశ్వరుడు.



శ్రీ కాళహస్తీశ్వరాలయానికి పక్కనే వున్న కుంభేశ్వరుడు.

దాక్షారామ భీమేశ్వరాలయం

ఆంధ్రదేశంలో ప్రసిద్ధికెక్కిన ప్రాచీన పుణ్యక్షేత్రాల్లో దాక్షారామం ఒకటి. దీని చరిత్ర కనీసం ఆంధ్రచరిత్ర అంత ప్రాచీనమని చెప్పవచ్చును క్రీస్తుశకానికి పూర్వంనుంచీ ఈ క్షేత్రం సప్తగోదావరమనే పేరుతో కీర్తికెక్కినది ఏడుపాయల గోదావరి ప్రవహించిన ప్రాంతంలో ఉండడంవల్ల దీనికీ పేరువచ్చి ఉంటుంది. ఇక్కడిప్పుడు భీమేశ్వరాలయము, సప్తగోదావరమనే సరస్సు మాత్రం ఉన్నాయి

ఆంధ్ర శాతవాహన చక్రవర్తి హాలునికీ సింహళ దేశాధిపతి కుమార్తె లీలావతికి ఈ క్షేత్రంలో వివాహం జరిగిందని ప్రాకృత లీలావతీ కావ్యంలో వర్ణించబడింది. ఈ హాలుడు శాలివాహన శక ప్రారంభకుడైన శాలివాహనుడేనని చరిత్రకారులంటున్నారు. కనుక దాదాపు క్రీస్తుశకం మొదటిశతాబ్దంనాటికీ ఈ క్షేత్రం ప్రసిద్ధమైనదని చెప్పవచ్చును అంతేకాక హాలుని గాథా సప్తశతిలోకూడా సప్తగోదావర ప్రసక్తి కనిపిస్తున్నది ఆకాలంలో దీనికి "దాకరేమి" అనే పేరుండేది ఇది 'దాక్షారామ'కు ప్రాకృతమై ఉండవచ్చును

భరతఖండంలో ద్వాదశ శైవజ్యోతిర్లింగాలున్నాయనీ, ఆ పన్నెండింటిలో ఒకటి దాక్షారామలో ఉన్నదనీ పెద్దలు చెబుతారు

ఈ పుణ్యక్షేత్రంలో వెలసిన దైవం భీమేశ్వరస్వామి ఇప్పటి భీమేశ్వరాలయాన్ని నిర్మించినవాడు చాళుక్య భీముడు. ఇతడు క్రీ శ 10 వ శతాబ్దంలో రాజ్యం చేశాడు. ఆంధ్రదేశాన్ని పాలించిన తూర్పు చాళుక్యులు, కాకతీయులు, రెడ్లు ఇంకా ఎందరో భీమేశ్వరుని కొలిచి, దేవాలయానికి దానాలుచేసి, ధన్యులైనారు

దక్షునికి ఆరామభూమి కావడంవల్ల దీనికి దాక్షారామమని పేరు వచ్చినట్లు శ్రీనాథుని భీమఖండం పేర్కొంటున్నది


శైవపండిత త్రయంలోని వాడైన మల్లికార్జున పండితారాధ్యుడు దాక్షారామవాసియైన భీమనపండితుని కుమారుడు గనుక మల్లికార్జునుని విద్యాభ్యాసము, దీక్షాస్వీకరణము మొదలైన విచ్చటనే జరిగిఉండవచ్చునని, ఆ కాలంలో ఇది వీరశైవానికి ఆటపట్టుగా ఉండేదనీ ఊహింపవచ్చును

తెలుగు వాఙ్మయంలో భీమేశ్వరున కంకితమైన కావ్యాలు చాలా కనిపిస్తున్నాయి రుక్మాంగద చరిత్ర రచించిన మల్లన, ధనాభిరామకారుడు నూరన, భీమఖండం వ్రాసిన శ్రీనాథుడు భీమేశ్వరభక్తులే.


"దక్షిణ వారాణసికిని
మోక్షు శ్రీభోగ విభవ
మూలంబునకున్
దక్షారామంబునకు స
దృక్షంబగునట్టి పుణ్య
క్షేత్రము గలదే"

అని శ్రీనాథు డీక్షేత్ర ప్రశస్తిని వర్ణించాడు

మహాశివరాత్రికి దాక్షారామంలో జరిగే ఉత్సవం భక్తజన హృదయోత్సవమే నన డంలో సందేహం లేదు ★



శ్రీశైల మహా క్షేత్రం




త్రిలింగ క్షేత్రాలలో ఒకటైన శ్రీశైల దివ్య క్షేత్రం కర్నూలుకు 72 మైళ్ళ దూరంలో ఉన్నది. శ్రీశైలం నుంచి నంద్యాల 60 మైళ్ళు మార్కాపురానికి 84 మైళ్లు శ్రీశైలం నల్లమలకొండలకు చెందిన పర్వతరాజం ఇది కూడా ద్వాదశజ్యోతిర్లింగాలకు సంబంధించిన పుణ్యక్షేత్రమే శైవలోకపనివత్తులో

"శ్రీశైల దర్శనాన్ముక్తిః" అని చెప్ప బడింది స్కాందపురాణంలో శ్రీశైల క్షేత్ర మహాత్మ్యను వర్ణించే శ్రీశైల ఖండం ఉన్నది. ఇక్కడ 84 వేలమంది ఋషులు పరమేశ్వర ధ్యానంలో నిమగ్నులై ఉంటారనీ, 33కోట్ల మంది దేవతలు స్వామిని అహరహమూ దర్శిస్తూ ఉంటారనీ భక్తజన విశ్వాసము ఇక్కడ వెలసిన దైవం మల్లికార్జునస్వామి


మల్లికార్జునాలయం చుట్టూ కోటగోడల్లాంటి ప్రాకారాలున్నాయి ఈ ఆలయానికి వెనకాల భ్రమరాంబాలయం ఉన్నది ఆదిశంకరులవారు అక్కడ శ్రీ చక్రం ప్రతిష్ఠ చేశారు దీనికి చైత్రమాసారంభంనుంచి పౌర్ణమిదాకా పూజాదికం జరుగుతూ ఉంటుంది స్వామికి ఎడమతట్టున వేరే పార్వతీదేవి ఆలయం ఉన్నది ఉత్తరాయణ పుణ్యకాలంనాడు పార్వతికి, శివరాత్రినాడు భ్రమరాంబకు కల్యాణాలు జరుగుతాయి పార్వతికి ప్రత్యేకం పూజలు జరగవు ఎందుకంటే ఈశ్వరుడిక్కడ సాంబుడై అనగా అంబతో కూడి ఉన్నాడనీ, కనుక ఆమెకు ప్రత్యేక పూజలక్కరలేదనీ అంటారు.

స్వామి ఆలయంవద్ద కాకతి రుద్రమదేవి కట్టించిన కట్టడాలు కనబడు తున్నాయి విజయనగర రాజులలో మొదటివారు శైవులు కావడంచేత వారు శ్రీ శైలానికి చేసిన కైంకర్యాలు, కట్టిన మంటపాలు నేటికీ కన్పిస్తాయి రుద్రమదేవి మంటపం, నరసింహరాయ మంటపం, కృష్ణరాయ మంటపం ఈ నాటికీ శోభగానే కనబడతాయి. ఆలయం వెనక ఏనుగుల చెరువు ఉంది. అందులోని నీటివలన ఆలయావరణలోని పది పదిహేను బావులూ పుష్కలంగా ఉంటాయి రుద్రమదేవి ఏటా నాలుగైదు నెలలు ఇక్కడ నివసించేదట శివాజీ కూడా ఏటా ఒకసారి సైన్యసమేతుడై వచ్చి భ్రమరాంబాదేవిని సేవించి వెళ్ళేవాడట.

పూర్వపురాజులు, రాణులు ఇచ్చిన మడిమాన్యాలన్నీ ఏమైనాయో తెలియదు శివరాత్రి శివరాత్రికీ తండోపతండాలుగా వచ్చే భక్తజనులు ఇచ్చే కానుకలపైనే శ్రీశైల మల్లయ్య ఆధారపడి ఆదిభిక్షువనే పేరు సార్థకం చేసుకుంటున్నాడు.




శ్రీశైల మల్లికార్జునస్వామి ప్రాకారంపై మలచిన సుందర శిల్పాలు.



శ్రీశైలాలయంవద్ద ఛత్రపతి శివాజీ నిర్మించిన ప్రత్యేక మందిరం.

అపరబుద్ధి



డిటెక్టివ్ సీరియల్

(గత వారం తరువాయి)

ఈ విషయాలన్నీ వర్షాకాలంలో జరిగినవి. అప్పటినుంచి దాదాపు రెండు నెలలపాటు రాత్రిళ్ళు నిద్రే వుండేదికాదు. ప్రతిరోజూ ముందు జరగవలసిన కార్యక్రమం ఎలా కొనసాగించాలా అనే ఆలోచించేవాణ్ని. ఇటువంటి ఆలోచనలలో గంటలు క్షణాలవలె గడిచేవి. అతను రైలుమీదే ప్రయాణం చేయాలి. సొంతకారు వుండి, ఎప్పుడూ ఎంతదూరమైనా కారులో వెళ్ళటానికే అలవాటు పడ్డవాళ్లు రైలుమీద ప్రయాణం చేయటానికి ఇష్టపడరు. అతను రైలులో ప్రయాణంచేయటానికి ఇష్టపడకపోతే, మా శ్రమ అంతా వృధా అవుతుంది. ఈ చుట్టుప్రక్కల చిన్న పట్టణాల్లో చాలా మంది అసలు రైల్లో ప్రయాణం చేయని వాళ్ళుకూడా వున్నారు. వాళ్లందరూ కార్లలోనే ప్రయాణం చేస్తారు.

చంద్రశేఖర్ చెక్కువ్రాసి నాచేతికిచ్చేటప్పుడు నా ముఖంలోకి చూస్తూ నవ్వాడు. అప్పుడు నాలో ఆందోళన బయలుదేరింది. ఆ ఆందోళన కొంతవరకు నా ముఖంలో కూడా కనపడి వుండవచ్చు. నాకు ముచ్చెమటలు పోసినవి. నా పరిస్థితిని గాని, అతనికి నేను డబ్బు ఇచ్చి చెక్కు తీసుకోవటం గాని, ఇంకెవరూ చూడకూడదని అనుకున్నాను. ప్రత్యేకంగా ఆ సమయంలో అతని సెక్రటరి అక్కడ వుండటం నాకు ఇష్టంలేదు. మోటారుకారు భీమాఖర్చును, ఆయన కంపెనీ ఖాతాలో రాయించాడు. మొదటి చెక్కును రద్దు చేసినట్లుగా రాసి నాకు చూపించాడు. ఆయనకు ప్రీమియం డబ్బును ముజరా ఇచ్చినట్లు ఎవ్వరితోను తను చెప్పకపోవటమే నాకు కావలసింది. ఇది ఇతరులెవ్వరితోనూ చెప్పవలసిన విషయం కాదు. ఆయనకూడా దీనికి ఏ విధమైన ప్రాముఖ్యం ఇవ్వలేదు. ఈ సంగతి కూతురు కమలాక్షితో కూడా చెప్పలేదు చంద్రశేఖర్. కాని ఎంత చిన్న విషయమయినా, పెద్ద విషయమైనా, సాధారణంగా ఎవరితోనో ఒకరితో చెప్పందే కొందరికి మనసు నిలవదు. ఈ సంగతి కోమలానికి మాత్రము చెప్పాడు చంద్రశేఖర్.

మరోక విషయంకూడా నాకు ఆందోళన కలిగించింది. నేను ఎప్పుడూ ఈ విషయాన్ని గురించే మననం చేస్తూ కూర్చుంటే, నా వ్యాపారం మూలపడుతుంది. కంపెనీలో

తుమ్మలపల్లి
సీతారామారావు

నా సంబంధం తగ్గితే, నేను వాళ్ళకు దూరమవుతాను. అలా దూరము కావటం వల్ల నేను కూడా కొంత అనుమానికి ఆస్కారం కల్పించిన వాడినౌతాను. అందువల్ల ప్రతినెలా కొత్తవ్యాపారం కంపెనీకి ఇవ్వటానికి, అది ఒక నెలకంటే ఒక నెలలో ఎక్కువగా వుండటానికి ప్రయత్నం చేశాను. నా ప్రయత్నం ఫలించింది. నా సొంత కంపెనీ వ్యాపారం కూడా అభివృద్ధి చేశాను. లెక్కల పుస్తకాలు నాయోగ్యతకు, గౌరవానికి చిహ్నాలుగా కనపడుతున్నవి. భీమా కంపెనీలో కూడా అందరికీ ముఖ్యంగా మా జనరల్ మేనేజరు పాండ్యకు నేనంటే కంపెనీకి లాభాలు ఆర్జించిపెట్టే ఏజంటుననే గౌరవం, అభిమానం స్థిరపడ్డది.

* * *

"నూనెగనుల నిపుణుల సమావేశానికి ఆయన వెళుతున్నారు," అంది కోమలం ఒకరోజు ఉదయం ఇష్టాగోష్ఠిలో.

"ఎప్పుడు?" అని అడిగాను.

"నెలరోజుల్లో"

"అటువంటి అవకాశం కోసమే నేను కనిపెట్టుకుని ఉన్నాను."

"కారులో వెడతానంటున్నారు ఆయన. నన్ను కూడా వెంటరమ్మంటున్నారు. నేను వెళ్ళకపోతే, ఆయన చాలాగొడవ చేస్తారు."

"పెద్ద ఆర్భాటమేమీ చేయవద్దు. [illegible] ఏ సమావేశానికి వెళ్ళేదీ నాకు అవసరం [illegible] చంద్రశేఖర్ తో నీవు వెళ్ళవద్దు. ఆయన ఒంటరిగా వెళ్ళటమే నాకు కావలసింది. నీవు రావాలని మర్యాదకోసం అంటున్నాడు. నీవు వెంటలేకపోతే, ఆయన పని ఆగిపోదు. నీవు ఆ సమావేశానికి వెళ్ళటం ఇష్టంలేనట్లు

★ అపరబుద్ధి ★

మాట్లాడాలి. ఆయన వెంటనే సమాధాన పడతాడు. తెలిసిందా?"

"ఈ సలహా బాగుంది."

"ఇది నీకు బాగున్నటుగా బయటికి కనబడ నివ్వకూడదు. ఎందుకో తర్వాత నీకే తెలుస్తుంది."

*　　*　　*

అప్రయత్నంగా ఈ అవకాశం దొరికింది. మోటారుకారు మీద ప్రయాణం వద్దని కోమలం చంద్రశేఖర్‌కి గట్టిగా చెప్పింది. ఒకవారం రోజులు అతడితో వాదించింది. కాని ఎంత వాదించినా మోటారుకారు ప్రయాణం విషయమై ఆమె అతని అభిప్రాయం మార్చలేకపోయింది.

అనేక చోట్లకి టీ పార్టీలకి, విందులకీ, సభలకి, ఉపన్యాసాలకి వెళ్ళాలసి వస్తుందనీ, అందుకు కారువుండటం అవసరమనీ చంద్రశేఖర్ ఎదురు వాదించాడు.

"అద్దెకారులలో వెళ్లటం ఆయనకు ఇష్టం లేదట. రైలు ప్రయాణం విసుగు కలిగిస్తుందంటున్నారు" అంది, కోమలం మరో రోజున మా ఇంటికి వచ్చి.

"నీవు గట్టిగా ఆయనికి రైలుప్రయాణమే మంచిదని చెప్పాలి," అన్నాను.

"నేను చెప్పాను. నామాట వినిపించుకోవటం లేదు ఆయన. ఎంతగానో చెప్పి చూశాను. ఎందుకో కమలాక్షి కూడా నాతో పూర్వంలా మాట్లాడలేదు. నా స్వార్థంకోసం కారును ఇక్కడే వుంచి వెళ్లమంటున్నాననుకుంటూంది. అయినా మళ్ళీ ప్రయత్నించి చూస్తాను."

"అనుమానానికి అవకాశం లేకుండా చేయాలి."

"సరే. ఆయన ప్రయాణానికి ఒక రోజు ముందుగానే కారు ఇంజన్ను పాడుచేస్తాను. అప్పుడు దాన్ని వర్క్‌షాపుకు పంపవలసి వస్తుంది. ఆయన రైలులో ప్రయాణం చేయటం తప్పనిసరి అవుతుంది," అంది కోమలం.

"అలాంటి పనివద్దు. కారు మీద ప్రయాణం చేయవద్దని నీవు మొదటే చంద్రశేఖర్‌కి చెప్పావు. ఇప్పుడు నీవు ఈ పనిచేస్తే, అది అనుమానానికి కారణమౌతుంది...కమలాక్షి ఇకముందు నీతో అసలు మాట్లాడటమే మానేస్తుంది. మన పనికి కారు వుండటం అవసరం."

"మనకు కారు అంత అవసరమా?"

"చాలా ముఖ్యం మనకు."

"ఇప్పటికీ నాకు అర్థం కావటం లేదు. మనం ఏం చేస్తామో నాకు తెలియటం లేదు."

"తెలుస్తుందిలే. సమయం వచ్చేటప్పటికి నీకు అన్నీ వాటంతట అవే తెలుస్తవి. మనకు కారు వుండాలి. ఆ కారు మంచిస్థితిలోనే వుండాలి. మొత్తం రెండు కార్లు కావాలి. నా కారు, మీది రెండూ మనకు అవసరం. నీవు ఏ పనిచేసినా, మీ కారును మాత్రం పాడుచేయవద్దు,"

"అయితే రైలు ప్రయాణం విషయం మన ఆలోచన మానేద్దామా?"

"నీవు జాగ్రత్తగా వినాలి. ప్రయాణం రైలులో కాకపోతే, ఆపనే మనం చేయవద్దు చెయ్యలేముకూడా."

"నాకు మీ మాటలు అర్థంకావటం లేదు. ఆశ్చర్యంగా వుంది."

"ఆశ్చర్యపడటం మానేయాలి. జరిగే విషయాలు శ్రద్ధగా పరిశీలించాలి."

*　　*　　*

రెండు మూడు రోజులు గడిచిపోయినవి. మా అదృష్టం పండింది. ఒకనాటి మధ్యాహ్నం తలవనితలంపుగా కోమలం నా ఆఫీసు గదిలోకి వచ్చింది.

"ఇక్కడ ఎవరన్నా ఉన్నారా?" అంది.

"దనికి? ఏదైనా ముఖ్యమైన సంగతి వుందా? ఏం జరిగింది?"

"ఔను. చాలా ముఖ్యం. నేను ఇంటికి వెళుతున్నాను. అరగంటలో మీరు రావాలి."

శేఖర్ బంగళాకు వెళ్ళాను. లోపలికి వెళ్ళిన రెండు నిమిషాలకు టెలిఫోన్ గంట మోగింది. ఫోన్‌లో విన్న విషయం ఆమె నాకు చెప్పింది.

"ఆయన సభలకి వెళ్ళటం మానేశారట. కాలికి దెబ్బ తగిలి ఎముక విరిగిందట," అంది కోమలం.

"ఏమిటి?" అన్నాను ఆశ్చర్యంతో.

"ఆ సంఘటన ఎలా జరిగిందో నాకు సరిగా తెలియదు. కాలువ పక్కనే కుక్కను గొలుసుతో పుచ్చుకొని రోడ్డు మీద నిలుచున్నారట. పక్కఇంటి వాళ్ళ కుక్క ఒక పందికొక్కును తరుముకుంటూ మీదకి పరుగెత్తుకుని వచ్చిందట. ఆయన కాలుజారి కాలువలో పడ్డారట. ఇప్పుడు ఆసుపత్రిలో వున్నారు. కమలాక్షి అక్కడే

(56-వ పేజీ చూడండి)

వనితా లోకం

నేను అబద్ధం చెప్పాను

బొప్పన గంగాభవాని

నేను ఒకసారి ఆంధ్రప్రదేశ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు బస్సులో ప్రయాణం చేశాను. ఆ రోజున కండక్టరు మావారికి పరిచయస్థుడు. మా అక్కగారి అమ్మాయికి ౮ సంవత్సరాలు వుంటాయి. "ఎవరయినా అడిగితే 2½ సంవత్సరాలు వుంటవి-అని చెప్పండి" అన్నాడు కండక్టరు అరటిక్కట్టు కోస్తూ, అర్ధరూపాయి మిగిలిందికదా అనే సంతోషంతో "సరే" అన్నాను.

ఇంటికి వెళ్ళినతర్వాత ఎందుకీ పని చేశానా అని నామీద నాకే చిరాకువేసింది. నాలో ఈ బలహీనత ఎందుకుకల్గింది? కారణమేమిటి? అని మథనపడ్డాను. నాకు చివరికి కల్గిన అభిప్రాయమేమిటంటే - నాకు యుక్తవయస్సు వచ్చేవరకు దేశాన్ని ఎలా ప్రేమించాలి, అసలుదానికి అర్థంఏమిటి, మనపౌరవిధులేమిటి అన్న విషయాలు నాకు తెలియచెప్పిన, అమ్మలేదు, పాఠశాలా లేదు. మొత్తానికి ఆరోజునుండి అటువంటి పనులిక చేయరాదని గట్టిగా నిశ్చయించుకున్నాను. ఇలా అనుకుంటే వెంటనే చేయలేకపోయినా (ఉగ్గుపాలతో నేర్చుకోలేదు కాబట్టి) ముందైనా చేయగలను అని నమ్మకం ఉంది.

పిల్లలు వీధులలో మలవిసర్జన చేస్తే శుభ్రం చేయవలసిన అవుసరం తప్పిందికదా అని సంతోషించే తల్లులున్న మనదేశం -

అజ్ఞానంతో బాలురు రైళ్ళసీట్ల కవరులు చించుకొస్తే సంచులు కట్టించుకోవచ్చు కదా అని సంతోషించే పెద్దలున్న మనదేశం-

పిల్లలు మునిసిపాలిటీ వీధిలాంతర్లు దొంగిలించుకొస్తే మంచికాంతి వస్తుందని తమ స్వంత చేతులతో నే నూనెపోసి వెలిగించే స్త్రీలున్న మనదేశం—

ఇటువంటి పెద్దలున్న మనదేశాన్ని ఎన్ని ప్రణాళికలు మార్చగలవు?

తల్లివడిలో పెరిగే పసిపాపలకు దేశభక్తిని బోధించేవారు ఎంతమంది? విద్యావిహీనుల సంగతి అలా ఉంచండి. విద్యావంతులైన తల్లులలో, ఇటువంటి మంచి చెష్టలు పిల్లలకు చెప్పేవా రెంతమంది?

అందుకే "మన అమ్మలు, అమ్మమ్మలు నాయనమ్మలదగ్గర పిల్లలను పెరుగనిచ్చేకంటే పెంటపోగులలో పారేస్తే చాలా బాగుపడుతారు." అని బిడ్డలశిక్షణ అన్న గ్రంథంలో చలంగారు వ్రాశారు.

మన విద్యార్థులలో అరాజకం పెరుగుతుందని రాజకీయ నాయకులు గోలపెడ్తున్నారు. అది విద్యార్థుల తప్పు కాదని నా ఉద్దేశం. ఆ తప్పు వాళ్ళ తల్లిదండ్రులది. ముఖ్యంగా పిల్లలు చనువుగావుండే తల్లులది. ఎందుకనంటే-రష్యా, చైనా మొదలగు దేశాలలో పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొనే పాఠశాలలు వుంటాయి. అందుకని పిల్లలు క్రమశిక్షణలో పెరుగుతారు. మనదేశం ఆర్థికంగా అటువంటిస్థితికి రాలేదు. అందుకని తల్లులే ఆ భారాన్ని వహించి దేశంయొక్క భవిష్యత్తుకోసం పిల్లలను కట్టుబాట్లలో పెంచాలి. స్త్రీలలో చైతన్యం కల్గిననాడే దేశం ముందుకుపోతుంది. పిండివంటలు తయారుచేయటానికి పుస్తకాలు చదివి, మథనపడే కాలంలో సగమైనా మన బిడ్డలకోసం కృషిచేస్తే, నెహ్రూజీ కలలు సగమైనా నెరవేర్చగలము. మన నాయకులు ఎన్ని ప్రణాళికలు వేసినా మనలో చైతన్యం లేనిదే పూర్తిఫలితాలు లాభించవు.

కన్నవారికి కడుపునొప్పివస్తే కంటినీరు పెట్టుకునే తల్లులు కాదు కావలసింది; క్రమశిక్షణలో పిల్లలను పెంచటానికి తమ శాయశక్తులూధార పోసేతల్లులు కావాలి ఈనాడు దేశానికి.

* * *

ఆత్మ విమర్శ



చంద్రభారతి

(నిడుమోలు)

ప్రసూన, కుమారి, శేఖి, లక్ష్మి నా స్నేహితురాండ్రు, దగ్గర బంధువులు కూడాను బావకూతురు, అన్నయ్యకూతురు, బాబాయిగారి అమ్మాయి, పెదనాన్న మనుమరాలూనూ సాయంత్రం 'రింగ్', మధ్యాహ్నము 'ఇండోర్ గేమ్సు' మొదలైన చర్య అల్లిక, పత్రికాపఠనం, చీరలముచ్చట్లు, లోకాభిరామాయణంకూడా మా టైంటేబిల్ లో చేర్చవచ్చు

ఎంత బంధుత్వమున్నా, స్నేహమున్నా ఉన్నమాట చెప్పుకోవాలంటే ప్రస్తుత స్త్రీసమాజములో అమాయకత్వం, అజ్ఞానం అల్పత్వం, చిలిపితనం గోచరిస్తుంది స్త్రీ సహజంగా ఎంత త్వరగా స్నేహాన్ని ఆర్జిస్తుందో అంత త్వరగా విముఖురాలౌతుంది

నలుగురు స్త్రీలుకూడినపుడు ఇతరులను గూర్చి ఆడిపోసుకోవడం అసాధారణం కాదు వారు విడిపోయినపుడుకూడా ఒకరిని గురించి ఒకరు వేరొకచోట కల్లిబొల్లి కబుర్లు చెప్పడంగూడా సామాన్యమే. వళ్లు తెలియకుండా గంతులువేస్తూ బిగ్గరగా మాట్లాడడం, దారినిపోయేవారినిచూసి అవహేళనగా నవ్వడంకూడా కొందరు యువతులు చేయుపని ఎంతత్వరగా ఈ పనులకు స్వస్తిచెబితే అంతమంచిది

మా స్నేహితురాండ్ర విషయం ముచ్చటిస్తాను. మా మనసులు, ఆమాటకొస్తే ఎవరి మనసులూ పరమ విషపూరితాలు కావు ఏవో పరిస్థితుల ప్రాబల్యంవల్లను, అమాయకత్వంవల్లనూ, అజ్ఞానంవల్లనూ, తల్లిదండ్రుల ప్రవర్తన వారు, పాటించిన క్రమశిక్షణను బట్టి కొన్ని పొరపాట్లు చేస్తూంటాం దాన్ని తెలిసికోవడంద్వారా, ఇతరులకు తెలియచెప్పడంద్వారా మనని మనం మరమ్మత్ చేసుకోవచ్చును

మంచి సవరము ఒకటి కట్టించుకుందామని రోజూ ఊడిన నా తలవెంట్రుకలనే పెద్దవి ఒకరట్టగా ఏరి కూర్చుతున్నాను అప్పుడప్పుడూ వాళ్లుకూడ సహాయపడేవారు

ప్రసూన ఒకరోజున నా వద్దకు వచ్చింది "అక్కా" నీ సవరము పూర్తయిందా! చూశావా! నేను వెళ్ళేటప్పటికి లక్ష్మివెంట్రుకలు కూర్చుతోంది ఒక సవరము పూర్తయింది. రెండవది మొదలట. నేను ఏమోయ్ ఎప్పుడూ చెప్పలేదే ఏమిటి? అనడిగాను కావోయ్ మొన్న మా అక్క బెజవాడ నుండి తీసుకువచ్చినది అని చెప్పినది "అంది ప్రసూన వచ్చీ రాగానే

రెండవరోజున కుమారి వచ్చినది. "ప్రసూనఅలా నవ్వుతుందేమిటే, కివెలినవ్వు. మా అమ్మవాళ్లుకూడ అనుకుంటున్నారు, ఆ పిల్ల వట్టి వెకిలిపిల్ల అని దారిలో ఎవరిని చూసినా నవ్వుతుందటగా!" అంది అది గొప్పగా

ఇంకోరోజున శేఖి వచ్చింది.

"అక్కా! నేను అల్లిక మొదలెట్టానని లక్ష్మి చెప్పిందిటగా! అంతా వట్టిఅబద్ధం లక్ష్మి అల్లుతుండగా నేను ఒకరోజు చూశాను నన్ను చూసి చేయి చాటున పెట్టబోయింది నేను ఏమిటే అది అని గట్టిగా అడిగాను ఎవరికీ చెప్పవద్దంది గడ్డితిని సంపాదిస్తారు అక్కా! వాళ్ళు అందుకే మొన్న ఫ్యాక్టరీలో పదివేలు నష్టం" అంది కళ్లు తిప్పుకుంటూ

తరువాత లక్ష్మి ఒకరోజున వచ్చింది

"కుమారికి అంత ఆరా ఏమిటే ఇంట్లోకి వస్తే ప్రతివస్తువునీ పరిశీలిస్తుంది అప్పుడే పుట్టిన పసిపాపలా అక్కా! మొన్న పండుగనాడు అది కట్టుకున్న పట్టుచీర ఏమీ బాగాలేదే మా అమ్మమ్మకూడ ఆ మాటే అంది ఏంచీర బోడిచీర అని! దానికి కుచ్చిళ్లుదోపడం చేతకాదు పవిట అలావేస్తుందేమిటి మరీ బడాయి" అంది తాను బడాయిపోతూ

ఇలా ఒంటరిగా "ఒక్కొక్కరే కలసినప్పుడు ఇన్నిరకాలుగా మాట్లాడుతుంటారు ఇది మొదటినెలా, రెండు నెలలు మాత్రమేలెండి నేను ఈపద్ధతి మంచిది కాదని, ఒంటరిగా వేరొకరు లేనప్పుడు వారి విషయాన్ని ప్రస్తావించకూడదని తప్పొప్పులు మొదటనే ఖండించాలని చెప్పేను మొదట అర్థం చేసికోలేకపోయినా నామీద చిరాకుపడినా ఆరు నెలలు తిరిగేసరికి వారు పూర్తిగా మారిపోయారు మేమిప్పుడు నిజంగా స్నేహితురాండ్రం (చుట్టరికం కన్న స్నేహం మాకు ముఖ్యం) మనస్పర్థలు, మురాలు, అసూయా ద్వేషాలు, మాలో లేవు ఇతరస్త్రీలలోని లోపాలనుచూసి ఎగతాళి చేయం వారి కష్టాలను సానుభూతితో అర్థం చేసుకుంటాం చెప్పుడు మాటలను వినేముందు, యితరులను విమర్శించేముందు, లోకో భిన్నరుచిః అన్న సామెత గుర్తుకు తెచ్చుకోవడం మంచిది ★

కమలం(కా) పరం

ఆఫీసునుండి అప్పుడే వచ్చిన కమల, అప్పలమ్మ ప్రొద్దున వేసిన అంట్లు తోమలేదని గ్రహించి అక్కడేవున్న చెంబుని బోర్లా వేసింది.

ఇంతలో ఇంటిముందు శంఖనాదం వినేటప్పటికి విసుక్కుంటూ—ఫో, ఫో, చెయ్యి ఖాళీలేదు, వేళాపాళా లేదు. అందితలుపు తీయడమే తడవుగా కానీ ఆమాటలేం లెక్కచేయకుండా ఆ జంగందేవర లోపలికి తోసుకువచ్చాడు. కమలకు ఏంచెయ్యాలో తోచటం లేదు. నోటివెంబడి మాటరావడం లేదు. కాలేజీలో డజనుమంది విద్యార్థులకు బుద్ధి చెప్పిన కాలేజీ ఛాంపియన్ కమల—బయటకు ఫో అన్న మాట మాత్రం అనగలిగింది వణుకుతున్న కంఠంతో.

జంగం దేవర, ఒక్కసారి మీసం దువ్వి భయంకరంగా మళ్ళీ శంఖం వూదాడు.

కమలకు వాళ్ళనాయనమ్మ గుర్తొచ్చింది. వెంటనే లోపలికివెళ్ళి, ఒకచేత్తో మండుతున్న కొరివి, రెండోచేత్తో చీపురుకట్ట, తెచ్చి రెంటిని చూపిస్తూ ఫోతావా, పోవా అంది. జంగందేవర జోలెలోంచి కెమెరా తీసి ఫ్లాష్‌తో సహా క్లిక్ మనిపించాడు.

అలసించిన ఆశాభంగం, అనుకుని రెంటినీ విసిరింది కమల జంగందేవర మీదకు.

కాని జంగందేవర తప్పుకున్నాడు.

అప్పలమ్మా అని కేకేసింది కమల అప్పలమ్మలేదని మరిచిపోయి.

ఒక్కసారి గట్టిగా శంఖం వూది, మీసాలు, తలపాగా తీసి. "భద్రకాళీ ప్రసన్న" అన్నాడా వ్యక్తి.

ఛీ. ఛీ. ఏం మనుషులు మళ్ళీ చదివేవి పెద్ద చదువులైనా కొస్తవినా మానవత్వంచూపరు అంటూ లోపలికి వెళ్ళిపోయింది కమల.

కమలకు కోపం వచ్చిందనే నిదర్శనంగా దారిలో భీమడోలు ఆవుమూతి కూజా పగిలింది.

పరమేశం హతాశుడై పోయాడు.

తనకు బహుమతిగా వచ్చిన కప్పును ఒక చేత్తో పట్టుకుని రెండోచేత్తో కమల కొంగు పట్టుకుని కమ్మా.. కమలా...కమలాదేవి గారూ అంటూ ఆమెవెంబడి పడ్డాడు.

కమల సీరియస్‌గా ఒక్క చూపు చూసి బాత్‌రూము లోపలికి వెళ్ళిపోయింది.

హో చంద్ర...మతిపోయిందిఅని అక్కడే ఉన్న పీటమీద చతికిలపడ్డాడు పరమేశం.

కమల ధుమధుమలాడుతూ వచ్చి, జూదంలో ఓడిపోయిన ధర్మరాజు పోజు పెట్టిన పరమేశాన్ని చూచి పొయ్యిలో నీళ్లు పోసింది. పరమేశం చలించలేదు.

ఆమె కొంతసేపటికి బయటకు వెళ్ళిపోయింది.

పరమేశం లేచి తన గదిలోకి వెళ్ళి బటలు తీసేసి పంచె కట్టుకుని, లాల్చీ వేసుకుని, తలుపుకు తాళంవేసి, హోటలులో భోజనంచేసి సినిమాకు వెళ్ళి రాత్రి 10 గంటలకు వచ్చి పడుకున్నాడు.

మరుచటిరోజు ప్రొద్దున పది గంటలకు భోజనాలవద్ద కమలమ్మ కసికొద్దీ కాకరకాయ కూర వండినా పరమేశం మాట్లాడకుండా భోజనం సాగించాడు. అతను చెయి కడుక్కునేసరికి కమల ఆఫీసుకు వెళ్ళిపోయింది....

కోకా శ్రీ సుధ

(హైదరాబాదు)

...సాయంత్రం పరమేశం కాలేజీనుంచి వచ్చేసరికి కమల బెజవాడ వెళ్ళిపోయింది.

వారంరోజులు పోయిన తర్వాత బెజవాడలో నున్న కమల, పరమేశం వ్రాసిన "భార్య లేకుండా వుంటే ఆనందం" అన్న వ్యాసం ఒక వారపత్రికలో చదివి తన ప్రయాణం ఇంకోవారం వాయిదా వేసింది. ఆ మరుచటి రోజు పరమేశం దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

కమలా, ఇక్కడ భూకంపం, తుఫాను, అన్నీ ఒక్కసారే వచ్చాయా అనిపిస్తున్నది. మా మేనత్తట! ఇద్దరు కుమార్తెలు ముగ్గురు అబ్బాయిలు, ఒక పనివాడు, ఒక బొచ్చుకుక్క, ఒకకోతి (ఆవిడగారి చిన్నమ్మాయి) ఆవిడ భర్త, పిఠాపురంనుంచి ఇక్కడ దిగుమతి అయ్యారు. వారు రావడంవల్ల పరలోకానికి వెళ్ళిన వస్తువులు.

(1) మన రేడియో (వాళ్ళ పెద్దబ్బాయి ధర్మం) (2) నీ వానిటీబాగ్ (వాళ్ళ పెద్దమ్మాయిధర్మం) (3) నీ టాయిలెట్ సామాను (మిగతా వాళ్ళ ధర్మం) (4) అద్దం (కోతి ఉరఫ్ చిన్నమ్మాయి ధర్మం) (5) నీ చెప్పులు రెండు జతలు, నా చెప్పులు మూడు జతలు (బొచ్చుకుక్కగారి ధర్మం) (6) బియ్యం, చింతపండు, ఉప్పు పప్పువగయిరా॥ (అందరి ధర్మం) (7) నా సైకిల్‌స్టాండు? పు (ఇది ఎవరి ధర్మమో కనిపెట్టడానికి ఒక డిటెక్టివ్‌ని నియమించుదామనుకుంటున్నా) (8) సేవింగ్స్ బ్యాంకి ఎకౌంటు (ఆవిడ భర్తగారి ధర్మం) ఇవన్నీ నాతో చెప్పకుండా పరలోకానికి ప్రయాణం కట్టాయి.

వీళ్ళు కనీసం రెండు నెలలైనా ఉంటారని నా అనుమానం. నీ అభిప్రాయంకూడా తెలియచెయ్యి.

ఉంటా

నీ పరం.

తా॥ కలం॥ వాళ్ల పనివాడు అప్పలమ్మను ఏదో అన్నాడంట. అది అట్లకాడ తిరగేసింది.

ఈ ఉత్తరం చదవగానే కమలమ్మ కంగారుపడి పుట్టింట రెండు పచ్చకాగితాలు అడిగి పుచ్చుకుని, టెలిగ్రాం కొట్టి—అల వైకుంఠపురిలో...అన్నట్లుగా విశాఖపట్టణములో వాలింది.

వెంకట్రావు స్టేషనుకు రాలేదు. ఆవిడ తిన్నగా ఇంటికొచ్చి చూచేసరికి ఇంటి తలుపులు బార్లా తీసివున్నాయి.


పరమేశం పేకాడుతున్నాడు కిశోర్ వెంకట్రావులతో కలిసి. కమల లోపలకు రావడం చూచి వాళ్ళిద్దరూ జారుకున్నారు.

పరమేశం, నేను గెలిచానురోయ్, అని గట్టిగా కేక వేయబోయేసరికి కమల లోపలికి వచ్చింది.

కమలవేపు చూసి చిరునవ్వు నవ్వాడు అర్జునోలా పరమేశం.

కమల చూపుచూసి నవ్వు మానేశాడు పరమేశం.

హో చంద్రమతీ అన్నాడు పరమేశం; ఆ తరవాత. ★


పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్‌ను వాడే
ఆమె వెంట కనపడుటకు
అతను గర్వపడతాడు
జిడ్డులేని పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ మీ చర్మ
మునకు రక్షణనిచ్చి. మీ ముఖముమీది చిన్న చిన్న
లోపములను, కళంకములను కనపడకుండా చేయును.
పౌడరు అద్దుకొనే ముందు దీనిని రాచుకుంటే,
పౌడరు గంటల తరబడి అంటుకొని ఉంటుంది!
PONDS
POND'S
vanishing
cream
ఉచిత పుస్తకము
Lovelier with Pond's అనే సౌందర్య
మును గురించిన మా యింగ్లీషు పుస్తకము
కావాలని యీ ఎడ్రసుకు వ్రాయండి: పి.ఓ.
బాక్స్ నెం. 1612, బొంబాయి 1.

ఉసిరికాయతో ఊరగాయ

యు. సత్యబాలాదేవి
(కడప)

ప్రస్తుతము *ఉసిరికాయలు ఎక్కువదొరికే కాలము. అవి శరీరమునకు ఎక్కువ పుష్టి, ఆరోగ్యము చేకూర్చగలవి. గనుక విరివిగా నిలువజేసి భుజించగల విధానములు కొన్ని క్లుప్తముగా వ్రాయుచున్నాను. ప్రతి వస్తువు తయారుచేయుటకుముందు పాత్రలు, గరిటెలు తడిలేకుండా చూచుకొనడము, ప్రతివస్తువు ఎండించి, ఏరి - శుభ్రంగా తయారు చేసుకొనడము. నిలువచేసుకునే జాడీలు, సీసాలు తేమ వాసన లేకుండా శుభ్రపరచి ఎండించి ఉంచడం అవసరము.

ఉసిరికాయలతో ఏది చేయవలెనన్నా మంచి పండిన కాయ అనగా ముదిరిన తరువాత చక్కని రోజారంగు ఒకవైపు వస్తుంది. అలాంటి కాయలు తెచ్చి కడిగి మంచి ఎండలో రెండురోజులు ఎండబెట్టాలి— తెల్లగా అవుతవి తీసి ఒకగంపలో పెట్టాలి.

ఉసిరికాయ టొమాటో జామ్

కావలసిన సామాన్లు

½ వీశె టొమాటోలు.
150 ఉసిరికాయలు.
1 వీశె చక్కెర.

ఈరోజుల్లోనే టొమాటోలు బాగా దొరుకుతవి. ఎండబెట్టిన ఉసిరికాయలు ఒలిచిగాని రోట్లో నెమ్మదిగా దంచిగాని 100 కాయలు గింజలు తీసివేసి మెత్తగా దంచి ముద్దచేసుకోవాలి. ½ వీశె టొమాటోలు ఎర్రనివి, బాగాపిసికి చిన్నగ్లాసునీళ్లు కలిపి, జల్లెడలో వేసి గింజలు తొక్కలు జల్లించి తీసి రసం జాగ్రత్తచేయాలి. ఉసిరికముద్దకూడ ½ శేరు నీళ్లుపోసి కలిపి జల్లెడతో జల్లించి తీసినరసం వెడల్పాటి కళాయి గిన్నెలోగాని పింగాణి ఎనామిల్ బేసిన్‌లోగాని స్టెయిన్‌లెస్ స్టీల్ గిన్నెలోగాని పోసి కుంపటిమీద పెట్టాలి. అనగా గిన్నె చిలుముఊరకుండా ఉండాలి. పై ఉసిరికరసంలో మరొక 50 ఉసిరికాయలు - కాయలుగానే నాలుగు వేపులా నాలుగువాళ్లు చాకుతో పెట్టి వేయాలి. కాయలూ రసం కొంచెం ఉడకగానే— టొమాటోరసం, 1 వీశె చక్కెరపోసి కలిపి ఉడకనివ్వాలి. అపుడపుడు కలుపుతూండాలి. బాగా ఉడికి చక్కని రంగువచ్చి వ్రేళ్లతో తాకితే చక్కెర అరఅంగుళం తీగవచ్చే పాకంరాగానే దించి పూర్తిగా చల్లారనిచ్చి సీసాలలో జాగ్రత్త చేసుకోవాలి. ఏడాది నిలువవుంటుంది.

* * *

ఈజామ్‌లో టొమాటోరసం వేయకండా నాలుగు నిమ్మకాయలు ఉడికించి పిసికి రసం జల్లించి పోయవచ్చును. ఎవరెవరి ఇష్టమయిన రుచిననుసరించి సువాసనలు, రంగులు, బాదం, పిస్తా, అక్రోటు, జీడిపప్పులు వేసుకోవచ్చును. కొద్దిగా అల్లంరసం వేసుకోవచ్చును. చూడ్డానికి అందముగా ఉంటుంది. ఆరోగ్యానికి మంచిది. రుచిగా ఉంటుంది.

ఉసిరికాయ మెంతికాయ

కావలసిన సామాన్లు

1 మానిక ఉసిరికాయలు.
1½ గిద్ద ఉప్పు.
1½ గిద్ద కారం.
¾ గిద్ద మెంతిపొడి.
1 స్పూను పసుపు.
1 చిటికెడు యింగువ.
¼ వీశె నువ్వుల నూనె.
4 తులాలు ఎండుమిరపకాయలు.
1 తులం ఆవాలు.
1/8 తులం మెంతులు.
2 తులాలు ఒలిచిన చిన్నవుల్లిరేకలు
1 తులం కరివేపాకు. (ఇష్టంవుంటే)

ఎండించిన ఉసిరికాయలు - కొలతమానిక తీసికొని- ¼ వీశె మంచినువ్వులనూనె పొయ్యిమీద పెట్టి మరగనిచ్చి ఉసిరికాయలు కొద్దికొద్దిగా పోస్తూ మెత్తబడిందాకా వేయించి పళ్లెంలోకి తీసికోవాలి. ఆరిన తరువాత కాయలు పళ్లు విడదీసి లోపలిగింజ తీసివేయాలి. ఉసిరిముక్కలలో మెత్తగా దంచిన ఉప్పు 1½ గిద్ద, వేయించి మెత్తగా విసిరిన మెంతిపిండి-¾ గిద్ద, 1 స్పూన్ పసుపు 1½ గిద్ద కారము-వేసి కలపాలి.

బాణలిలో మిగిలిన నూనెలో 4 తులాలు ఎండుమిరపకాయలు, టేబిల్‌స్పూన్ ఆవాలు అరటీస్పూన్ మెంతులు-ఒలిచిన చిన్నవుల్లిరేకలు-కరేపాకు-యిష్టమయితే చిటికెడు-యింగువపొడి వేసి చక్కగా తాలింపు చేసి దించి, అందులో ఉసిరిముద్ద వేసి చక్కగా కలిపి జాడీలో పెట్టాలి. ఏడాది ఉంటుంది.

ఉసిరికాయ ఆవకాయ

అన్నీ మెంతికాయకు వేసే కొలతలే. మెంతిపిండికిబదులు 1 గిద్ద ఆవపిండి వేసుకోవాలి. మెంతికాయకువలె కాయలు వేయించుకుని. గింజతీయకుండ కాయ పాళంగానే 1½ గిద్ద వుప్పుపొడి. 1½ గిద్ద కారంపొడి-1 గిద్ద సన్నావాలు దంచినపొడి స్పూన్ పసుపు-కలిపి-మెంతికాయకువలెనే తాలింపుపెట్టి నాలుగురోజులు ఊరనిచ్చి కలిపి-వాడుకోవాలి.

ఉసిరికాయల్లోని పులుపునుబట్టి-రసాన్నిబట్టి ఒక్కొక్కసారి కొంచెం ఉప్పుకారం తగ్గించవలసి వస్తుంది. గనుక ముందు ఉప్పుకారం-ఒక్కొక్క గిద్దమాత్రం కలిపి-తినిచూచి తక్కినది కలపడం మంచిది.

ఉసిరికాయ పచ్చడి

6 మానికలు. ఉసిరికాయలు
½ శేరు దంచిన ఉప్పు
చారెడు పసుపు
1 గిద్ద మెంతిపొడి

ఎండబోసిన ఉసిరికాయలు దంచిగాని ఒలిచిగాని గింజలు తీసివేసి-ఉసిరిక ముక్కలలో (6 మానికలు ఉసిరికాయలైతే) ½ శేరు దంచిన ఉప్పుపొడి-చారెడుపసుపు-1 గిద్ద వేయించి విసిరిన మెంతిపొడి వేసి ముద్దగా దంచి జాడీలో పెట్టుకోవాలి. పైన ఒక తెల్లనిబట్టను శుభ్రంగా ఉతికి ఎండబెట్టిన దానిని పరిస్తే-(అనగా జాడీలో పచ్చడిమీద పరచాలి.) చాలకాలం పచ్చడి నల్లబడదు.

కావలసినప్పుడు-కొంచెం పచ్చడి తీసుకొని ఎండుమిరపకాయలు నేతిలోవేయించి నూరి పచ్చడివేసి నూరుకుని-కొంచెంజీలకర్ర చిన్నవుల్లి వేసి నూరి తీసి వాడుకోవచ్చును. రుచికొరకు నిమ్మకాయరసం కొంచెం వేసుకోవచ్చును. కావలెనంటె తాలింపు చేసుకోవచ్చును. రుచికి మితంలేదుగదా! పచ్చళ్లు పెట్టేప్పుడు తీసేప్పుడు - రోలు-రోకళ్లు చేతులు-గరిటెలు తేమలేకుండా చూడాలి.

★

* ఉసిరికాయ లనగా ఊరగాయలువేసే పెద్దఉసిరికాయలు. రాచఉసిరి పనికిరాదు.

ఉత్తరాలు:

మంచికి చెప్పినా...

చాలామంది స్త్రీలు మనం మంచికి చెప్పినా అపార్థం తీసుకుంటారు. చదువు, సంస్కారం లేని వాళ్ళయితే, జాలిపడవలసి వస్తుంది. కాని చదువు, అనుభవంగలవాళ్ళే ఇలా అర్థాలు తీసుకుంటే, వాళ్ళతో మాట్లాడడానికికూడా భయంగా వుంటుంది. ఇలాంటివి నేనెన్నోసార్లు మాటపడ్డాను.

మొన్నీమధ్య మాయింటికి ఒకావిడ వచ్చింది. ఆవిడకి పదినెలల అబ్బాయి." అబ్బాయి చాలా పీలగా ఉన్నాడు. కడుపు ఎత్తుగా, కాళ్లు, చేతులు సన్నగా ఉన్నాయి. ఏవరా? అని అడుగుతే, అబ్బే, లేదండీ పాలు త్రాగి జీర్ణించుకోడు అంది. మాకు ఆశ్చర్యం వేసింది. పదినెలలఅబ్బాయి. పాలు హారాయించుకోలేక పోతున్నాడేమిటని.

"మీయింట కాసినిపాలు ఉన్నాయా?" అని అడిగిందిఆవిడ. ఉన్నాయి అన్నాను. ఆమె ఎంత పడుతుందో నాకేం తెలుసు. అందుకే గిన్నెతోపాలు ఉంచాను. ఆమె ఒకగ్లాసునిండా పాలుపోసి, చక్కెరకలిపి సీసాలోపోసి, పట్టడం మొదలుపెట్టింది.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఉదయం పాలవాడు ఇంటికి ఆవుతీసుకొచ్చి, పాలు పితికాడు. కంటికి చిక్కగా కనిపిస్తున్నాయి పాలు. ఆమెచూడకుండా పట్టడం నేను గుడ్లప్పగిస్తూ చూస్తున్నా. చూడక ఏంచెయ్యను. నేను ఏమన్నా అన్నా ఆమె అపార్థం తీసుకుంటే, ఈ మారు మా అమ్మదగ్గిర చివాట్లు తినవలసివస్తుందని గమ్మని ఊరుకున్నా!

ఇలాగే, నేను పాలుతెచ్చి ఇవ్వడం, ఆమె పట్టడం, అబ్బాయి పగలసమానం వాంతులుచేయడం జరుగుతూవచ్చింది. ఒకరోజు ఆమె పాలుకలపడం మా అమ్మకంటబడింది. మాఅమ్మ ఆశ్చర్యంగా, అదేమిటమ్మా పాలల్లో నీళ్ళుకలపకుండా పడుతున్నావు. అందుకనే కాబోలు; అబ్బాయి జీర్ణించుకోవడంలేదు. సగంపాలు, సగం నీళ్ళు కలపాలమ్మాఅంది. ఏమే మాలతీ! నీవయినాచెప్పవూ? పాపం ఆమె తెలియక పడుతుంటే అంది. నేను ఊరుకున్నాను.

ఈమాటలు మాఅమ్మ అనేసరికి, ఆమె చిన్నబుచ్చుకొంది.

సరేలెండి ఏదోపనిమీద మీయింటికివస్తే మీరిలాఅంటారు అనుకోలేదు. రేపటినుంచి నేతెప్పించుకు పాలుపడతానులెండి అంది. మాఅమ్మ యీమాటలువిని నిర్ఘాంతపోయింది. కాదమ్మా నీకు తెలియదని చెప్పాను. పాలల్లో నీళ్ళుకలిపితే తేలికగా హారాయించుకుంటాడని. నీవిలా అర్థంతీసుకుంటావనుకోలేదు. కావలిస్తే ఇంకోపట్టు, నేనేమనను. ఏమేమాలతీ! అలమారిలో పాలు ఉన్నాయి ఇక్కడపెట్టు అంది. పయిటచెంగుతో నోరు మూసుకుంటూ, పాలగిన్ని ఆమె దగ్గిర ఉంచాను.

కుమారి మాలతి, ఛత్రపురం.

* * *

"ఇదీ సబబు కానిది"

శ్రీమతి కె. యస్. సువర్ణ గారు 13-2-1957 వారపత్రికలో శ్రీమతి అన్నపూర్ణా రామారావుగారిని సమర్థిస్తూ "అదే సబబు" అను శీర్షికలో హైదరాబాద్ లోని పరిస్థితులను విమర్శించారు. అందులో వారు యిప్పుడు హైదరాబాద్ లో ప్రతి వస్తువుకూ ధరలు పెరిగిపోయినై అని వ్రాస్తూ, టొమేటోలు యింతకుముందు అర్ధ అణాకు సేరు దొరికేవనియూ, యిప్పుడు పావలాకిగాని సేరుటొమేటోలు దొరకటంలేదని వ్రాశారు.

మేమూ హైదరాబాద్ లో పుట్టి పెరిగిన వాళ్ళమే. మా చిన్నతనంలో సంగతి ఏమోకాని, మాకు జ్ఞానం వచ్చినది మొదలు యీ మధ్యలో ఎప్పుడూ అర్ధ అణాకి సేరు టొమేటోలను కొనలేదు. ఎవరూ కొన్నామని చెప్పగా వినలేదు. మహా చౌకయితే రెండణాలకు సేరు వచ్చేవి. అంతకు మించి ఒక్కకానీ కూడా మాకు తెలిసినంతవరకూ ఎప్పుడూ తక్కువకాలేదు. బహుశా పొరపాటున అర్థఅణాకి పావుసేరు అని వ్రాయపోయి, సేరు అని వ్రాశారేమో! మరీ మాట్లాడుతే "ఆంధ్రప్రదేశ్" రాకముందు ఒకొక్క సమయంలో టొమేటోలు 10 అణాలు 12 అణాలు సేరు అమ్మిన రోజులు కూడా ఉన్నై.

దీనిని బట్టి శ్రీమతి స్వర్ణగారు యిక్కడికి కొత్తగా వచ్చినవారని, ఎవరో చెప్పిన మాటలను నమ్మి వ్రాశారని తెలుస్తున్నది.

"ఆంధ్రప్రదేశ్" వచ్చినప్పటినుంచీ యిక్కడ జరగని విషయాలను కూడా జరిగినట్టుగా చెప్పుకోడం కొందరికి పరిపాటైంది. అలా చేయ... ...యకాదు.

వై. హేమలత,
వి. ఇందిర.

* * *

తెగని సమస్యలు తగని గొడవలు

దద్దనాల రంగనాయకమ్మగారు చెప్పినట్లు, తాహతుగలవాళ్లు "మేము పనిమనిషి వల్ల చిక్కులు పడుతున్నామని" చెప్పుకోకూడదు, చెప్పినఆమెనీతిని ఇంకొంచెం విశదీకరించడం అవసరం. హిమాయత్ నగర్ లో శ్రీమంతులవాడలో పనిమనుషుల ఇబ్బంది తప్పితే తెలుగు నారీమణులకు అర్జంటుగా తెలియాల్సినవి లేనట్టు, ఆంధ్ర వారపత్రికలో మనికి కేటాయించిన మూడు పేజీలు వీటితో నింపటం అనవసరం.

కోటంరాజు కృష్ణవేణి, మద్రాసు.

* * *

హిందీ ఉపయోగం

మేము గుంటూరునుంచి వచ్చాము. ఇక్కడ మాపనిమనిషికి నెలకు 25 రూ॥ లు ఇచ్చి 2 పూటలాఅన్నము పెట్టాలి. మధ్యాహ్నము, టిఫిన్కూడ ఇవ్వాలి. ఎప్పుడైన ఒకరోజు ఇవ్వకపోతే ఇక ఆ పూటంతా పని సరిగాచేయదు. ప్రొద్దున 2 గం॥ లు సాయంత్రము 3 గం॥లు పనికివస్తాడు. ఇక దొంగతనమంటారా? గదుల్లో కసవు ఊడ్చునప్పుడు ఎవరోఒకరు ఉండాల్సినదే! ఎప్పుడైన ఒకరోజు ఉండకపోతే ఆరోజు ఏదో ఒకవస్తువు పోయిందన్నమాటే? అది అడిగామంటే పనిమానేస్తామని అంటారు. అందువల్ల మొండేజాగ్రత్తపడి ఎవరోఒకరు ఉంటూ ఉంటాము.

ఇక ధరలసంగతి మేము అక్టోబరులో వచ్చాము. వచ్చినప్పుడు కాలిఫ్లవర్ 1 అణా ఉంటే అదే కాలిఫ్లవర్ ఇప్పుడు 8 అణాలు ఉంది. అరటిపళ్ళు డజను 4 అణాలవుతే ఇప్పుడు 6 అణాలు ఉంది. ఇక్కడివాళ్లు హిందీలో మాట్లాడితే ఒకధర తెలుగులో మాట్లాడితే తెలీగుకదా అని రెండింతలు ధర చెప్తారు. హిందీకొంచెము వచ్చినందువల్ల ఇప్పుడు ఎంతో ఉపయోగపడుచున్నది. అన్నిటికంటె పనిమనుషులదే చాలాకష్టము. ఎవరు మా ఇంటికివచ్చినా, మేము ఎవరింటికి వెళ్లినా ముందు మాకు పనిమనుషులతో చాలా కష్టముగాఉన్నదిఅని అంటారు. అన్నపూర్ణా రామారావుగారు చెప్పినది అక్షరాలా నిజము. ఇదంతా నా స్వానుభవము మీద వ్రాస్తున్నాను.

ఆర్. సుశీలారాణి (నాంపల్లి)

* * *

ఆనాడు ఐదు; ఈనాడు ఆరే

ఎంతయినా మనం ఆంధ్రులముకదా? వాదప్రతివాదాలు లేకపోతే గొప్పేలేదు. అన్నపూర్ణ రామారావుగారు వ్రాసేదాంట్లో అంతా అతిశయోక్తేనని గట్టిగా చెప్పగలను. ఉన్నదిఉన్నట్లురాస్తే ఉలుకెక్కువ అంటున్నారు శ్రీమతి రామారావుగారు. ఉన్నది ఉన్నట్లులేదు కనుకనే ఈ జవాబులు.

మేము ఇచటకువచ్చి 16 సంవత్సరాలయినది. పనిమనిషికి అప్పుడు 5 రూపాయలు ఇచ్చేవాళ్లం, ఇప్పుడు ఆరు రూపాయలు ఇస్తున్నాం. వాకిలి ఊడ్చి నీళ్లుచల్లటం అంట్లు తోమటం, బట్టలు ఉతకటం పదిహేనురోజులకు ఒకసారి ఇల్లు కడగటం. మొదలైన పనులు చేస్తుంది, (మరచాను) రెండుపూటలా ఇల్లుఊడ్చి, మొక్కల్లో నీళ్లు పోసి వెడ్తుంది.

కొన్ని పేటలలో పనిమనుష్యులు చవుకగా దొరకవచ్చునని శ్రీమతి అన్నపూర్ణ గారు అంటున్నారు. అలాకాదు. కొంతమంది దగ్గర అంటే కలవాళ్ల దగ్గర పనిమనుష్యులు డబ్బు ఎక్కువ పుచ్చుకుంటారు. పుచ్చుకుతీరాలి కూడాను.

ఇంతకూ శ్రీమతి అన్నపూర్ణ రామారావు గారింట పనిమనిషి విషయం. ఉదయం సాయంత్రం కలసి ఆరుగంటలసేపు పనిచేసే ఒకరోజుపని అయింది, పనిమనుష్యులకు కూడా సంసారాలు ఉంటయ్‌కదా? ఒకే ఇంట్లో రోజుకు 6 గంటలు పనిచేస్తే ఇతర ఇళ్లల్లో పనిచేసేందుకు వీలుకాదు. అటువంటప్పుడు 20, రూలైనా లేకపోతే వాళ్ల జీవితాలు గడవటం ఎలా చెప్పండి. మరొక విషయం ఐదురూపాయలనుంచి పదిరూపాయలు పుచ్చుకుండే పనిమనుష్యులు సామాన్యంగా మూడు నాలుగుఇళ్లల్లో పనిచేస్తారు. ఉదయం $6\frac{1}{2}$, నుంచి $7\frac{1}{2}$, గంటలలోగా అన్ని ఇళ్లల్లోనూ సానుపు చేయాల్సి ఉంటుంది. అంతకంటె ఆలస్యంచేస్తే పాచివాకిలిచూస్తూ ఏ ఇంటివారు ఊరుకోగలరు. ఒప్పుకున్న ఇళ్లల్లో ముందు సానుపుచేసి తరువాత బొసానులూ, బట్టలూ, ఇల్లు వూడ్చటం చేస్తారు. పూటకు మూడుగంటలసేపు పనిచేస్తే మరొక ఇంట్లో పనిచెయ్యటానికి వీలుకాదు. శ్రీమతి అన్నపూర్ణగారి ఇంట్లో చిన్నపిల్లలులేరు. పైపనులు చెయ్యటానికి వేరేపనివాళ్లు ఉన్నారనీ, బట్టలు వుతుక అవసరంలేదనీ వ్రాస్తున్నారుకదా? వాళ్ల పనిమనిషి 2, 3, గంటలలో పనిచేసుకు వెడుతుందని అంటున్నారు. దీన్నిబట్టే అన్నపూర్ణ రామారావుగారింట్లో ఎంత పని ఉంటుందో ఊహించాలి.

సామాన్య గృహస్థుల ఇళ్లల్లో ఉదయం గంటన్నర సాయంత్రం గంటాపనికంటె ఉండదు. శ్రీమతి అన్నపూర్ణ గారి పనిమనిషి రెండూ, లేక మూడు గంటలలో ఏ పూటకాపూట పనిచేసి వెడుతుందంటే ఎంతపని చేస్తూ ఉండవచ్చు. ఇంతసేపూ అంట్లూ, ఇల్లు ఊడవటమేనా?

గిన్నెలు పోవటంవల్ల హైదరాబాదులో దొంగతనాలు ఎక్కువ అని వ్రాయటం, పొరపాటు, తొందరపాటు. దొంగతనాలు అన్నిచోట్లా జరుగుతూనే వుంటయ్.

కొలచల విశాలాక్షి,
హైదరాబాద్

* * *

ఏదిఫాషన్, కానిదేది.

6-2-57 ఆంధ్రపత్రికలో శ్రీమతి మంగళా కందూరు అందం, అభిరుచి అని వ్యాసంరాశారు. చదవడానికి సొంపుగానే యుంది. కాని నామటుకు అసలుపాయంటు అర్థంకాలేదు. అవిడ రైలుస్టేషను వెయిటింగు రూములో చూచినావిడని వర్ణించి "ఇన్ని సొమ్ములు పెట్టుకొన్నమనిషి ఒక పట్టుచీర కొనలేపోయినారా? అని రాశారు. చదువు, సంస్కారముకలవారు ఒకలా డ్రెస్ చేసుకొంటారు. డబ్బుండి పూర్వాచారం వదలనివారు ఒకలా ముస్తాబవుతారు. ఒక్కసారిగా అన్ని నగలు, తీసివేసి, సింపుల్‌గా ఒకనెక్లెస్, ఒక జతగాజులు వేసుకోమంటే తిడతారు. అంతేకాదు. వాళ్ళు సాక్షాత్తు లక్ష్మీదేవిలా వున్నామని మురిసిపోతారు.

ఇక పట్టుచీరవిషయం. నామటుకు నేను ఎప్పుడూ ప్రయాణాలలో పట్టుచీరకట్టను. ఏ బాంబేప్రింట్ చీరో కడతాను. కొంచెము మాసినా మాపుకనబడని ముదురుప్రింట్ చీర కడతాను. షిఫాన్, జార్జెటులాటిపల్చటిచీరలు ప్రయాణాలలో కట్టి పదిమందీ మనవేపే చూస్తున్నారని బాధ పడడందేనికి? నిమిష, నిమిషానికి కుచ్చెళ్ళు, పమిట సరిచేసుకోవడం దేనికి?

"నామట్టుకు నేను—ఎంతో బాగుంటాను" అని రాశారు. నగలు పెట్టుకొన్న ఆమెకూడ తనమటుకు తను ఎంతో అందంగావున్నానని మురిసిపోతుంది.

అందం వేరు. అభిరుచి వేరు. ఈ రెండు సమముగా కలుస్తేనే రాణింపు.

ఎవరి అభిరుచి వారిది. కాని తమ వంటిరంగుకు ఏచీర సరిపోతుంది? దానిమీదికి ఏరంగుజాకట్టుబాగుంటుంది?అని ఆలోచించి డ్రెస్సుచేసుకోవాలి. మనం భారతస్త్రీలం. ఎంత విదేశీపద్ధతి అనుకరిద్దామన్నా కట్టుబొట్టు మొదలైనవాటిలో మార్పు మనం భరించలేము. చేతికి ఒక జత గాజులు, మెల్లో సన్నని గొలుసు, నుదురుకి తగిన బొట్టు పెట్టుకొని, చీర చక్కగా కట్టుకొంటె లక్షణంగా వుంటాము. ఆ చీరసిలుకు చీర అయినంత మాత్రాన అందం పెంపొందదు అందుచే ఆఖరున మంగళా కందూరుచెప్పినట్లు మనకు తగినట్లు మనం వస్త్రాలంకరణ చేసుకోవాలి. రోజురోజుకు ఫాషను మారే ఈకాలంలో ఏది ఫాషనో నిర్ణయించటం కూడా కష్టంగా వుంది.

వై. లక్ష్మి, వాల్తేరు

* * *

హద్దుమీరిన అలవాట్లు

కొన్నిరకాల అలవాట్లున్నాయ్. హద్దుమీరి ఘోరంగా ఉంటాయి. కొత్త మంచిచీర కట్టుకొని బయటకివస్తే మూతితిప్పుకొనేది మా పక్కింటావిడ. క్రొత్తలో అర్థంకాక ఇవతలింటావిడ నడిగితే అది ఆవిడకలవాటంది. ఇంకోరకం వాళ్లున్నారు వాళ్ళకి అవతలివాళ్లు కొత్తవాళ్ళు చదువుకొన్నా,కించపరచట మొకఅలవాటు. ఆమధ్య మాయింటి కిద్దరు అక్కచెల్లెళ్లు వచ్చారు. మాటల్లో పెద్దావిడ అడిగింది ఏం చదువుకొన్నావని. మెట్రిక్ అని నేను చెప్తూండగానే చిన్నావిడ అందుకొని, ఆ ఈకాలంలో ఏం మెట్రిక్ లెద్దూ పట్టుమని పదియింగ్లీషుముక్కలు రావంది ఈసడింపుగా. ఇంతకీ ఆవిడగారు ఏ బియ్యేనో ఎమ్మేనో చదివిందనుకొనేరు. భర్తఘారం పాసవకుండా నేనూ నేసింది. పోతే కొందరికి వ్యక్తులరూపురేఖలనుండి కట్టుకొన్న బట్టల్ని, పెట్టుకున్న పేరుల్నికూడా మొహమాటమంటూలేకుండా ముఖంఎదుటఅనటమే అలవాటు. మాబంధువులయింట్లో కొడుక్కిపెళ్ళిచేసి కోడల్ని తీసుకువచ్చారంటేను వెళ్లా! పెళ్లికూతుర్ని చూడ్డానికి. పెళ్లికొడుకు బంధువులమ్మాయనుకొంటూ పెళ్ళికూతుర్ని చూస్తూ ఏంపేరంది. కుసుమ అంది ఆపిల్ల సిగ్గుతో. ఛా! అదేంపేరంటూ అక్కడే ఉన్న పెళ్ళికొడుకుతో ఆపేరు మార్చేయమంది. అంతా తనయిష్టమే అన్నట్లు. పాపం ఆపెళ్ళికూతురు బిక్కమొఖంతో చూసింది. ఇంతకీ ఆ లలనామణి అతిసాజూకైన అందమైన పేరేమిటోని, కుతూహలంతో అడిగా ఆవిడను. "శమంతకమణి" అంది రాగంతీస్తూ కళ్ళు ఇంతవిచేసి. కుసుం అన్న పేరు బావుండకపోవచ్చు. శమంతకమణే చాలా బాగుండి ఉండవచ్చు. కానీ ముఖంఎదుట నలుగురులో అనటం చాలాతప్పు. అది నాగరికత అనిపించుకోదు. అలాంటి వాళ్లతో స్నేహం చేసుకోటమంటే భయంగాకూడా ఉంటుంది ఏమంటారు?

సి. ఉత్తర-చాలీస్‌గాంవ్.

★

★ అతిరథులూ మహారథులూ ★

(24-వ పేజీ తరువాయి)

గూడా ఆలోచించినట్టు కనిపించదు అయ్యర్.

"ఇలాంటి, తీరికరగని జీవితం జీవిస్తున్న అయ్యర్ తగాదాలకొచ్చి కూర్చుంటాడంటే తక్షణమే నమ్మగలమా ?..."

ఇది ఒకపక్కనించొచ్చే వాదం.

"అతడు కాకపోవచ్చు-ఆయన కూతుళ్లూ, కొడుకులూ, ఏకమై - గజలక్ష్మమ్మగార్ని గడగడలాడిస్తారు!"

ఇరుగు పొరుగుల్లో కొందరనేమాట!

"ముగ్గురు కొడుకులూ, యిద్దరు కూతుళ్లూ ఉన్నారయ్యర్‌కు. చిలకల్లాంటి ఆ పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. ఒచ్చినప్పట్నించీ పచ్చగా వుంటున్నారు. చూసి ఓర్వలేని చుప్పనాతులంతా, లక్షణంగా పుట్టిన వాళ్ల మీద కుంటే మాత్రం - వాళ్లు రాణకెక్కేదేముంది! తెలివున్న వాడెప్పుడూ తెచ్చుకోగలడు పది రాళ్ళు. పొరుగూరినించి వచ్చి పొట్టపోసుకుంటున్న వాళ్లే బినా, యిష్టమొచ్చినట్టంటే ఎవరు పడతారు?...దానికీ ఒక హద్దంటూ వుండొద్దూ!"...

ఏదీ పట్టించుకోనట్టుండే యంబారయ్యలాంటి వ్యక్తులు మాటాడే మాటయిది:

ఊరు ఎన్నివిధాల ఉండబట్టలేక అనుకుంటున్నా, తనని కాదన్నట్లే తనయింట్లో తగాదా లేం జరుగుతున్నట్టయ్యాగూడా తలచకుండానే రోజులు గడిపేస్తున్నాడు అతి చాకచక్యంగల అయ్యర్.

* * *

అయిదారునెల్లు గడిచాయి. ఒకనాటి వెన్నెల రాత్రి, పెద్దబజారులో ఫెంకుటింటి వసారాలో సమావేశమైన పెద్దలంతా పట్టణ రాజకీయాలు పెద్దఎత్తున చర్చిస్తున్నారు. అందులో, అయ్యర్ విషయం అతిప్రధాన సమస్యగా ఎన్నుకుని, తలో రీతిగానూ తర్జన భర్జన మొదలెట్టారు:

"అయ్యర్-అమాంతం హోటల్లో లాడ్జింగ్ సెక్షన్ రద్దుపరచి, కాపురాన్నక్కడికి కదిలించిన కారణమేమైఉంటుందంటారు?"...



★ అతిరథులూ మహారథులూ ★

ఒచ్చి కూర్చున్నవారిలో ఒక సభ్యుని ప్రస్తావన:

"గజలక్ష్మమ్మగారి గడబిడకు తట్టుకోలేక, తరలించాడు తన సంసారాన్ని అయ్యర్!"...

అయ్యరంటే అభిమానంగల వ్యక్తి అన్న మాట లివి.

"అయితే అయిందిగాని, అన్నిరోజులు అవస్థపడ్డా, అనాయాసంగా అయ్యర్ను ఒదిలించుకున్న ఆంజనేయస్వామిగారు అదృష్టవంతులనే చెప్పాలి; ఆయన్ను అభినందించాలి!"...

పరంధామయ్యగారి పలుకులివి:

"అయ్యర్ని ఒదిలించుకోటం మాటెలావున్నా - ఆంజనేయ స్వామిగార్ని ఒదిలించుకుని అయ్యర్ అవతలపడ్డాడేమో అనిపిస్తుంది!"

పద్మనాభయ్యగారు పట్టి పట్టి అన్న మాటలివి:

"అది ఎంతమాత్రమూ కాదు, పద్మనాభయ్యగారు, ఎంతసమర్థించచూచినా, పాక్షికంగానేవుంది ఆ సమర్థన! కుంభకోణం అయ్యరతను, కూర్చునే గుళ్లూ, గోపురాలూ మింగేయగలడు! తనకేమాత్రమో తక్షణమే లాభిస్తుందని తోచకపోతే, తరలిస్తాడా తన సంసారాన్ని ?"

పాపారావు పరిశీలనగా అన్న మాటలు:

అధ్యక్షులవారు అన్నివాదాలూ విని కడకు తేల్చినసారాంశం:

"ఎవరిబాధనుండి ఎవరు తప్పించుకున్నా, ఫలితం ఒక్కటే!...వీరిబాధ వీరికీ తీరింది; వారిబాధ వారికీ తీరింది. గజలక్ష్మమ్మగార్ని గదులన్నిటిలోనూపడి దొర్లమనండిక! ఎవరికేంవచ్చిందిగనక మధ్య ?!"...

"ఎవరికీ ఏమీ లేకపోతే ఈ దచ్చు సమావేశాలన్నీ ఎందుకు?...ఎవర్నుద్ధరించను?"

అందరూ కలిసి అన్న మాటలు.

అధ్యక్షులవారికి అమాంతం కోపంవచ్చి సమావేశాన్ని కాలనిర్ణయంలేకుండా వాయిదాపడేసి, పైపంచె దులుపుకుని, రుసరుసలాడుతూ రూటుమార్చి—యింటికికాక ఇంకెక్కడికో వెళ్లిపోయారు అంత అర్థరాత్రిలోనూ, అందర్నీ తిట్టుకుంటూ.

సభ్యులంతా 'తలో' రీతిగానూ విమర్శించుకుంటూ రాత్రి సమావేశాల్ని ఇకనుంచీ రద్దుచెయ్యాల్సిందే ననుకుంటూ ఆ రాత్రికి, ఎవరిళ్లకు వారు చేరుకున్నారు.

* * *

అటుతరువాత నాల్గురోజులకు అపరాధ పరిశోధకు డొకాయన శ్రమించి సేకరించి చెప్పిన తాజావార్తలివి:

"అయ్యర్ కూతురు అరుంథతీఅమ్మాళ్ ను ఆంజనేయస్వామిగారి కుమారుడు అప్పారావు ప్రేమిస్తున్నాడన్న విషయం కర్ణాకర్ణిగా విన్న కల్యాణరామయ్యర్ సొంతయిల్లు కట్టుకున్నాక వెళదామనుకునీ త్వరపడి యిల్లుఖాళీచేసి, హోటలు పైఅంతస్తులోకి కాపరాన్ని మార్చేశాడు; అంతేగాని, గజలక్ష్మమ్మగారికి జడిసిగానీ, ఆంజనేయస్వామిగారికి హడిలిపోయిగానీ కాదు. అసలు రహస్యం ఇది!" అని.

ఇది వినగానే, యింతక్రితం సమావేశాలు జరిపి, సతమతమైన సభ్యులందరూ, కల్యాణరామయ్యరూ, ఆంజనేయస్వామిగారూ, అమాంతం విస్మయంకులై కూచున్నందుకు, తమను తామే దూషించుకున్నారు. తగూలు పడింది తాముగాని, వారుగాదని తెలుసుకున్నారు. ముక్కుమీద వేలేసుకున్నారు. అధ్యక్షులవార్ని అవలోకించారు.

ముందు ముందు ఇలాంటి చర్చలు మళ్లీ చెయ్యకూడదని మనిషికి మనిషి మాట ఇచ్చుకున్నారు. తమలో తాము తగూలుపడ్డం తగదనుకున్నారు. తలోదారినా బయలుదేరి వెళ్ళారు సమావేశాన్ని సమాప్తంచేసి!

* * *


ఈ వార్త అలా అలా వ్యాపించి-ఇరుగుపొరుగు అమ్మలక్కలమూలంగా ఇంటికి చేరగానే, అనుమానంవేసి, అంతక్రితం రాత్రినించీ యింటికిరాని అప్పారావుకోసం ఆంజనేయస్వామిగారు హడావిడిగా పరుగెత్తారు బజార్లవెంబడి.

సగందూరం వెళ్లేలోపలే-సమాచారం యావత్తూ కనుక్కుని వస్తున్న పరంధామయ్యగారు ఎదురై-ఆంజనేయస్వామిగార్ని ఆపాదమస్తకం పరిశీలించి, తనకు తెలిసిన సమాచారం యావత్తూ ఆంజనేయస్వామిగారికి అంతక్రితమే అవగతమై ఉంటుందని అనుకుని, చిరునవ్వు ముఖాన చిందించుతూ,

"కల్యాణరామయ్యర్ కూతురి కరగ్రహణం చేశాట్ట మీ అబ్బాయి అప్పారావు!"... అని ఆంజనేయస్వామిగారి అనుమానం తీరేలా అతినింపాదిగా అక్షరమక్షరమూ పట్టి పట్టి అన్నారు!

పరంధామయ్యగారీమాట అనీ అనగానే అసలే ఆవేదన పడుతున్న ఆ మహాపండితుడు, భావికాలజ్ఞుడునైన, ఆంజనేయస్వామిగారు,

"హారి కులపాంసనుడా !!"... అంటూ అక్కడే కుప్పలా కూలబడిపోయారు! ★



మాటకు మాట

రమాదేవి యొక్కనాడు
రజతాచలమునకు బోయి.
ఉమాదేవి గని నవ్వుచు
తమాషగా యిట్టులనెను.

రమ:

"ఎచటికేగెనమ్మ ఓ
ఈశ్వరి! మీ బిచ్చగాడు?"

ఉమ:

"అతడా! బలిచక్రవర్తి
యజ్ఞశాల కరిగినాడు"

రమ:

"పశుపతి ఎందరిగినాడు
పడతి! అతని జాడలేదు?"

ఉమ:

"గోకులమున గొల్లలతో
గోవుల గాచుటకేగెను."

రమ:

"పాములవాడెందుగలడు?
హైమవతీదేవిగారు!"

ఉమ:

"ఉరగశయ్యపైనుండుట
యెఱుగవాక్కా పదినెగాతు!"

రమ:

"అంత కోపగింతువేల
నమ్మా! నామీద నీవు?"

ఉమ:

"అచల సంతతికి కోపం
బెచట జనించునో చెప్పుము!"

గిరికన్యక నీతీరున
పరిహాసము సేయబోయి
చివరకు తానే న్యూనత
చెంది తిరిగిపోయె కమల.

కాన చతురమతులను నవ
మానము సేయుట సాధ్యము
కాని కార్యమని యెల్లరు
దీనివలన నెఱుగగలరు!

ఆర్. దొరసామి

అక్క-తమ్ముడు

చాలాచాలా కాలం క్రిందట అడవి పక్కన పల్లెటూళ్లో ఒక పిల్లవాడు ఉండేవాడు. ఆ కుర్రాడికి చక్కనిచుక్కలాంటి ఒక అక్క ఉండేది. పాపం ఈ అక్కా-తమ్ముళ్లకి తల్లీతండ్రీ వీళ్ల చిన్నప్పుడే కరువైపోయారు. అందువల్ల, ఆ అక్కా తమ్ముడూ వాళ్ళ తల్లీ తండ్రీ చచ్చిపోయిన ఆ చిన్న పూరిగుడిసెలోనే ఉంటూ ఎలాగో కాలక్షేపం చేస్తున్నారు. ఒక నాడు కుర్రాడు అడవికి బయలుదేరుతూ ఉండగా, వాడి అక్క చక్కా వచ్చి, "చిట్టితమ్ముడూ! అడవిలో ఎక్కడైనాసరే, నీళ్లు తాగుతూన్న ఉడతగనక నీకు కనిపిస్తే, దాని మీద మాత్రం బాణం వేయబోకు సుమా!" అని హెచ్చరించి పంపించింది. ఆ కుర్రవాడు విల్లూ, అమ్ములూ తీసుకుని అడవికి వెళ్ళిపోయాడు.

"సింహగురు"

అడవిలో నడిచి పోగాపోగా దారిలో కిచకిచలాడుతూ పోతున్న ఒక ఉడతగొంతు వినిపించింది. వెంటనే ఆ కుర్రాడు దానికి గురిచూచి, బాణం వదిలాడు. ఉడత చావలేదు గాని, ప్రక్కన ఎక్కడో నీళ్లలో పడినట్టు మాత్రం చప్పుడు వినిపించింది. అక్కడికి పోయిచూసేసరికి ఆ చెట్లచాటున ఉన్న చెరువులో నీటిమీద తన బాణం తేలుతూ ఉండటం చూశాడు. వెంటనే బట్టలువిప్పి గట్టునపెట్టి, గభాల్న చెరువులో దూకి ఈదడం మొదలుపెట్టాడు. కాని, తీరా బాణం దగ్గరికి చేరుకున్న సమయంలో, వాడికి ఏమి తోచిందో, "పెద్ద చేపా! పెద్ద చేపా! నన్ను మింగెయ్యరాదా?" అని అరిచాడు. వెంటనే ఒక పెద్దచేప వచ్చి, వాణ్ణి నోట కరుచుకుంది. "పెద్ద చేపా! పెద్దచేపా! నన్ను మాత్రం నములకుసుమా. ఒక్కసారే మింగెయ్యి దయచేసి!" అని బతిమాలాడు. పోనీలే పాపం అనుకుని, పెద్దచేప అలాగే మెల్లగా వాణ్ణి గుటుక్కున మింగేసింది.

పాపం, ఇంటి దగ్గర అక్కకు చిట్టితమ్ముడు ఎక్కడికి వెళ్లిందీ, ఏమయిందీ ఎవరు చెపుతారు? తమ్ముడెంతకీ తిరిగి రాకపోవడంతో అలాగే ఇంట్లో ఒక్కతే బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతూంది. ఒకరోజున, నాలుగు చేపలైనా పట్టుకొద్దాం అని అడవికి బయలుదేరింది. సరాసరి చెరువుగట్టుకి వెళ్ళి నీళ్ళలో గాలం వేసింది.

పెద్దచేప కడుపులో ఉన్న కుర్రవాడు అది చూసి, "పెద్దచేపా! పెద్దచేపా! ఇంకా చూస్తావేమి? పదపద! ఆ ఎరను నోట కరుచుకో!" అని ప్రోత్సహించాడు. పెద్దచేప గాలానికి తగుల్కుంది. అక్క ఎలాగో ఆ చేపని ఇంటికిచేరవేసి, కొయ్యడం మొదలు పెట్టేసరికి, "జాగ్రత్త అక్కా! జాగ్రత్త! నన్ను కూడా కోసేస్తావేమోసుమా!" అన్నాడు, చేప కడుపులో ఉన్న చిట్టితమ్ముడు, ముద్దులతమ్ముడి గొంతు మళ్లీ వినిపించడంతో అక్కకు పట్టరానంత ఆనందం కలిగింది. తమ్ముణ్ణి బయటికి తీసి, ప్రేమతో కావిలించుకుని ముద్దు పెట్టుకుంది. ఇన్నాళ్లకి మళ్లీ అక్కా-తమ్ముడూ కలిసి కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ అన్నాలు తిన్నారు.

తిప్పాతిప్పలూ అయిన తర్వాత ఆ కుర్రవాడు బయట ఉన్న అడవిలోకి వెళ్లేసరికి, (అంతకాలం చేప కడుపులో ఉండటంచేత నవనీతం లాగ తయారయిన) అతని చర్మం తీక్షణమైన సూర్యరశ్మికి కమిలిపోయి ఎంతో బాధకలిగింది. దాంతో వాడికి సూర్యుడిమీద అమితమైన కోపం వచ్చింది. తక్షణం అక్కదగ్గిరికి వెళ్లి, "అక్కా! అక్కా! నాకు కొంచెం ఉన్ని తెచ్చిపెడతావా?" అన్నాడు.

అక్క తెచ్చిపెట్టిన ఉన్ని పేని, ఒక వల తయారుచేశాడు. వెంటనే పోయి అడవిలో ఒకచోట ఆ వల పన్నివచ్చాడు. మర్నాడు అసలు సూర్యుడు ఉదయించనే లేదు. "తమ్ముడూ! నువ్వేదో చెడ్డపని చేసినట్టున్నావే!" అంది అక్క.

అక్క-తమ్ముడు

"లేదక్కా! నేను సూర్యుణ్ణి పట్టటానికి నిన్న సాయంకాలం ఒక పొదలో వల పన్ని వచ్చాను. ఏం జరిగిందో చూసి వస్తానుండు," అన్నాడు. అక్కడికి పోయి చూసేసరికి సూర్యుడు ఆ వలలో చిక్కుకుని, చేసేదిలేక అలాగే ఆ పొదలోనే ఉండిపోయాడు. ఎలాగైనా సూర్యుణ్ణి బయటికి లాగాలని ఆ కుర్రవాడెంతో ప్రయత్నించాడు. కాని, ఆ సూర్యుడు మండుతూన్న నిప్పుగుండులాగ ఉండటంవల్ల సాధ్యం కాలేదు. ఆ వలను కొరికి వేయగల పురుగుల్ని తెచ్చి ఆ పొదలో వేశాడు. లాభం లేకపోయింది. చాలా ఎలికల్ని తెచ్చి ఆ పొదలో విడిచిపెట్టాడు. అదీ లాభించలేదు. చివరికి ఒక మంచు ఎలుగుబంటిని తెచ్చి ఆ పొదలో వదిలాడు. అది ఆ వలనంతటినీ కొరికేసింది.

వెంటనే సూర్యుడు ఆకాశం మీదికి వెళ్ళిపోయాడు. కాని సూర్యుడి వేడివల్ల ఆ ఎలుగుబంటి కళ్లు మాడిపోయినయి. అప్పటి నుంచీ, మంచుఎలుగుబంటి కళ్లు సరిగ్గా కనపడని గుడ్డిమాలోకం అయింది. పాపం ఇప్పటికీ అది అలాగే అవస్థపడుతోంది. ★

సినిమా

పోటీ ధాటితో పాటు చోటూ పెరగాలి

ఈ ఏడాది ఆరంభం అయినప్పటినుండి దేశంలో చిత్రాల రద్దీ ఎన్నడూ లేనంత ఎక్కువగా ఉంటోంది ముఖ్యంగా గుంటూరు, విజయవాడ, రాజమండ్రివంటి 'ఏ' క్లాస్ కేంద్రాలలో మంచి థియేటర్ల గిరాకీ మరీ ఎక్కువగా ఉంది. దీనికి కారణం, తెలుగు చిత్రాలు ఒకదానివెంట ఒకటి, ఒకటితో కలిసి మరొకటీ పోటాపోటీగా విడుదల అవుతూ ఉండడం.

పెరిగే పరిశ్రమకు ఈ లక్షణం సహజమే. అయినా, కొత్తల్లోనే పోటీ ఇంత ధాటీగా సాగడం అంత అఖండమైన, బ్రహ్మాండమైన విషయం కాదు. ఇవాళ సినిమా తీసిన ఆసామి దీంతో పది డబ్బులు తెచ్చుకు నిలబడి (ముందు జాగ్రత్త తీసుకున్నా) మరో పది చిత్రాలు తీయగలగాలి

అలాకాక, ప్రతి ఇద్దరిలోను ఒకొక్కడు దెబ్బతింటూ ఉంటే, ఈనాడు గంభీరంగా గర్వకారణంగా కనబడుతున్న పరిశ్రమ పరిణామం మళ్ళీ చిక్కి శల్యమై పోయే ప్రమాదం ఏర్పడుతుంది. బోలెడు డబ్బు పోసి, ఎంతో శ్రమపడి, పదిమంది కళాకారులూ కలసి కష్టపడి రూపొందించిన ఫలితం అయిన ఒక చిత్రం అందరూ చూచి, ఆనందించవలసినదే అయినాకూడా, . పోటీల లాటి కారణాంతరాలవల్ల చూడాల్సినంత మందీ చూడ వీలులేక పోవడంకూడా బాధాకరమే.

ఒక తెలుగు చిత్రం నిర్మించి, బజారులో పెట్టినపుడు, దానికి తోటి తెలుగు చిత్రం పోటీ ఒకటి ఉంటుంది. మేటి హిందీ చిత్రం ఇంకో పోటీ. ఉంటే గింటే సినిమాస్కోప్ ఆంగ్ల చిత్రం మరొకటి. ఇది కాక ఒక్క విగిన మరో రెండు తెలుగు,



విఠల్ ప్రొడక్షన్స్‌వారి "వద్దంటే పెళ్లి"లో కృష్ణకుమారి.

సి...ని...మా:

ఊళ్లో వడ్రంగి పరారీ అయ్యాడంటే అయ్యాడన్నారు. అతగాని అభిమానులు అనుకొన్నారు.

ఆరేళ్ళు గిర్రున తిరిగాయి.

ఒక రోజున ఆ ఊరి ఆసామి పనిమీద హాలీవుడ్ వెళ్లాడు. పరారీఅయిన వడ్రంగి; అక్కడొక చూడచక్కని మేడ గదిలో కనబడ్డాడు.

"హరినీ! అలా హఠాత్తుగా మాయమైపోయి ఇక్కడ తేలావా?. . ఏం చేస్తున్నట్టు?" అన్నాడు ఆసామి.

కాగితాల కట్టలకి చిత్రిక పడుతున్న ఆ వ్యక్తి తలెత్తకుండానే కొంచెం విసుగ్గా జవాబిచ్చాడు:

"ఏముంది. స్క్రిప్టులు రాస్తున్నాను"

—పి జి. డబ్ల్యూ.

చిత్రాలుకూడా రాత ప్పని పిలి స్తే, పాతలా అరణాపట్టుకు నిలబడ్డ ఆసామీ, చిరాకు కలిగించే అవస్థలో పడతారు.


అందుకు చూడని సినిమాలవారు దరి మిలా, సరికొత్త బాక్సాఫీసు సూత్రాలు తయారు చేసుకుని నచ్చచెప్పతుంటారు. ఎందుకంటే పాతబాక్సాఫీసు సూత్రాలకు కాలదోషంలాటిది పట్టినట్టు కనబడుతోంది.

ముఖ్యమైన సూత్రాలలో "తారాబలం" ఒకటి. మంచితారాబలం ఉన్న చిత్రాలు రెండుమూడు పోటీలు పడి వచ్చినపుడు ఈబలం ఏమంత అఖండంగా జనాన్ని లాగటం లేదు.

అయినా ఈ పరిశ్రమ బలాబలాల పరీక్షకి అత్యంత యోగ్యమైనదని అభివర్ణించడానికి వీలు లేదు. పరీక్షకోసం, సత్వాన్వేషణకోసం ఎవరూ సినిమాలు తీయరు.

నినాదాలూ, ఉద్ఘోషలూ, అభిభాషణలూ మొదలైనవి ఎలా ఉన్నా సినిమా పరిశ్రమలో డబ్బు చాలా ముఖ్యం అన్నది బహు విలవైన ముక్క. ఈ ధర్మరహస్యం, గురించి ఎవరూ ఎవరికీ నూరిపోయాల్సిన అవసరం లేదు.

అయినా, నినాదాల భరవసా చూసుకుని ఒకరు, "వినోదాల దాణా" ఉందని మరొకరూ, తారాబలం ధీమాతో ఇంకొకరూ, 'కలం బలం' కొల్లలని కొండొక నిర్మాత ఈ రోజున ఒక్కవరసన జనం ఉక్కిరిబిక్కిరి అయేలా సినిమాలు విడుదల చేస్తున్నారు. రెండు తెలుగు చిత్రాల విడుదలకు



దక్షిణ భారతకళాకారులసంఘంవారి కార్యాలయ భవననిర్మాణానికి శ్రీ ఎస్. ఎస్. వాసన్ ఫిబ్రవరి 10 న శంకుస్థాపన చేశారు. శ్రీ శివాజీ గణేశన్, ఎం. జి. రామచంద్రన్‌లను ఈ చిత్రంలో చూడవచ్చు.

మధ్య వ్యవధి వారం కూడా ఉండటం లేదు. నాలుగు వారాలనాటి చిత్రాలు బలంగా నడుస్తున్నాయి.

ఇవి కాక వీటికీ హింధీ చిత్రాల పోటీ ఉంది. వీటివల్ల చివరకి చోటు గిరాకీ పెరిగింది. ఉన్న వెపుడు కదుల్తాయా అని రాబోయేవి, తయారవుతున్నవీకూడా కాచుకొని ఉన్నాయి. ఎందుకంటే, మన తెలుగు బస్తీలలో పట్టుమని పది థియేటర్లు (రాజధానిలో తప్ప) ఉన్నవి ఏవి లేవు. అంచేత, కొత్తచిత్రం వస్తే, ఉన్న వాటిలో ఒకటో రెండో కదలాలి. వాటిని జనం ఇంకా చూచేవీలున్నా కదలవలసే పరిస్థితి ఏర్పడుతోంది.

నిమిషాలను రూపాయల్లోకి తర్జుమా చేసి వ్యవహారం నడిపాల్సిన ఈ పరిశ్రమలో, ఈరోజులలో, చిత్రం తయారు చేసుకున్న ఏ నిర్మాతా, పోటీతగ్గి, గాలివాలుగా తిరిగేదాకా వేచిఉండడం కష్టం. పెట్టుబడి వడ్డీలు పెరుగుతూ ఉంటాయి.

ఒకవేళ వేచిఉన్నా పోటీ ధాటీ తగ్గదు. జనపరినించి మార్చిదాకా ఆగితే, మార్చినించి

(52-వ పేజీ చూడండి)

"బందరు"లో సినిమాలు చూసేవా రెందరు?

తెలుగు బస్తీలో సినిమాలు చూసేవా రెందరు?

ఇటీవల మచ్చుకు, బందరులో సేకరించిన వివరాలనుబట్టి నూటికి ఎనభై మంది పైచిలుకు అని స్థూలంగా చెప్పకోవచ్చు. బందరు, మంచి తెలుగుబస్తీకి పర్యాయపదం. ఈ అభిప్రాయంతోనే కేంద్రప్రభుత్వ వాణిజ్యశాఖ ఆధ్వర్యాన తేయాకు ప్రచారసంఘం 578 కుటుంబాలవారిని కలుసుకొని, వారి అలవాట్లూ, అభిరుచులూ అడిగి తెలుసుకున్నారు.

ఈ 578 లోనూ 476 కుటుంబాలవారికి చలనచిత్రాలు చూచే అలవాటు ఉన్నట్లు తేలింది. అంటే, లెక్కల పరిభాషలో నూటికి 82.3 మంది అన్నమాట.

ఇలా చలనచిత్రాలను ఆదరించే ఈ కుటుంబాలలో పెద్ద రాబడి లేనివారూ ఉన్నారు; ఉన్నవారూ ఉన్నారు. స్థూలంగా నెలకి 81 రూపాయలనుంచి 150 వరకూ ఆర్జించేవారు ఈ చలనచిత్రాభిమానులలో అధిక సంఖ్యాకులట. ఈ రాబడిగల కుటుంబాలు 285 ఉన్నాయి. మిగతావారిలో వర్తకవ్యాపారాలు, వృత్తులు చూచుకునే కుటుంబాలు 166 ఉన్నాయి. అంటే, చలనచిత్రాభిమానులలో సగంమంది నెలకు నూరు నూటయాభై తెచ్చుకునేవా రన్నమాట.

ఈ సేకరణ తేయాకు సంఘానికి చెందిన శ్రీ ఎం. ఎస్. మూర్తి, మరి నలుగురు ఉద్యోగులూ కలసి సాగించారు.

సినిమా వార్తలు

అనుపమా ("ముద్దుబిడ్డ") ఫిలింస్ వారి ద్వితీయ చిత్రానికి ఫిబ్రవరి 9 న వీనస్ స్టుడియోలో ప్రారంభోత్సవం జరిగింది శ్రీ తిలక్ దర్శకత్వం నిర్వహిస్తారు సావిత్రి, జగ్గయ్య, చదలవాడ కుటుంబరావు, పేరుమాళ్ళు, రమణారెడ్డి మొదలగువారు పాల్గొంటున్నారు. రచన శ్రీ తాపీ ధర్మారావు, ఆరుద్ర సంగీతం పెండ్యాల నాగేశ్వరరావు

* * *

వి ఎ ఎస్ ప్రొడక్షన్స వారి "చెంచులక్ష్మి" నిర్మాణం వాహినీ స్టుడియోలో సాగుతోంది. శ్రీ సుబ్బారావు ("రాజు—పేద") దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రంలో భానుమతి, నాగేశ్వరరావు, రంగారావు, రేలంగి నటిస్తున్నారు. రచన శ్రీ సదాశివబ్రహ్మం. సంగీత దర్శకుడు శ్రీ సాలూరి రాజేశ్వరరావు.

* * *

భరణీవారి "వరుడు కావాలెను" చాల వరకు పూర్తి అయింది. శ్రీ పి. రామకృష్ణ దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో భానుమతి, జగ్గయ్య, అమర్ నాథ్, టి. ఆర్. రామచంద్రన్ పాల్గొంటున్నారు. రచన శ్రీ రావూరి సత్యనారాయణ.

* * *

శ్రీ తాపీ చాణక్య దర్శకత్వాన సారథీ వారు నిర్మిస్తున్న సాంఘిక-చిత్రం "పెద్దరికాలు" విడుదలకు సిద్ధంకావస్తున్నది అంజలి, గిరిజ, హేమలత, జగ్గయ్య, డా॥ గోవిందరాజుల సుబ్బారావు, పేరుమాళ్ళు మొదలగువారు పాల్గొంటున్నారు. సంగీత దర్శకుడు వేణు

* * *

పొన్నలూరి బ్రదర్సువారి తొలి-చిత్రం "భాగ్యరేఖ" ఈనెల 20న ఆంధ్రప్రదేశ్ లో విడుదల అయింది. శ్రీ బి. ఎన్. రెడ్డి తీర్చిదిద్దిన యీ చిత్రంలో రామారావు, జమున, జానకి, రేలంగి, నాగభూషణం, సి. ఎస్. ఆర్. హేమలత మొదలగువారు పాల్గొన్నారు శ్రీ పాలగుమ్మి పద్మరాజు మాటలు, శ్రీ దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి పాటలూ వ్రాశారు ఛాయాగ్రహణం శ్రీ బి ఎన్ కొండారెడ్డి

* * *

కెంపరాజ్ ప్రొడక్షన్స్ వారి పౌరాణికం "నలదమయంతి" 22-న విడుదల అయింది భానుమతి, కెంపరాజ్ ముఖ్యభూమికలు నిర్వహించారు నాగయ్య, రేలంగి, సంగర, ముక్కామల, జయలక్ష్మి మొదలగువారు పాల్గొన్నారు. రచన శ్రీ సముద్రాల రాఘవాచార్య దర్శకుడు శ్రీ కెంపరాజ్.



థాయ్‌లాండ్ (సయాం) ప్రభుత్వ సమాచార శాఖవారి బౌద్ధచిత్రం (గేవాకలర్) "అంగులిమాల"లో సత్రీ విమల.

అదీ - ఇదీ

బొంబాయి నగరంలో వయోజన విద్యావ్యాప్తికి కృషి చేసే సంఘానికి తోడ్పాటు నిమిత్తం నటీనటులంతా ఇటీవల ఒక చాచా ప్రదర్శనం జరిపారు. సంస్కృతి వికాస సభ అధ్వర్యాన జరిగిన ఈ ప్రదర్శనాన్ని జయప్రదంగా నిర్వహించ పూనుకొని ఫలితాలు సాధించినది సొహ్రాబ్ మోడి సతి శ్రీమతి మెహతాబ్.

ప్రదర్శనంలో శ్రీ పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, నర్గీస్, నిరూపరాయ్, సితారా, కామినీ కౌశల్, నీలం, ఆగా, అన్వర్ హుసేన్, జానీవాకర్ ప్రభృతులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనం పేరుచెప్పి బొంబాయి నగరంలో వయోజన విద్యా కార్యక్రమాలకు 45 వేల రూపాయల నిధి సమకూరింది.

* * *

"ఈ సారి ఎన్నికలకి ఏమిటి మీ సాధనం?" అని ఎస్. కె. పాటిల్‌ను అడిగారట పండిట్ నెహ్రూ ఆ మధ్య.

"సినీమా" అన్నారు పాటిల్.

పాటిల్ ఈ సాధనాన్ని వాడినా, మానినా, తమిళనాడు కాంగ్రెసు, అందుకు ఉపక్రమించి ఒక చిన్న చిత్రం నిర్మించింది.

"నాం కడమై" అనే పేరున నిర్మించిన ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 7న మద్రాసు గెయిటీ థియేటర్‌లో పత్రికలవారికి చూపించారు.

ప్రతిపక్షాలకు ఒక కార్యక్రమం, అవతలి గట్టూ అనేవి లేవని, ప్రచారం చేయడం ప్రధానలక్ష్యంగా ఈ చిత్రాన్ని ఎస్. డి. సుందరం తయారుచేశారు. ఈ విధంగా కాంగ్రెసుకు ఓటియ్యాలని చెప్పినట్టైంది గాబట్టి, కాంగ్రెసు ఇదివరకు ఏమేం చేసిందో, ఇక ముందేచేస్తుందో కూడా మాటవరసకన్నట్టు చూపించారు.

జెమినీలో ఇది తయారైంది. నిడివి 1500 అడుగులు. ఒక వంద ప్రతులు విడుదల చేస్తున్నారు.

* * *

మూస్ ఫిలిం స్టుడియో వారు సోవో కలర్‌లో నిర్మించిన "ఒథెల్లో" గత వారం మద్రాసు న్యూ గ్లోబ్ థియేటర్‌లో విడుదల అయింది. జగద్విఖ్యాతమైన ఈ గాధను కొంతకాలం క్రితం ఆర్సన్ వెల్స్ చిత్రంగా నిర్మించాడు.

ఇప్పుడీ రష్యన్ చిత్రాన్ని ఆంగ్లంలోకి డబ్ చేశారు. చిత్రం చూడటానికి ఎంత అఖండంగా ఉన్నా సంభాషణల ఉచ్చారణ, వేగం, స్థాయీ మూడూ కూడా మూడో కాలంలో సాగినందువల్ల (ముఖ్యంగా పూర్వార్థంలో) ఎవరేమంటున్నదీ ఒకపట్టాన (షేక్‌స్పియర్ కంఠతా రానివారికి) అంతుపట్టవు. ఉత్తరార్థంలో ఈ లోపం అంత కొట్టొచ్చినట్టు కనబడదు.

ఇక, మిగతా అంశాలు అన్నీ ప్రశంసనీయంగా ఉన్నాయి. కథా-చిత్రణా శిల్పం, ఛాయాగ్రహణం, కన్ను చెదరగొట్టక హాయిగొలిపే ఛాయలుగల సోవో కలర్ మొదలైనవన్నీ విశిష్టంగా ఉన్నాయి. స్వగతాలూ సుదీర్ఘమైన సంభాషణలుండే సన్నివేశాలు ఇటువంటి చిత్రాలలో ఒక సమస్య. ఈ చిత్రంలో ఈ తరహా సన్నివేశాలను చూస్తే చలనచిత్ర కళానైపుణికి అర్థం గోచరిస్తుంది.

కథకి ప్రధానమైన వ్యక్తులతోనే, అవసరమైన ఘట్టాలతోనే, చిత్రాన్ని రూపొందించిన సెర్గీయుట్‌కవిచ్ దీన్ని 9 వేల అడుగులలో పూర్తిచేశారు. ఒథెల్లో సాహస కృత్యాలను డెస్డిమోనా వినడం, వారి ప్రణయం పెంపొందడం మొదలైన కథాంశాలను అత్యంత ప్రశంసనీయమైన రీతిన, క్లుప్తంగా చిత్రించి ఉపోద్ఘాతంలో పొందుపరచారు.

ఈ చిత్రానికి గతసారి కాన్సులో జరిగిన చిత్రోత్సవంలో ప్రశంసాబహుమతి వచ్చింది.

* * *

దక్షిణ భారత కళాకారుల సంఘంవారు మద్రాసు త్యాగరాయనగర్‌లో స్వంత భవనం నిర్మించుకుంటున్నారు. జెమినీ అధిపతి శ్రీ ఎస్. ఎస్. వాసన్ ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తమిళ నటీనటులు అంతా ఉత్సవంలో పాల్గొన్నారు. భవననిర్మాణానికి శ్రీ వాసన్ రెండు వేలూ, నటులు శ్రీ శివాజీ గణేశన్, ఎం. జి. రామచంద్రన్, టి. ఎస్. బాలయ్య పదేసి వేల రూపాయిలూ విరాళాలిచ్చారు. మున్ముందు నాటక ప్రదర్శనలద్వారా మరి కొంత ధనం సేకరించ దలచుకొన్నట్లు రామచంద్రన్ ప్రభృతులు ప్రకటించారు. ★

సినిమా

(50-వ పేజీ తరువాయి)

జూలై దాకా, ఇంకో పెద్దచిత్రం థియేటర్లని కేటాయించుకుంటుంది. జూలై నాటికి మరిన్ని చిత్రాలుంటాయి. ఇలా నిరీక్షణ అనంతం. అందుకని నిర్మాత కులదైవానికి నమస్కరించుకుని, రేపు మాపు ఆశగా చూస్తూ నిజే రంగభూమిమీద కాలుమోపుతాడు.

ఈవిధంగా కాలుమోపుతున్నవారూ, మోపనున్నవారూ నానాటికీ పెరుగుతున్నందువల్ల, చోటు కూడా పెరగాలి. కాని అదే జరగటంలేదు.

జరగవలసిన పరిస్థితి ఏర్పడింది కాబట్టి, ఇప్పటినించే ఈ పరిశ్రమ శ్రేయోభిలాషులు ఆంధ్రలో కొత్త థియేటర్ల నిర్మాణానికి గట్టిగా సన్నాహాలు ప్రారంభించాలి. ప్రభుత్వంకూడా ఈ విషయం సానుభూతితో పరిశీలించడం వాంఛనీయం; అవసరం. ★

తిరుగుబాటు బాటు

ప్రసిద్ధ రచయిత చార్లీ మెకార్థర్ నాటకాలు న్యూయార్కు బ్రాడ్వే రంగస్థలాని కెక్కిన కొత్తల్లో "బాక్సాఫీస్ హిట్"లకు పట్టిన గతేవాటికీ పట్టే పరిస్థితి ఏర్పడింది. బాక్సాఫీస్ సూత్రాలను ప్రజాహృదయాన్నీ క్షుణ్ణంగా అవగతం చేసుకున్నామనుకున్న ప్రొడ్యూసర్లూ డైరెక్టర్లూ మెకార్థర్ నాటకాల చిత్రణకి ఉపక్రమించారు.

మెకార్థర్ కేం పాలు పోలేదు. ఒక రోజున ప్రొడ్యూసరూ, డైరెక్టరూ, మరి పదిమందీ కలసి చిన్న చిన్న మార్పులు అంటూనే సాగిస్తున్న చిత్రవధని చూడలేక గబుక్కున ఆ గది కిటికీలోంచి అవతలి వేపుకివెళ్ళి, అంచుని పట్టుకు వేళ్ళాడ సాగాడు.

అది ఒక మేడకి పన్నెండో అంతస్తు.

గదిలో ఉన్న పదిమందీ ఇదేమిటని గోలపెడుతూ కిటికీ దగ్గరకి వచ్చారు.

"నా నాటకంలో అక్షరం కూడా మార్చవని హామీ ఇస్తే సరే, లేకపోతే ఈపళంగా దూకేస్తాను" అన్నాడు మెకార్థర్.

చివరకి అతనే గెలిచాడు; మార్చకపోయినా అతని నాటకాలు బ్రహ్మాండమైన విజయం సాధించాయి.

★ బుడుగు! చిచ్చుల పిడుగు! ★

(7-వ పేజీ తరువాయి)

నీకు రెండు జెడలు ఉన్నాయిగా అందుకని అని మళ్లీ చెప్పేశాను.

ఉంటే నీకేం అంది.

ఉంటే నీకేం అంటే నాకు తెలీదు అని చెప్పాను.

తెలీకపోతే, ఇదిగో యిదీ అనేసి, ఆ యిందిర నాగుండుమీద మొట్టికాయి కొట్టేసింది.

అయినా కోపం పోలేదు. అందుకని యిలా కింద కూచుని ముద్దు పెట్టేసుకుంది. అప్పుడు సీగానపెసూనాంబ చూడలేదనుకో.

చూస్తే వెక్కిరిస్తుంది.

మా బామ్మా, అమ్మా అంతే. ఒక్కోసారి సీగానపెసూనాంబ చూస్తున్నప్పుడే నను బంగారుతండిరీ అంటారు. అంటే ఫరవాలేదు కాని ముద్దు పెట్టేసుకుంటారు.

అప్పుడు సీగానపెసూనాంబ డిల్లమ్మా డిల్ల అని వెక్కిరిస్తుంది. అప్పుడు అమ్మ ఘుబుక్కున దాన్నికూడా పట్టుకుని ముద్దు పెట్టేసుకుంటుంది.

అయిందా పెళ్ళి అని ఏడిపిస్తాననుకో అప్పుడు నేను.

యేం? టీచీలో ఈ రెండు జెడల పిల్ల అప్పుడేం చేసింది తెలుసా?

ఫోకిరీ పిల్లాడా పద మీ యింటికే పద మీ అమ్మతో చెప్తా నీపనీ అంది. అని నా చెయ్యి పట్టుకుంది.

మరి అప్పుడుకూడా బాబాయి వచ్చినను రక్షించలేదు.

ఎలాగ?

మరి నేను చిన్నపిల్లాడినిగదా.

అందుకని సరేను యింటికిరా అమ్మతోటి చెప్పు అన్నాను.

అప్పుడు బాబాయి ఘుబుక్కున వచ్చేసి ఏవండీ ఏవండీ మీరు మా యింటికి రావద్దండీ అన్నాడు.

ఈ ఫోకిరీ పిల్లాడిని వాళ్లమ్మచేత తన్నించాలి నేను వెళ్తాను మీయింటికే అంది ఆ యిందిర.

అది కాదండీ, మరేమోనండీ, నేనే వీడిని తంతానులెండీ, వదిలేయండీ అన్నాడు బాబాయి.

నాకు జాలేసింది.

ఇందిరికికూడా జాలేసింది. అప్పుడేమో పోకిరీపిల్లాడా అని బాబాయి వేపుచూసి, నా నెత్తిమీద జెల్లకాయకొట్టి పో అంది.

అప్పుడు నేను బాబాయీ మెడ్రాసు రైల్లా ఘుబఘుబా వెళ్ళిపోయాం.

పాపం యీ పెద్దవాళ్లెపుడూ యింతే.

ముందస్తుగా వాళ్ల మాట వినాలి అంటారు గదా. పోనీలేఅని మనం అల్లరిచేస్తే అప్పుడు మన్ని రక్షించరు.

మళ్లీ అల్లరిచెయ్యను. అంటే చెయ్యి అంటారు చేస్తానూ అంటే ఒద్దూఅంటారు.

ఎప్పుడూ మనమే వాళ్ళమాట వినాలి అంటారు. ఒక్కసారేనా వాళ్లు మనమాట వినరు.

అంతెందుకు. యిప్పుడు పాపం, బాఘా చిన్నపిల్ల లుంటారా.

వాళ్లకి కొంచెం కొంచెం తెలుగువస్తుంది చూడు. అప్పుడేమో, ఎవరూలేకుండా కొంచెం మాటాడుతారు.

ఈ అమ్మా నాన్నా బామ్మ యిలాటివాళ్లు ఎలాగో వినేస్తారు.

అప్పుడు లావుపాటి పక్కింటి పిన్నిగారూ, వాళ మగడూ అలాటివాళ్లు మనింటికొస్తారా. అప్పుడేమో ఈ పాపాయిని కూచోపెట్టి నీ పేరుచెప్పూ అంటారు.

పాపం ఆ పాపాయికి బాఘా తెలుగు రాదుగదా. దానికి భయం వేసి చెప్పదు.

అప్పుడేమో ఈలావుపాటి పెద్దవాళ్లందరూ చుట్టూ నించుని చెప్పుచెప్పు చెప్పూ అని కేకలు వేస్తారుగదా.

పాపాయికి కోపం వచ్చేస్తుంది.

దాన్ని రక్షించడానికి, నేను చెప్తా నను కోప్పేరు. వాళ్లు వినరుగా. నన్ను కొట్టేస్తారు. దాని పేరు అదే చెప్పాల్ట.

అది చెప్పదుగామరి.

అప్పుడు వాళ్లమ్మా నానా దాన్ని కొట్టేస్తారు మొండిఘిల్లా అని.

వాళ్లకి మొండిపిల్ల అంటే అసలు అర్థం తెలీదు. నాకు తెలుసుననుకో.

లావుపాటి పక్కింటి పిన్నిగారు ఒకసారి పేరంటానికెళ్లి వాళ్ళ పాపని ఎత్తుకుంటుందికదా.

అప్పుడుపాప ఇంక చంక దిగనంటుంది కదా. వాళ్లమ్మ పిలిచినా వాళ్లనాన, బామ్మ పిలిచినా రాను ఫో అంటుంది.

ఆఖరికి ఇంకో పాపాయి వచ్చి ఉంగా బావలో ఆలుకుందాం వత్తావే అని పిలిచినా సరే లానుపో అంతుందే అదీ మొండిపిల్ల

ఏవిటో ఈ పెరపంచకంలో బోల్డుబోల్డు రకాల పిల్లలు.

బోల్డు రకాల పెద్దవాళ్లు. నేను అప్పుడప్పుడు హాచర్యపడిపోయేస్తుంటాను.

(ఇంకా ఉంది)

★ కథపడిందేవ్ ★

(౮-వ పేజీ తరువాయి)

టికెలా మార్మోగుతుంది."

"ఆఁ, హా గాలి!"

"ఏమిటి.. ? పిపా ?"

ఆఁహూఁ!"

"మరి ?"

"అసలు వాళ్లు వేసుకోవద్దూ ?"

"వేసుకో కేంచేస్తారు.. ? మీ అన్న రాసిన కొత్తకథలన్నీ వేస్తున్నారు; నా కథ వేసుకోరూ ?"—"పైగా ఈ వారంలో మొయ్యిపెట్టిన పని దిగ్విజయంగా సాగుతుం దని ఈ రోజు పేపర్లో వారఫలాల్లో అక్క రాలా రాసివుంది .."


"ఎందుకలా చెప్పలేరు? మా అన్నయ్య కున్న పేరు ప్రతిష్టలూ, తెలివి తేటలూ మీకున్నట్లు, మహా...!"

"ఏం, లేక ?"

"మా అన్నయ్య రాసినన్ని కథలు మీరు రాశారా ?. అంతపేబ్బు మీరు సంపా దించారా ?"

"సరే! నీతో యిప్పు డెవరు వాదులాడ తారుగాని, నువ్వెళ్లి పడింది..! ఈకాస్త పూర్తిచేసేస్తాను "

* * *



"దురా! దీనికేం పేరు పెడదా మంటావ్ ?"

"ఏదో ఒకటి పెడుదురూ, గొడవ!"

"అబ్బ! నువ్వుకూడా అల్లా అంటే లాల్లా ? ఏదో నీకుతోచిన మంచి పేరొకటి చెప్పు."

"నన్ను చెప్పమంటే నేనేం చెప్పనండీ! నేనాడైనా రాశానా, యేడ్చానా ?"

"మరి నేనూ అంతేగా!"

"అయితే తెలిసినవాళ్ళ నెవరినైనా అడగండి "

"ఎవరున్నారు, మనకు తెలిసిన రచయిత గాడు?"

"—పోనీ, మా అన్నయ్య నడగండి."

"ఇక్కడ లేడుగా!"

"మావూరు పంపించండి!"

"ఇప్పుడు మీ అన్నయ్యకు పంపటాని కొక బేడ, అక్కణ్ణుంచి వచ్చింతర్వాత మళ్ళీ పత్రిక్కి పంపటాని కొక బేడ— మొత్తం పావలా ఖర్చా?"

"ఖర్చు లేకుండా పనులెల్లా సాగుతాయి. ఇట్లెల్లావస్తుంది.. ?"

"సరే! హెడ్డింగ్ ఖాళీగా వుంచి, 'రచన' అని నా పేరుమాత్రం రాసి పంపి స్తాను..."

"...ఏమని రాస్తారూ?"

'ధర్మ వర్మ' అని.

"ఎబ్బే! ఆ పేరేం బాగుంటుంది? ఏదైనా మంచి పేరు—మా అన్నయ్య పెట్టుకున్న కలం పేరులాంటిది మీరుకూడా ఏదైనా పెట్టుకోండీ! పేరు బాగావస్తుందీ!"

"ఏం పేరెట్టుకోనూ?...ధర్మవర్మ అ బాగాలేదు...'వర్మశ్రీ' అంటే..."

"ఊఁహూఁ!"

"ఊఁ, పోనీ "ధర్మశ్రీ' అంటే..."

"ఛీ! అసలు బాగుళ్లా...అది అసలొక రచయిత పేరలేనే లేందే?"

"పోనీ, నా పేర్కూడా మీ అన్నయ్యనే పెట్టమంటాను..."

"అది మరీమంచిది!"

"అక్కడినుంచే దీన్ని పత్రికకి పంపించ మంటే యింకా బాగుంటుంది!...లేవ కలిసొస్తుంది.. ఏమంటావ్?"

"............"

* * *

"ఏకేప్!...పడింది!"

"ఏమిటది?"

"అదే, మనకథ."

"ఏదీ?"

"ఇదిగో చూడు, ఈ పత్రికలో..."

"ఏం పేరెట్టాడు, మా అన్నయ్య?"

"ఏదో పెట్టాడులే, 'అర్ధనారీశ్వరం' అని."

"అలా నిక్కొకారిపోతారేం...? మరి మీ

శ్రీ కాళహస్తి క్షేత్రం

(30-వ పేజీ తరువాయి)

సిద్ధి వినాయకుడు, కుమారస్వామి వారివారి ఆలయాల్లో దివ్యమంగళ విగ్రహాలై కనిపిస్తారు. ఇక గర్భగుడిలోని శ్రీకాళహస్తీశ్వర లింగం మహనీయత చెప్పనక్కరలేదు. ఆపవిత్ర లింగాన్ని అర్చకులు కూడా తాకకుండా అభిషేకాదులు నిర్వర్తిస్తూ ఉంటారు.

మనదేశంలో ఎక్కడా బ్రహ్మదేవునికి ఆలయాలు లేవు. కాని ఇది కైలాసమే కాబట్టి, పరమశివుని సేవించడానికి బ్రహ్మ కూడా ఇక్కడ వేంచేసి ఉన్నట్లు చెబుతారు. అందుచేతనే మణికంఠేశ్వరాలయానికి దగ్గరలో బ్రహ్మాలయమొకటి ఉన్నది.

ఈ దివ్యక్షేత్రానికి సమీపంలో భారద్వాజతీర్థం, మార్కండేయతీర్థం, పారాశర తీర్థం, భైరవునికోన, వేయిలింగాలకోన మొదలైన అనేక పావన తీర్థాలు, ఎన్నెన్నో శివ ప్రతిమలూ ఉన్నాయి.

కాళహస్తి పట్టణాన్ని ఆనుకుని ప్రవహించే స్వర్ణముఖీనది స్వర్లోక వాహిని కాయయేయని చెప్పవచ్చు. ఎందుకంటే పూర్వం అగస్త్యమహర్షి ఈ పుణ్యక్షేత్రం దర్శించవచ్చే వందలాది భక్తజనాలకు స్నానాద్యనుష్ఠానాలను అనువైన పుణ్యనది లేనందుకు చింతించి గంగాదేవిని గూర్చి దీర్ఘతపస్సు ఆచరించాడట. అప్పుడు కరుణాతరంగాంతరంగ గంగ ప్రత్యక్షమై, తనలో ఒక భాగాన్ని అక్కడ విడిచిందనీ, అదే స్వర్ణముఖీనదియై ప్రవహించిందనీ పెద్దలు చెబుతారు. గంగానదివలెనే స్వర్ణముఖి కూడా పాప నిర్వాపకమైన పుణ్యనది అనడంలో సంశయంలేదు.

ఇలాగ ఎన్నో మహత్తర విశేషాలతో విలసిల్లుతున్న శ్రీ కాళహస్తి అతి పవిత్రమూ, భక్తజన పరమమిత్రమూ, దురితలతాలవిత్రమూ, [illegible] సూత్రమూ అయిన మహాక్షేత్రముగా విలసిల్లుతున్నది. ★

"పేరంపెట్టాడు?"

"మాసుకో, అపక్కనే రాసివుందిగా."

"ఏదీ?...ఊఁ...'వ ధ వ శ్రీ'... అహ్హహ్హా..."

"బాగుందా?...ఎందుకల్లా నవ్వేడుస్తావ్?"

"మీరలా ఉడికిపోతారేం...? మా అన్నయ్య సరిగా మీ పేరే పెట్టాడు...?"

"అది నా పేరా?"

"కాదా?...మీ పేరు 'ధర్మవర్మ'... మరి మీ యింటిపేరు 'వెలగలేటి' వారు... ఈ మొత్తంపేరు పొడి అక్షరాల్లో పెట్టి, చివర 'శ్రీ' చేర్చాడు...! తప్పేముంది?"

"ఓరి యూస్‌లెస్ ఫెలో!"

★

శివరాత్రి మాహాత్మ్యం

(26-వ పేజీ తరువాయి)

కళ్ళారా ఒకసారి చూచి మళ్లీ తిరిగి వచ్చి చేస్తానని అంతవరకు ఓపికపట్టవలసిందనీ బతిమాలింది. బోయవాడు దానిమీద జాలితలిచి పిల్లల్ని చూచిరావడానికనుమతించాడు.

ఆడజింక మొగజింకనీ పిల్లల్ని చూచి వాటితో బోయవానికీ తనకీ జరిగిన సంభాషణ అంతా చెప్పింది. అవి ఆడజింకవలాగ విడచిపెట్టడానికంగీకరించలేదు. తాము కూడా బోయవాని బాణాలకు ఆహుతి అయిపోతామని బయలుదేరాయి. ఆడజింక ఎంతగా వద్దని చెప్పినా వినిపించుకోలేదు.

ఆడజింకనీ, మగజింకనీ పిల్లల్నీ చూసేసరికి బోయవాడి మనసు బాగా కరిగిపోయింది. ఆనాటినించీ అతడు తన వృత్తి విడిచిపెట్టివేస్తానని ప్రతిజ్ఞచేసి విల్లమ్ములు దూరంగా విసిరివేశాడు. ఆ నోరులేని జంతువుల సత్యనిష్ఠకెంతో ఆశ్చర్యపోయాడు. తరవాత ఆడజింక తన పూర్వజన్మ వృత్తాంతం అంతా బోయవానికి తెలియజేసింది:

"పూర్వ జన్మలో నేను రంభను. హిరణ్యాక్షుడనే దానవుణ్ణి ప్రేమించి, శివుని కొలువు విస్మరించాను. శివుడు కోపగించి నన్ను నా భర్తను జింకలై పుట్టవలసిందని శపించాడు. మా ఇద్దరికీ ఒక వ్యాధుని సందర్శనంతో శాపవిముక్తి కాగలదని ఆదేశించాడు."

అంతలో ఆకాశంలో పుష్పవర్షం ప్రారంభమైనది. ఒక దివ్య విమానం వచ్చి జింకలను పిల్లల్ని బోయవాణ్ణి కైలాసానికి తీసుకుపోయింది.

శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యము

శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యంలో శివరాత్రి మాహాత్మ్యం వర్ణించే కథ ఇంకొకటి కనిపిస్తుంది.

ఒక మంత్రికెంతకాలానికీ సంతానం కలగలేదు. తపస్సు చెయ్యగా చెయ్యగా కొంతకాలానికి సుకుమారుడనే కుమారుడు జన్మించాడు.

కాని అతడు కొంచెం పెరిగి పెద్దవాడైనప్పటినించీ చెయ్యని చెడ్డపని అంటూ లేదు. మద్యం తాగేవాడు. మాంసం తినేవాడు. నానా అభాండ్రపు పనులు చేసేవాడు. చివరికి ఆదేశంరాజు అతన్ని దేశంలోనించి వెళ్ళగొట్టించివేశాడు.

అప్పటినించీ అతని అకృత్య చేష్టలు మరింత మితిమీరి పోయాయి. అడవిలోకి వెళ్ళి ఒక మాలపిల్లను పెళ్ళిచేసుకున్నాడు. ఆమె కిద్దరు ముగ్గురు పిల్లలుకూడా పుట్టారు. తరవాత తరవాత అతడింకా ఎన్నెన్నో మహాపాతకాలు చేశాడు.

చిట్టచివరికతనికి వయస్సు బాగామళ్ళిపోయింది. బాగా పెద్దవాడైపోయాడు.

కొంతకాలానికి మరణం ఆసన్నమయింది. కాని అదే సమయంలో శివరాత్రి వచ్చింది. చివరి కతడు, శివస్తోత్రాలువింటూ ప్రాణత్యాగం చేశాడు.

ఆ పుణ్యంవల్ల ఎన్ని ఘోరకృత్యాలు చేసినా అతనికి కైలాసప్రాప్తి కలిగింది.

ఇంకా కాళహస్తీశ్వర మాహాత్మ్యంలో ఇలాంటివే మరికొన్ని కథలు కనిపిస్తాయి. ఒక సాలిపురుగు, పాము, ఏనుగు, తిన్నడనే బోయవాడు శివపూజచేసి కైలాసం చేరుకోవడమే కాళహస్తీశ్వర మాహాత్మ్యంలో ప్రధానకథ.

ఐశ్వర్యప్రదం

శివపూజచేస్తే కోకొల్లలుగా భోగభాగ్యాలు కలుగుతాయని మన ప్రాచీనులంటారు.

కొంచెం కలవారిని చూచి పూర్వజన్మంలో శివుని శిరస్సుపై దశం చేసి పుట్టారని అంటారు. మహాపాపాలు భస్మీపటలం చెయ్యడంలో కూడా మహేశ్వరుడే ప్రప్రథమంగా పరిగణింపదగిన దైవతమని మన వారి నమ్మిక.

శివరాత్రినాడు శివనామోచ్చారణంతో మహాపాతకాలే కాక చలికూడా మంచు విడినట్లు విడిపోతుందని మన సంప్రదాయ వేత్తలంటారు.

మహాశివరాత్రి మన ఆంధ్రదేశానికంతటికీ మంగళప్రదం కాగలదని ఆశిస్తున్నాము. ★

అపరబుద్ధి

[34 వ పేజీ తరువాయి]

వుంది. కొంతం సేపట్లో వాళ్ళు ఇక్కడికి వస్తున్నారు."

"ఆ దెబ్బ తలకు తగిలితే..."

"ఔను. నేనూ అలాగే అనుకున్నాను."

* * *

ఇంటికి తిరిగివచ్చాను. భోజనంచేయటానికి కూచున్నాను. చంద్రశేఖర్‌కి తగిలినదెబ్బను గురించి ఆలోచించసాగాను. అతనికి తలమీద దెబ్బ తగలక పోవటమే మంచిదయింది. పరాకుగా భోజనం చేశాను. గదిలో చాలా సేపటివరకు పచార్లు చేశాను. అలా కొన్ని మైళ్ళు నడిచి వుంటాను. బహుశా రాత్రి లోపల మళ్ళీ కోమలం వస్తుందనుకున్నాను. ఇలా అనుకుంటూ వుండగానే బంగళా కింద ద్వారానికి అమర్చిన గంట మీటను కొక్కిన ధ్వని వినిపించింది.

"నాకు ఎక్కువ వ్యవధి లేదు. చదువుకోటానికి ఆయనకు ఏ వన్నా పుస్తకాలు కావాలట. పుస్తకాల షాపుకి వెళ్ళాలి. ఈపరిస్థితి ఆలోచిస్తూవుంటే నాకు ఎందుకో దుఃఖం వస్తూంది! ఇలా దెబ్బ తగిలి మంచంలో పడివున్న వాళ్ళకి పుస్తకాలేమిటి? చదువెందుకు?" అంది కోమలం లోపల ప్రవేశిస్తూనే.

"ఆయనకు ఎలాంటి దెబ్బ తగిలింది? అది ప్రమాదకరమైనదా?"

"చీలమండదగ్గర తగిలింది. అదేమీ ప్రమాదం చేసేది కాదు. కాలికి పెద్ద కట్టు కట్టారు."

"అయితే నడవగల డన్నమాట?"

"నడవగలరేమో."

"నడిచే అవకాశం కలిగించాలి."

"అంటే?"

"క్రమేణా నడక సాఫీగా రావటానికి కోలకర్ర సహాయంతో సాధన చేయాలి. కాలికి గట్టిగా కట్టుకట్టించాలి. కట్టుకట్టిన కాలితో ఆయన కారు నడపలేడు. అప్పుడు ఆయన రైలు మీదే ప్రయాణం చేయాలి. కోమలం! సరిగా ఇలాంటి అవకాశం కోసమే మనం ఎదురు చూస్తున్నాము తెలిసిందా?" అన్నాను.

"ఔను."

"ఇంకో విషయం నీవు తెలుసుకోవాలి. ఆయన రైలు ఎక్కుతాడని నీతో చెప్పాను. కాని అసలు ఆయన రైలులో ఎక్కడు. ఇది చాలా చిక్కు విషయం. ఆయన్ని సులభంగా గుర్తుపట్టటానికి మనకువున్న సాధనాలేమిటి? కోలకర్ర, కట్టుకట్టిన కాలు- ఇవి చాలు ఆయన్ని పోల్చుకోటానికి. అతడేనని నిర్ధారణ చేయటానికి ఇంతకంటే వేరే సాధనాలు అవసరంలేదు. మనకు ఈ అవకాశాలను పరిస్థితులే సమకూర్చిపెట్టినవి. ఎప్పుడూ మంచంలోనే పడుకుని వుండటంవల్ల ఆయనకు బాగా విసుగు వేస్తుంది. ఈ అవకాశాన్ని నీవు చక్కగా ఉపయోగించాలి. మంచంలో కొన్ని రోజులు పడివున్నాక, విశ్రాంతి కోసం స్థలం మార్చటం, ఇతర చోటికి వెళ్ళిరావటం మనసుకు ఉల్లాసం కలిగిస్తుందని నీవు ఆయనకు చెప్పాలి. మన మంత్రం పారుతుంది. అప్పుడు ఆయన తప్పక బయలు దేరుతాడు. తెలిసిందా?"

"అది అపాయం కాదూ?"

"అపాయమే ముంది అందులో?"

"విరిగిన ఎముకతో, కట్టుకట్టగానే నడిపించటమే! నేను కొంత కాలం నర్సుగాపని చేశాను. ఈ విషయం కొంతవరకు నాకు తెలుసు. ఒక కొయ్యకాలు కట్టినప్పుడు, రెండు కాళ్ళకూ పొడుగులో కొంచం వ్యత్యాసం వుండాలి."

"ఇదేనా నీ సందేహం?"

"ఔను"

అది నేను అట్టే ఆలోచించవలసిన విషయం కాదని చెప్పగానే కోమలం వెళ్ళిపోయింది.

ఆ రోజు పోస్టులో నా పేర ఒక పెద్ద కవరు వచ్చింది. చించిచూశాను. లోపల ఒక బైండు చేసిన పుస్తకం వుంది. లోపలి పేజీ త్రిప్పాను. "సహాయానికి కృతజ్ఞతా సూచనగా కృష్ణమోహన్ గారికి సమర్పించినది," అని రాసివుంది. దాని క్రింద మధుసూదన్ సంతకం చేశాడు.

[ఇంకా వుంది]

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.